వాసుదేవ్... సబ్ టాపిక్ఠ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 247 పేజీలు: 10+4 వెల: 6.50



## భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

క్వాంటం ప్రపంచాన్ని కళ్లకు కట్టిన శాస్త్రవేత్తలు

ముగ్గురు అమెరికన్లకు ప్రతిష్టాత్మక పురస్కారం

5

# 'కోటా'పై ఉత్కంఠ!

## బిసి రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ



మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు, పార్టీ సీనియర్ నేతలలో భేటీ అయిన సిఎం రేవంత్

### రంగంలోకి సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ

### మంత్రులు, పార్టీ సీనియర్లతో సిఎం సమావేశం

### న్యాయపోరాటంతో పాటు రాజకీయ, సామాజిక మద్దతు కూడగట్టే ప్రయత్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు7:** బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై బుధవారం హైకోర్టులో విచారణ జరుగనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఏం తీర్పు ఇవ్వనుందనేది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అనుకూలంగా ఇస్తుందా? పాత విధానంలో రిజర్వేషన్లు పాటించాలని సూచిస్తుందా? ఇంకేదైనా మధ్యే మార్గం సూచిస్తుందా? అనే అంశాలపై తీర్పును ఎదురుచూడాల్సిందే. కాగా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తుంది. మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్,రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింగ్వీతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయంపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు ఢిల్లీలో సింఘ్వీని కలిసి అదే విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైందని,ప్రజల అకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని కోరారు. హైకోర్టులో బుధవారం జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సిఎం నిర్ణయించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సిఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి >>2

'చట్టబద్ధత కల్పించాలి.. లేదంటే ఉద్యమమే' 3



## గ్రూప్-1 నియామకాలపై స్టేకి 'సుప్రీం' నో

### హైకోర్టు తుది తీర్పుకు లోబడే నియామకాలుండాలి

### ద్విసభ్య ధర్మాసనం స్పష్టీకరణ.. విచారణ ముగింపు

### త్వరగా విచారణ ముగించాలని హైకోర్టుకు సూచన

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 7:** తెలంగాణ రాష్ట్రంలోని గ్రూప్-1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు భారత అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అయితే గ్రూప్-1 నియామకాల్లో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్-1 నియామకాలపై కొద్దిరోజుల క్రితం హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించడంపై స్టే ఇవ్వాలని పిటిషనర్ల తరపున న్యాయవాదులు సుప్రీంకోర్టును కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చిల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. తెలంగాణ హైకోర్టులో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర >>2



## ఎఫ్ఆర్‌బిఎం పరిమితి పెంపు

### అదనపు రుణాలకు గ్రీన్ సిగ్నల్

### కేంద్రం నిబంధనలు సడలింపు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రుణాల మంజూరు విషయంలో కేంద్రం నిర్దేశించిన ఫిజికల్ రెస్పాన్సిబులిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బిఎం) నుండి తెలంగాణ సర్కార్‌కు బిగ్ రిలీఫ్ లభించింది. ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని పెంపుదల చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు తెలియవచ్చింది. 2025-26 సంవత్సరానికి ప్రాథమిక అంచనాలకు అదనంగా దాదాపు రూ.15,000 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతి ఇచ్చిందని ఉన్నత స్థాయి వర్గాలు ధృవీకరించాయి. దీనితో మొత్తం అనుమతించదగిన రుణాలు దాదాపు రూ. 69,000 కోట్లకు చేరుకోనున్నాయి. దీనికి సంబంధించి కేంద్రం నిబంధనలు సైతం >>2

5



## ఈసారి ట్రక్కులపై ట్రంప్ టారిఫ్

### 25 శాతం విధింపు

### నవంబర్ 1 నుంచి అమలు

### డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

## ధాన్యం దిగుబడిలో తెలంగాణ రికార్డ్


### 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి

### 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం

### పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 7:** ధాన్యం దిగుబడిలో తెలంగాణ యావత్ భారతదేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించబోతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వానాకాలం సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ఉంటుందన్నారు. దేశ చరిత్రలోనే ఇప్పటి వరకు ఇంతటి దిగుబడి ఏక్కడ నమోదు కాలేదని మంత్రి అన్నారు. వానాకాలం ధాన్యం కొనుగోలుపై పౌర సరఫరాల కేంద్ర కార్యాలయంలో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ తోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నీటిపారుదల విస్తరణతో తెలంగాణా రాష్ట్రం సాధించిన వృద్ధి ధాన్యం దిగుబడిలో ప్రస్ఫుటమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 67.57 లక్షల ఎకరాలలో సాగిన వరి సాగులో 40.75 లక్షల ఎకరాలలో సన్నాలు, 26.82 లక్షల ఎకరాలలో దొడ్డు వడ్ల సాగు చేశారన్నారు. ఇందులో సన్నాలు 90.46 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 57.84 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం కలిపి 148.30 లక్షల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణా రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఇంత పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి అరుదైన రికార్డుగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అభివర్ణించారు. భారతదేశ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డుగా నమోదు అవుతుందన్నారు. ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని అరుదైన రికార్డు నెలకొల్పిన ఘనత తెలంగాణా రైతాంగానికి చెందుతుందన్నారు. అదే సమయంలో కొనుగోళ్లలోను రాష్ట్రం యావత్ భారతదేశానికి మార్గదర్శనంగా నిలుస్తోందన్నారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల >>2



## పొన్నం X అడ్లూరి

### రాష్ట్ర కాంగ్రెస్‌లో దుమారం

### మహేశ్ కుమార్‌గౌడ్‌తో దళిత ఎమ్మెల్యేలు సమావేశం

### మంత్రులు పొన్నం, వివేక్‌పై మందకృష్ణ మాదిగ ఆగ్రహం

### మంత్రి పొన్నంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు7:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బాడీ షేమింగ్ అంశం అధికార కాంగ్రెస్ సెగలు పుట్టిస్తోంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.అడ్లూరితో పాటు దళిత నేతలు,ఎమ్మెల్యేలు అందరూ మంత్రి పొన్నం ప్రభాకర్ సారీ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు నేను ఎలాంటి తప్పుడు మాటలు మాట్లాడలేదు. నా వ్యాఖ్యలను వక్రీకరించారని పొన్నం ప్రభాకర్ వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో దళిత ఎమ్మెల్యేలు మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. కవ్వంపల్లి సత్యనారాయణ,వేముల వీరేశం,మందుల శామ్యూల్, లక్ష్మీకాంత్, కాలే యాదయ్యలు భేటీ అయ్యారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కి జరిగిన అవమానంపై మహేశ్‌కుమార్‌గౌడ్‌తో చర్చించారు. ఇప్పటికే మంత్రి పొన్నం,అడ్లూరి లక్ష్మణ్ ఇద్దరితో మాట్లాడినానని... సమస్య కూడా సాల్వ్ అయిందని మహేశ్‌కుమార్‌గౌడ్ వారితో చెప్పారు. బుధవారం మరోసారి ఇద్దరు మంత్రులను పిలిచి మాట్లాడుతానని హామీ ఇచ్చారు. బాడీ షేమింగ్‌పై తనకు పొన్నం క్షమాపణలు చెప్పకపోతే ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని తాజాగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఒ వీడియోను విడుదల చేశారు. కాగా, అడ్లూరి చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని పొన్నం తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని రహ్మత్‌నగర్‌లో మైనారిటీలకు సంబంధించిన కార్యక్రమంలో >>2



ఘటనాస్థలంలో పోలీసులు

## ప్రేమోన్మాదం

### నల్గొండలో ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

### రేప్ చేసి చంపేశాడని ఆరోపణలు

### నిందితుడు అరెస్టు

**నల్గొండ రూరల్ అక్టోబరు 7, ప్రభాతవార్త:** నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని ప్రేమ పేరుతో దారుణ హత్యకు గురైన సంఘటన మంగళవారం స్థానిక డైట్ కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఓ బాలిక (17) కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలో మండలంలోని గుట్టకింది అన్నారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కృష్ణ గౌడ్ తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. సుమారు ఆరు నెలలుగా వీరు ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో బాలికను గడ్డం కృష్ణ గౌడ్ మిత్రుడు ఆటో డ్రైవర్ కిరాయి ఉంటున్న రూమ్ లోకి తీసుకువెళ్లగా ఇరువురి మధ్య ఘర్షణ జరిగగా బాలికను కృష్ణ గౌడ్ హత్య చేసి డైట్ కళాశాల సమీపంలో పడేసినట్లు తెలిపారు. బాలికపై లైంగిక దాడి జరిపి హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా సంఘటన స్థలాన్ని నల్గొండ డిఎస్పి శివరామిరెడ్డి, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



## ఐటి సోదాల కలకలం

### తెలుగురాష్ట్రాల్లో 25 చోట్ల అధికారుల తనిఖీలు

### రూ.300 కోట్ల దాల్ ట్రేడ్ స్కాంపై ఆరా

### కొనుగోళ్లు చేయకుండానే నివేదికలు.. గుర్తింపు

### కీలక పత్రాలు స్వాధీనం.. కొనసాగుతున్న దాడులు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఐటి సోదాలు కలకలం రేపాయి. ఆరు నెలల క్రితం రెండు రాష్ట్రాల్లో కొందరు వ్యాపారులు 300 కోట్ల రూపాయల పప్పు దినుసుల కొనుగోలు కోసం ఆర్డర్ పొంది, ఎలాంటి కొనుగోళ్లు చేయకుండా వ్యాపార లావాదేవీలు చేసినట్లు తప్పుడు నివేదిక ఇచ్చినట్లు ఐటి అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే >>2



## 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

### మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో

### 18 జిల్లాల అనుసంధానం

### రూ.24,634 కోట్లు అంచనా వ్యయం

### ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం

5



## ప్రజాజీవితంలో పాతికేళ్లు!

### ప్రభుత్వాధినేతగా 25 యేళ్లుగా సేవలు

### ప్రజల జీవితాల బలోపేతం కోసం..

### దేశ ఉజ్వల ప్రగతి కోసం తపన

### ప్రధాని మోడీ ఎక్స్‌లో ఆసక్తికర పోస్ట్



తెలంగాణ నేతలతో చంద్రబాబు

7

## జూబ్లీహిల్స్ బరిలో టిడిపి?

### తెలంగాణలో కమిటీల ఏర్పాటుకు నిర్ణయం

### నేతలతో బాబు చర్చలు

## తుమ్మిడి హెట్టిపై ముందుకే

### క్షేత్రస్థాయిలో అధికారుల బృందం పర్యటన



మంగళవారం తుమ్మిడి హెట్టి వద్ద నీటి లభ్యతను పరిశీలిస్తున్న అధికారుల బృందం

### నీటి లభ్యత, ప్రవాహం, భూమి పరిస్థితిపై ఆరా

### ప్రాణహిత ప్రాజెక్టు పునః ప్రారంభించాలి: సిపిఐ

### 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి: మంత్రి ఉత్తమ్ వెల్లడి

**కౌటాల, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల మండలంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు పునః ప్రారంభించాలని మంగళవారం రోజున రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలనాకు పంపించడం జరిగింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజి నీర్ సత్యరాజచంద్ర, కౌటల తహసీల్దార్ ప్రమోద్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తుమ్మిడి హెట్టి ప్రాణహిత వద్ద నది నీటి లభ్యత, ప్రవాహం, భూమి స్థితి గురించి ఆరా తీశారు. సిపిఐ(ఎం)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం.. >>2



మంగళవారం బెంగళూరులో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## 'ఇందిరమ్మ ఇళ్లు' విజయవంతం!

### కాంగ్రెస్‌చీఫ్ ఖర్గేతో పొంగులేటి

**హైదరాబాద్,అక్టోబర్7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసిసి)అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు,చెల్లింపులు లబ్దిదారుల ఎంపిక విధానం,ఒక్కో ఇంటికి యూనిట్ కాస్ట్ తదితర అంశాలపై ఖర్గే మంత్రిని అడిగి తెలుసుకున్నారు.భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే పేదలకు ఐదు లక్షల రూపాయిలతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే సదుపాయాన్ని కల్పించింది. ఇండ్ల పథకాలలో కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 5 లక్షల రూపాయిలతో 400 చదరపు అడుగులు తగ్గకుండా ఇండ్లను లబ్దిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు.రాష్ట్రంలో గడచిన పది సంవత్సరాలలో పేదలు ఆశించిన మేరకు ఇండ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఇందిరమ్మ ఇండ్లకు డిమాండ్ అధికంగా ఉందని,దీన్ని దృష్టిలో పెట్టుకొని మొదటి దశలో ఈ ఏడాది రూ. 22,500 కోట్లతో నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 4.50 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.లబ్దిదారుల ఎంపిక పూర్తికాగా దాదాపు 2 లక్షలకు పైగా ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు.గత నెలలో సిఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు స్వయంగా హాజరయ్యారని వివరించారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తున్నామన్నారు.రాజకీయాలకు అతీతంగా లబ్దిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం, పేదరికమే అర్హతగా ఇండ్లను మంజూరు చేస్తున్నామని,అడవులను నమ్ముకొని జీవించే చెంచులకు సైతం తొలిసారిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక కాల్ సెంటర్‌ను ఇటీవల ఏర్పాటు చేశామని ,కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపై 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటున్నామని ఖర్గేకు వివరించారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరుతెన్నులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవిరంగా వివరించడంతో దానికి ఖర్గే స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు బాగుందని ఇదే విధంగా ముందుకు సాగాలని మంత్రి పొంగులేటిని అభినందించారు.

## స్టేకి 'సుప్రీం' నో

>> ఆదేశాలు ఇవ్వడంపైనా అభ్యర్థుల తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. ఇరు వాదనల అనంతరం స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇదే కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లు అన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో.. జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈలోగా చేపట్టిన నియామకాలు అన్ రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని ధర్మాసనం సూచించింది. త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం ధర్మాసనం హైకోర్టు డివిజన్ బెంచ్‌కి సూచించింది. తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ముగించినట్టు ధర్మాసనం ప్రకటించింది.

## ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితి పెంపు

>> సడలించినట్లు సమాచారం. కేంద్రం అసాధారణ ఆమోదంతో రాష్ట్ర సర్కార్ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించినట్లయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ఎఫ్‌ఆర్‌బిఎంకు లోబడి రూ.54,009 కోట్ల రుణాలు చేయనున్నట్లు పేర్కొంది. 2025-26 మూడవ త్రైమాసికం అక్టోబరు నుండి డిసెంబరు వరకూ రిజర్వ్ బ్యాంక్ మార్కెట్ రుణాల తాజా క్యాలెండర్ ప్రకారం రూ.9,600 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. రాష్ట్రం ఇప్పటికే మొదటి రెండు త్రైమాసికాల్లో రూ.49,900 కోట్లు అప్పుగా తీసుకుంది. ఇది దాని వార్షిక రుణ పరిమితి రూ.54,009 కోట్లలో 92 శాతానికి పైగా ఉంది. ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలానికి రాష్ట్రానికి రూ.4,109 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. కానీ ఈ కొత్త ప్రతిపాదనతో, డిసెంబర్ చివరి నాటికి మొత్తం మార్కెట్ రుణాలు ఎఫ్ ఆర్‌బిఎం పరిధి దాటి రూ.59,500 కోట్లకు చేరుకుంటాయని ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## ఐటి సోదాల కలకలం

>> హైదరాబాద్‌తో పాటు విజయవాడ, గుంటూరు, వైజాగ్ కర్నూలులో పలుచోట్ల ఐటి అధికారులు సోదా లు చేబట్టారు. హైదరాబాద్ వరకు వస్తే మాదాపూర్, కూకట్‌పల్లి, కొండాపూర్‌లలో తనిఖీలు జరి గాయి. గతంలో ఎపిలో వ్యాపారాలు సాగించిన పలు కంపెనీలు ఐటికి సమర్పించిన లెక్కల్లో తేడాలు వుండడంతో ఆ విభాగం అధికారులు సోదాలు చేబట్టి కీలక పత్రాలను జప్తు చేశారు. గతంలో వైజాగ్‌లోని హిందుస్తాన్ ట్రేడర్స్, కర్నూలులోని వీకేర్ గ్రూప్‌లలో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ఐ టి అధికారులు తాజాగా ఈ కంపెనీలపైనా దాడులు నిర్వహించారు. పప్పు దినుసుల వ్యాపారం చేసే వ్యాపారులు కొన్ని నెలల క్రితం భారీగా నగదు లావాదేవీలు నిర్వహించినట్లు, బ్యాంకుల నుం చి కోట్లాది రూపాయలు విత్ డ్రా చేసినట్లు, వీటికి లెక్కలు లేవని ఐటి శాఖ అధికారులు గుర్తించిన ట్లు సమాచారం. పప్పు దినుసుల వ్యాపారం చేసే కొన్ని కంపెనీలు చౌకధరల దుకాణాలకు పంపిణీ చేయాల్సిన పప్పులను సరిగ్గా అందించకుండా అంతా సరిగ్గా నిర్వహించిన్నట్లు పౌర సరఫరాల విభాగానికి నివేదిక సమర్పించినట్లు ఐటి శాఖ గుర్తించిందని తెలిసింది. పౌర సరఫరాల విభాగం నుంచి నివేదికను తెప్పించుకున్న ఐటి శాఖ అధికారులు వీటి ఆధారంగా ఆయా కంపెనీలపై దాడులు నిర్వహించినట్లు తెలిసింది. దాడులు రాత్రి బా గా పొద్దుపోయే వరకు కొనసాగాయి.

### కొమరం భీమ్‌ది

## ఆత్మగౌరవ పోరాటం

### -మంత్రి సీతక్క

**హైదరాబాద్,అక్టోబర్ 7, ప్రభాతవార్త:** కొమరం భీమ్ పోరాటం ఆత్మగౌరవ పోరాటమని పం చాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై ఆ మహనీయుడు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొమరం భీం పోరాట ఫలితంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్,తొలి ప్రధాని నెహ్రూ ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగంలో ప్రత్యేక రక్షణలు కల్పించా రని,అంతే కాకుండా ఆయన స్ఫూర్తితో గిరిజన మంత్రిత్వ శాఖ ఏర్పాటైంద న్నారు. రాజ్యాంగంలో ఈశాన్య రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించి మైదాన ప్రాంత రాష్ట్రాల్లోని ఆదివాసీలపరిరక్షణ కోసం షెడ్యూల్ 5ను రాజ్యాంగంలో చేర్చినట్లు తెలిపారు.ఐటీడీఏ లో ఏర్పాటులోనూ కొమరంభీం స్ఫూర్తి ఉందని,ఆదివాసీల అభివృద్ధితో కొమరం భీమ్ ఆశయాలు నెరవేరుతాయన్నారు.గిరిజన ఆది వాసిల అభివృద్ధి కోసం సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని, గిరిజన ప్రాంతాల్లో సిఎం ఆదివాసి గిరిజనులకు ప్రత్యేకంగా ఇందిరమ్మఇండ్లు కేటాయించినట్లు తెలిపారు.సోనియా గాంధీ నాయకత్వంలో ఆదివాసి గిరిజనులకు పోడు హక్కులు కల్పిండమే కాకుండా ఉద్యోగాల భర్తీలోను ఆదివాసి గిరిజనులకు ప్రత్యేక హక్కులు కల్పించామన్నారు.ఏజెన్సీ ప్రాంతా ల్లో ఆదివాసి గిరిజనులకు ఉద్యోగాలు కల్పించేందుకు జీవో నెంబర్ 3 పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నామని,అందరికీ భూములు ఇండ్లు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే కొమరం భీం ఆశయాలను సాధించిన వాళ్ళమవుతామన్నారు.తెలంగాణ ఉద్యమ నినాదం కూడా నీళ్ల నిధులు నియామకాలు అంతకుముందే జల్ జంగల్ జమీన్ పోరాటాలు చేశారని,ఆ స్ఫూర్తితోనే తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమం సాగిందన్నారు. సమాజం కోసం పాటుపడినవారి త్యాగాలను కొనియాడాలని,కేవలం సంబరాలు చేసుకుంటే సరిపోదు.వారి త్యాగాలను గుర్తు చేసుకొని వారి స్ఫూర్తిని ముందు తరాలకు అందజే యాలని అన్నారు.

### వారం - వర్జ్యం

08-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
విదియ రా.2.23
అశ్విని రా.10.44
వర్జ్యం : ఉ.7.16-8.41
దు.ఉ.11.32-12.20
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**వృషభం:** ఆరాధనలు, యాత్రలు సంభవము. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయము.

**మిథునం:**విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కర్కాటకం :**దూర ప్రాంతాల నుంది అహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**సింహం:** భూములు, స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు. సోదరుల కలయిక.

**కన్య :**కోర్టుకేసుల నుండి బయటపడుతారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**వృశ్చికం:** శత్రువులు సైతం, మిత్రులుగా మారతారు. ప్రయాణాలు.

**ధనుస్సు:** మాటలచాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు.

**మకరం:** వృత్తి, ఉద్యోగాలలో మీ బుద్ధికుశలత బాగా లాభిస్తుంది.

**కుంభం:** బంధు మిత్రుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మీనం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా జోడేఘాట్‌లోని ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తదితరులు

### జోడేఘాట్‌లో మన్యం

## వీరుడికి నివాళి

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో / కెరమెరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం పరిధిలోగల పోరాటాల గడ్డ, గిరిజనుల హక్కుల కోసం (జల్, జంగల్, జమీన్) అని నైజాం సైన్యంతో పోరాడి అసువులు బాసిన జోడేఘాట్‌లో కుంరం భీమ్ 85వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ లాంచనాలతో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటిడిఏ పిఒ కుష్బూ గుప్తా, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్, కొమురం భీం మనవడు కుమరం సోనేరావుతో కలిసి జోడేఘాట్‌లో కొమరం భీమ్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివాసుల సంస్కృతి ప్రకారం జెండా పండుగలో పాల్గొని కొమురం భీం, కొమురం సూరులకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల సాధన కోసం నియంతృత్వ నైజాం ప్రభుత్వంతో పోరాడిన గోండు వీరుడు కొమురం భీం అని అన్నారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో పోరాడి తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన వీరుడు కుమ్రం భీమ్ అని అన్నారు. గిరిజనుల ఆత్మగౌరవ ఉద్యమాలకు మార్గదర్శకుడని పేర్కొన్నారు. గిరిజన పోరాట యోధుడు, మా ఆరాధ్య దైవం అయిన కుంరం భీం జల్ జంగల్ జమీన్‌ఖి (నీరు, అడవి, భూమి) హక్కుల కోసం పోరాడిన వీరుడని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజన సంస్కృతి, ఆచారా వ్యవహారాలు, సంప్రదాయ పద్ధతుల గురించి ప్రజలకు తెలియజేయడం, గిరిజనులకు కొమురం భీం స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కుమురం భీం ఆశయ సాధనకు ఫలితంగా రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులకు అటవీ భూమి పై హక్కులు కల్పిస్తూ 2005లో చట్టాన్ని తెస్తూ గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కొమురం భీం వారసులకు అధికారులు నూతన వ లను అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్యాం నాయక్, అదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుబడిలో తెలంగాణ రికార్డ్

>> ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు.కనిష్ట మద్దతు ధర కింద కొనుగోలు మొత్తానికి రూ. 21,112 కోట్ల రూపాయలు అవుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందులో నేరుగా రైతులకు చెల్లింపుల కింద రూ. 19,112 కోట్లు ఖర్చు కానున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం బియ్యం సబ్సిడీ నిమిత్తం చెల్లించాల్సిన రూ. 6,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ డిమాండ్ చేశారు. తెలంగాణా రాష్ట్రంలో పండిస్తున్న సన్నాలకు అంతర్జాతీయ స్థాయిలో అధిక డిమాండ్ పలుకుతుందన్నారు. ఇప్పటికే ఫిలిప్పిన్ దేశంతో అనేక దేశాలకు ఉత్పత్తి అవుతుందన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి అయిన నేపద్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకుగాను గిడ్డంగుల కొరత ఉండడం పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. భారత ఆహార సంస్థ అద్వర్యంలోని గిడ్డంగులు 22.61 లక్షల మెట్రిక్ టన్నుల సామర్ధం ఉండగా ఇప్పటికే 21.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువలతో అవి నిండి పోయాయన్నారు.కేవలం 0.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువ ఉంచేందుకు మాత్రమే ఖాళీ ఉందన్నారు. అయితే ప్రస్తుతం 20 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ను వినియోగించే రాష్ట్రాలకు రవాణా చేయక పోవడంతో ఎఫ్.సి.ఐ గిడ్డంగులలో అవి పేరుకపోయాయన్నారు. దీంతో వానాకాలం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు స్థలం కొరవడిందన్నారు.కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని బాయిల్డ్ రైస్‌ను వినియోగించే రాష్ట్రాలకు సత్వరమే తరలించాలని మంత్రి కేంద్రాన్ని కోరారు. 2019-20 లో 72 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 2025-26 నాటికి ఏకంగా 148.30 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి చేరిందంటే నీటిపారుదల శాఖా సాధించిన విజయానికి సంకేతమన్నారు. ధాన్యం కొనుగోళ్ల అంశంలో అధికారులు ఎఫ్.సి.ఐతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించు కోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



టివికె ర్యాలీ తొక్కిసలాట బాధిత కుటుంబాలను తమిళనాడులోని తిరుచిరాపల్లిలో మంగళవారం పరామర్శిస్తున్న తమిళ నటుడు, ఎంపి కమల్ హాసన్

## తుమ్మిడి హెట్టిపై ముందుకే

>> కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై వెంటనే ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణ పనులు పునః ప్రారంభించాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.గోదావరి ఉపనది ప్రాణహితపై నిర్మించ తలపెట్టిన ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను వెంటనే తిరిగి ప్రారంభించాలి అన్నారు. నది నుండి 160 టీఎంసీల నీటిని శ్రీపాద ఎల్లంపల్లికి తరలించాలి, ఎల్లంపల్లి నుండి రంగారెడ్డి జిల్లా శామీర్ పేట్ వరకు తరలించి 16.40 లక్షల ఎకరాలకు సాగు నీరు, హైద్రాబాద్, సికింద్రాబాద్ నగరాలకు త్రాగునీరు మరియు పరిశ్రమలకు నీటిని అందించాలని.తుమ్మిడిహెట్టి వద్ద 5 నుండి 15 కిలోమీటర్ల వరకు ఉన్న ప్యాకేజీని రాంకీ సంస్థకు అప్పగించారని. 15 నుండి 28 కిలోమీటర్ల వరకు ఉన్న ప్యాకేజీని మైటాన్ సంస్థకు అప్పగించారన్నారు. 2006 లో మొబిలైజేషన్ అడ్వాన్స్ లు తీసుకున్నారని,కాలువ పనులు,ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలుపూర్తి కాకుండానే ఆగిపోయాయని.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 20.21 లక్షల ఎకరాల ఆయకటు ఉందని. ఇక్కడ వర్షపాతం 1061 మి.మీటర్లు ఉందని. ఉపరితల నీటి లభ్యత లేదన్నారు.41.85 టీఎంసీల భూగర్భజలాల లభ్యత ఉందని. భారీ, మధ్య తరగతి ప్రాజెక్టులకు 116 టీఎంసీల నీరు కావాలన్నారు.మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద ఆయకట్టును పరిశీలిస్తే 100 ఎకరాలకు పైబడిన చెరువులు 339 ఉండగా, వీటి కింద ఆయకట్టు 71,684 ఎకరాలు, అదే విధంగా 100 ఏకరాలకు లోబడిన చెరువులు 1279 ఉండగా, వీటి కింద ఆయకట్టు 36,237 ఎకరాలు ఉన్నాయని. మొత్తం 1,618 చెరువులుండగా వాటి కింద 1,07,921 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు, చాలా చెరువులకు మరమ్మత్తులు లేవన్నారు,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి వనరులున్నప్పటికీ వాటిని వినియోగించడం లేదన్నారు,దశాబ్దాల తరబడి ప్రాజెక్టుల నిర్మాణాలు ఆగిపోతున్నాయని. దీని కారణంగా జిల్లా వెనుకబడిపోతుందన్నారు.మాజీ ముఖ్యమంత్రి కీ. శే!! డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించి నీటిని విడుదల చేసిన మత్తడి వాగు, ర్యాలీ వాగు, సుద్ద వాగు ప్రాజెక్టుల నుండి నేటికీ నీటి పారకం లేదన్నారు.జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు అతీగతీ లేవని.కాగజ్‌నగర్ సమీపంలోని జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు, ఆసిఫాబాద్ సమీపంలోని కుమురంభీం (అడ) ప్రాజెక్టులు దశాబ్దాలు గడిచినా ఇంకా నిర్మాణ దశలోనే ఉండడం ఈ జిల్లాపై పాలకులకు ఉన్న శ్రద్ధను బహిర్గతం చేస్తోందన్నారు.ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జిల్లాలోని బెజ్జూరు, దహెగాం, కౌటాల, చెన్నూరు, జైపూర్, కోటపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాలకు చెందిన 127 గ్రామాల్లోని 1,66,600 ఎకరాలకు సాగునీరు త్రాగునీరు అందుతుందన్నారు.ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం ముందుకు రావడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ, కుమురంభీం జిల్లా కమిటీ స్వాగతిస్తోందన్నారు.దీని నిర్మాణానికి తక్షణం తగు చర్యలు తీసుకొని పని పునః ప్రారంభించి 2028 సీజన్ నాటికి పని పూర్తి చేసి ఉభయ జిల్లాల రైతులకు మేలు చేకూర్చగలరని విన్నవించుకున్నారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు కూశన రాజన్న జిల్లా కార్యదర్శి ఉన్నారు.

**2027నాటికి తుమ్మిటిహట్టి,ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టు పనులు పూర్తి : మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్,అక్టోబర్ 7, ప్రభాతవార్త :డిసెంబర్ 2027 నాటికి తుమ్మిడిహట్టి, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులు పూర్తి చేయడమే లక్ష్యమని,నీటిపారుదల, పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.మంగళవారం ఆయన అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉన్న తన ఛాంబర్లో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ... డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్ఎల్బీసీ)టన్నెల్, కాళేశ్వరం పథకం కింద ఉన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీలు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో ఉన్నాయని చెప్పారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై ఇంజనీరింగ్ బృందాలు రెండు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నాయన్నారు. ఒక మార్గంలో మైలారం నుంచి 71.5 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్,14 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా సుందిళ్లకు నీరు తీసుకెళ్తుందని,మరొక మార్గంలో ఎల్లంపల్లి ద్వారా పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నామన్నారు.ఈ రెండు మార్గాలపై ఖర్చు, భౌగోళిక అనుకూలత, సాంకేతిక సామర్థ్యాల పరంగా నివేదికను అక్టోబర్ 22 లోపు సమర్పించాలని ఆదేశించారు.ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. "ప్రతి పక్షం ప్రగతి సమీక్ష జరుగుతోంది. టన్నెల్ పనుల్లో ఇంజనీర్లు నిర్ణయించిన ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు.మాన్సూన్ తర్వాత పనులు వేగవంతం చేస్తామని,ఎన్‌జిఆర్‌ఐ ద్వారా హెలికాప్టర్ ఆధారిత మాగ్నటిక్ సర్వే నిర్వహించేందుకు డీజీసీఏ అనుమతులు త్వరలో వస్తాయని అన్నారు. కాళేశ్వరం పథకం కింద ఉన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీల పునరుద్ధరణ పనులు ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## 'కోటా'పై ఉత్కంఠ

>> నటరాజన్,పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి,సిఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సిఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారు. న్యాయపోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. రెండు రోజుల క్రితం సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరఫున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వీ,సిద్దార్థ దవేలు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరిలతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క,మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది.

కాగా, మంత్రుల నివాసంలో మంత్రి వాకిటి శ్రీహరి క్వార్టర్‌లో మంత్రులు, నేతలు సమావేశమయ్యారు. బుధవారం హైకోర్టులో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై వాదనలు ఉండటంతో ప్రభు త్వం నుంచి బలమైన వాదనలు వినిపించే అంశంపై చర్చించారు. న్యాయపరమైన అంశాలను సమగ్రంగా చర్చించి బీసీలకు న్యాయం చేసేందుకు సంయుక్త వ్యూహ రచన చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ సమావేశంలో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ,ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, ఎంపీలు సురేష్ షెట్కర్,అనిల్‌కుమార్ యాదవ్,మాజీ ఎంపీ వి.హనుమంత రావు, ఎమ్మెల్యేలు వీర్లపల్లి ఐలయ్య,రాజ్ ఠాకూర్,నగర మేయర్ విజయలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర బీసీ నేతలు పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి చేసిన దిశానిర్దేశం ప్రకారం నడుచుకోవడంపై బీసీ నాయకుల సమావేశంలో తన ఆలోచన లను మంత్రులు పంచుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

## పొన్నం x అడ్లూరి

>> అసలు ఏం జరిగిందో పిసిసి చీఫ్‌కు తాను పూర్తిగా వివరించానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పరంగా మాకు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశాలు శిరోధార్యమని పేర్కొన్నారు. కాగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామిపై తాజాగా మందకృష్ణ మాదిగా ఫైర్ అయ్యారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌ను పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తోటి దళిత మంత్రి వివేక్ వెంకట స్వామి ఖండించకపోగా సమర్థించినట్లుగానే హావభావాలు ప్రదర్శించడం ఏంటని మండిపడ్డారు. లక్ష్మణ్ మీద పొన్నం వ్యాఖ్యలు మంచిది కాదని దళితులు, బలహీనవర్గాల మధ్య ఈ వివాదం. పెరగవద్దని వెంటనే తాను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫోన్ చేశానని చెప్పారు. ఈ సమస్య మరింత పెద్దది కాకూడదని త్వరగా పరిష్కారం కావాలని చూస్తున్నామన్నారు. ఈ సమస్యకు పరిష్కారం పొన్నం ప్రభాకర్ చెప్పే క్షమాపణ మీదే ఆధారపడి ఉందని అందువల్ల తక్షణం పొన్నం క్షమాపణలు చెప్పాలన్నారు. అడ్లూరి లక్ష్మణ్ పరిధిలో ఉన్న మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమానికి అరగంట ముందుగా వెళ్లి అడ్లూరి రాలేదని ఎందుకు మాట్లాడారు? అసలు ఆ శాఖలో పొన్నం ప్రభాకర్, వివేక్ జోక్యం ఎందుకు అని నిలదీశారు. మీ శాఖల్లో ఇతరులు కోమటిరెడ్డి, పొంగులేటి జోక్యం చేసుకుంటే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. నాడు జరిగిన కార్యక్రమానికి పొన్నం, వివేక్ ను ముఖ్యమంత్రే పంపి ఉంటే సీఎం కూడా తప్పిచేసినట్లేనన్నారు. తోటి దళితుడిని అలా అనకూడదని ఖండించాల్సిన వివేక్ వెంకట స్వామి అడ్లూరిని హేళన చేసినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. అడ్లూరి ఆలస్యంగా వస్తే మేము ఉండలేమి మాట్లాడారు. అసలు మిమ్మల్ని ఎవరు రమ్మన్నారు? ఎవరు పొమ్మన్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.లక్ష్మణ్‌ను వివేక్ గతంలోనే అవమానించారని, తన తండ్రి కాకా 96వ జయంతి ఉత్సవాలకు ఆయనను ఆహ్వానించలేదని విమర్శించారు. తోటి మాల సోదరుడు తోటి మాదిగ మంత్రిని ఆహ్వానించకపోతే ఎలాగని ప్రశ్నించారు. మరోవైపు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు దాఖలైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకు ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సహచర మంత్రి అన్న విజ్ఞత లేకుండా, ప్రజల్లో ఉన్నామనే ఆలోచన లేకుండా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి లక్ష్మణ్‌ను దూషించడం సరికాదని, దీనిని తాము ఖండిస్తున్నామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తక్షణమో సుమోటోగా స్వీకరించి అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు కమిషన్ తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శిల దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు.

### 42 శాతం బిసి రిజర్వేషన్ కేసులో సిపిఐ ఇంప్లీడ్

## హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కూనంనేని

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 7:** స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే కేసులో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) తెలంగాణ రాష్ట్ర సమితి ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయనుంది. ఇందుకు సంబంధించిహైకోర్టులో పిటిషన్‌ను సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు దాఖలు చేశారు. బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా దాఖలైన రిట్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరింది. బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో తమను ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ సిపిఐ తరుపున తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మంగళవారం ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు వర్తించే జిఓ 9ను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వే షన్‌లు పెంచడాన్ని సమర్థిస్తూ, దానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని, ఆ కేసులో తమను కూడా ప్రతివాదులుగా చేర్చాలని కోరు తూ సిపిఐ ఇంప్లీడ్ పిటిషన్ వేసింది. ఇప్పటికే విద్య,ప్రభుత్వ ఉద్యోగాలు సహా స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించే బిల్లులను శాసనసభలో సిపిఐ సంపూర్ణంగా మద్దతు పలికిందని సాంబశివరావు ప్రకటనలో తెలిపారు.

## దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి

### జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించటాన్ని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని, ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు అని పేర్కొన్నారు. ఇది వ్యక్తిపై దాడి కాదు అని, వ్యవస్థపైనే దాడి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని, దీనికి సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి జరగడం ఒక దారుణమైన సంకేతం అని వ్యాఖ్యానించారు. ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా, నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, ఆ వ్యవస్థపైనే జరిగిన దాడి అని చెప్పారు. విశ్వాసం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదం ఉన్నా కూడా హింసను సమర్థించదు అని, ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు కలిగిస్తుందని అన్నారు.

## అప్పుల బాధతో ముగ్గురు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** చేసిన అప్పులు తీర్చలేక, ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలకు చెందిన ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలోని సిరిసిల్లా, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపేటకు చెందిన మొగిలి లక్ష్మణ్ (45) వేములవాడలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అద్దె వాహనాలతో జీవనోపాధి పొందుతూనే గ్రామంలో ఉన్న ఎకరంలో వ్యవసాయం చేస్తున్నాడు. రెండు బోర్లు వేసినా నీళ్లు పడకపోవడం, అద్దె వాహనాలు సరిగ్గా నడవకపోవడంతో అప్పులు పెరిగాయి. వీటిని తీర్చే స్థోమత లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో సోమవారం పొలం వద్దకు వెళ్లిన లక్ష్మణ్ పురుగులమందు తాగి బలన్మరణానికి పాలపడ్డారు. అలాగే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం శివారు పీక్లా తండాకు చెందిన గుగులోత్ భాస్కర్ (40) శివారులో 3 ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నారు. అయితే సాగు కలిసిరాకపోగా, చేసిన అప్పులు పెరిగిపోయి, కుటుంబ ఖర్చులు ఎక్కువై ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తన భూమికి పట్టా పాస్‌పుస్తకం లేకపోవడంతో దాన్ని అమ్ముకునే అవకాశం కూడా లేకుండాపోయింది. దీంతో అప్పులు తీర్చేమార్గం లేక ఇంటి ఆవరణలో ఉన్న పశువుల పాకలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లా శాయంపేట మండలానికి చెందిన నాలికె అనిల్ (29)కు సొంతంగా ఎకరం భూమి ఉండగా, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మూడేళ్లుగా సాగు చేస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం సుమారు రూ.2 లక్షల వరకు అప్పు చేశారు. అయితే ఈ యేడు వేసిన పత్తి పంట వరుసగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్నది. ఈ క్రమంలో పంట పెట్టుబడికి చేసిన అప్పు తీర్చే మార్గం కానరాక, తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో గడ్డిమందు తాగి ప్రాణాలు తీసుకున్నారు.

## వర్షాలతో దెబ్బతిన్న సోయాబీన్

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల, ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో సోయాబీన్ పంట దెబ్బతినడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో సోయాబీన్ తోటలు పుష్పించే మరియు కోత దశలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటను దెబ్బతీయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం, నిర్మల్ జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో, ఆదిలాబాద్ జిల్లాలో 50 వేల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారు. నిర్మల్ జిల్లాలో దాదాపు 72 వేలమంది రైతులు సోయాబీన్ పంటను పండించగా, ఆదిలాబాద్ జిలాలో 40 వేల మంది ఈ పంటను సాగు చేన్నారు. అయితే వర్షాలతో సోయాబీన్ దెబ్బతిని ఎకరానికి దిగుబడి 5 నుండి 3 క్వింటాళ్లకు పడిపోయి రైతులు నష్టం పోయారు. వర్షాల వల్ల జరిగిన నష్టం కారణంగా దిగుబడి బాగా తగ్గిందని రైతులు తెలిపారు. చాలా మంది ఎకరానికి రూ.20 వేల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టారని, కానీ వారి రాబడి ఎకరానికి రూ.15 వేలకు పడిపోయిందని వాపోయారు. దీనికి తగినట్లుగా సాగు పెట్టుబడులు రాబడిని మించిపోయాయి. సోయాబీన్‌కు కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,328గా నిర్ణయించగా, గత కొన్ని రోజులుగా పంట కోతలు కొనసాగుతున్నాయి.



## శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలకు రండి

### సిఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన ఆర్.జె.రత్నాకర్

**శ్రీ సత్యసాయి జిల్లా , అక్టోబరు 7, ప్రభాతవార్త ప్రతినిధి:** రాబో నవంబర్ నెలలో వైభవోపేతంగా నిర్వహించనున్న భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్స వాలలో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్. జె.రత్నాకర్ ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్యసాయి శతజయంతి వేడుకలకు విచ్చేయాలని ఆహ్వానించినట్లు ప్రశాంతి నిలయం మీడియా వర్గాలు తెలిపాయి. ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా విద్య, వైద్యం, త్రాగునీరు రంగాలలో చేసిన సేవలు అజరామరమని కొనియాడడం జరిగిందన్నారు. తెలంగాణలో మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల్లో తాగునీటి పథకాన్ని బాబా ఆ రోజుల్లోనే అందివ్వడం జరిగిందని స్మరించుకున్నట్లు తెలిపారు. తద్వారా ఆయా జిల్లాలో వేలాది మందికి త్రాగునీటి సమస్యను తీర్చిన ఘనత సత్యసాయిబాబా కే దక్కుతుందన్నారు. భగవాన్ బాబా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు, బాబా నిర్యాణం అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్విరామంగా కొనసాగించడం పట్ల హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్టుసభ్యులను అభినందించినట్లు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 16.70 లక్షల మంది

### మొత్తం 21,863 స్కూల్స్, 1,08,910 మంది ఉపాధ్యాయులు
### రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 41వేలు
### మొత్తం విద్యార్థులు 62 లక్షల మంది

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 7:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 16,70,000 మందివిద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 21,863 కొనసాగుతున్నాయి. వాటిల్లో 16.70 లక్షల మంది చదువుకుంటునానరు. రాష్ట్రంలో 18,250 ప్రైమరీ స్కూల్స్, 3143 అప్పర్ ప్రైమరీ స్కూల్స్, 4704 ఉన్నత పాఠశాలలు(హైస్కూల్స్) కొనసాగుతున్నాయి. మొత్తం 21,863 స్కూల్స్ కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు కాకుండా పాఠశాల విద్య శాఖ అధ్వర్యంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(కెజిబివి), మోడల్ స్కూల్స్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్స్ కూడా కొనసాగుతున్నాయి. వాటిల్లో మరో 2.70 లక్షల మంది చదువుతున్నారు. 495 కేజీబీవిల్లో 1,27,198 మంది విద్యార్థులున్నారు. 194 మోడల్ స్కూల్స్‌లో 1,03,000 మంది ఉన్నారు. 35 ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 18,360 మంది కొనసాగుతుండగా.. 29 అర్బన్ రెసిడెన్షిల్ స్కూల్స్‌లో 2174 మంది విద్యను కొనసాగిస్తున్నారు. వీటితో కలిపితే మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో 19.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే రాష్ట్రంలో పాఠశాల విద్య శాఖ అధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలలు సుమారు 11వేల వరకు కొనసాగుతున్నాయి. వాటిలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లో రెండింతల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వివిధ సంక్షేమ శాఖ అధ్వర్యంలో సుమారు 1023 గురుకులాలు కొనసాగుతుండగా వాటిలో సుమారు 2.50 లక్షల మంది చదువుతున్నారు. మొత్తంగా రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 41వేలకుపైగా కొనసాగుతుండగా వాటిలో 62 లక్షల మందివిద్యార్థులు చేరినట్టు యుడైస్ లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలలు తక్కువగా ఉన్నప్పటికీ వాటిల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిగా ఉచిత విద్యను అందిస్తూ, మధ్యాహ్న భోజనం పెడుతూ, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు ఇస్తూ, ఉచితంగా యూనిఫామ్స్ అందజేస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో(గురుకులాలతో కలిపితే) 22.50 లక్షల మంది విద్యను కొనసాగి స్తున్నారు. విపరీతంగా ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల్లో 40 లక్షలకిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 21,863 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 1,08,910 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 21,863 పాఠశాలల్లో 1960 స్కూల్స్‌లో జీరో ఎన్‌రోల్ మెంట్ ఉంది.

## చట్టబద్ధత కల్పించాలి..లేదంటే ఉద్యమమే

### బిసి ప్రజాప్రతినిధుల ఫోరం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



అభివాదం చేస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బాలరాజుగౌడ్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లపై చట్టబద్ధత కల్పించేంతవరకు ఉద్యమ కార్యాచరణ ఆగదని పలువురు వక్తలు తెలిపారు. అన్ని బిసి కుల సంఘాలను కలుపుకొని జెఎసిగా ఏర్పాటై, రాజ్యాధికారమే ధ్యేయంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. బిసిల హక్కుల సాధనకు ఎంతవరకైనా పోరాడుతామని, తెలంగాణ ఉద్యమంకంటే బలమైన బిసి ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బిసి ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన "బిసిలకు 42శాతం రిజర్వేషన్లు న్యాయ వివాదాలు పరిష్కారంపై బిసి సంఘాల సమాలోచన" కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా బిసి జాతీయ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి ఎస్సి, ఎస్టి జెఎసి చైర్మన్ డా.విశారదన్ మహారాజ్ బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందన్నారు. బిసి బిల్లుపై పార్లమెంట్లో చర్చించాలని ఒక్క మాట అనలేదని మండిపడ్డారు. మండల కమిషన్కు వ్యతిరేకంగా కమండల ఉద్యమం నడిపిన నీచ చరిత్ర బిజెపిదని విమర్శించారు. ఏ ఉద్యమం చేయకపోయినా ఆగమేఘాల మీద ఈడబ్ల్యూఎస్ బిల్లును ప్రవేశపెట్టి, నాలుగురోజుల్లో అమలు చేసిన కేంద్రం మెజార్టీ వర్గమైన బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఏదేమైనా బిసిల హక్కులు సాధించేవరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఈసమావేశంలో బిసిపిఎఫ్ అధ్యక్షులు కుమార్ గౌడ్, ప్రధానకార్యదర్శి ప్రణీల్ చందర్, సర్పంచ్ల సంఘం జెఎసి చైర్మన్ యాదయ్యగౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, బిసి సంఘాల నేతలు ఎన్. దుర్గయ్యగౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యెలికట్టె విజయ్కుమార్ గౌడ్, వీరమల్ల రాంనర్సింహ్మగౌడ్, అవ్వారి వేణుకుమార్ ఆలిండియా ఒబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్, కోలా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్‌పై కేసు: ఓటరు కార్డులు పంపిణీ చేశారని అభియోగం

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 7, ప్రభాతవార్త:** అధికారం తమదే అన్న భావనతో కాంగ్రెస్ నేతలు చట్టాన్నే తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ రాకముందే ఇష్టారీతిన వ్యవహరించారు. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ టికెట్ ఆసిస్తున్న నవీన్ యాదవ్ ఏకంగా చట్ట విరుద్ధ కార్యక్రమానికే దిగారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా నకిలీ ఓటర్ ఐడీ కార్డులను పంపిణీ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల యూసుఫ్‌గూడలోని తన కార్యాలయంలో స్థానిక బస్తీవాసులకు ఓటర్ ఐడీ కార్డుల పంపిణీ అంటూ కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయమై ఎలక్షన్ కమిషన్ సీరియస్‌గా తీసుకున్నది. జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి యూసుఫ్‌గూడ సర్కిల్ 19 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1950 సెక్షన్ 23 ప్రకారం ఓటు హక్కు కలిగిన ఓటర్‌ను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ద్వారా ఎన్నికల సంఘం నేరుగా ఓటరు కార్డును పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ గుర్తింపు కార్డులను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో సంబంధిత ప్రధాన ఎన్నికల అధికారి ఆమోదించిన అధికారికంగా అనుమతి పొందిన ఏజెన్సీలు మాత్రమే ముద్రిస్తాయని ఎన్నికల కమిషన్ చెబుతున్నది. అందుకు విరుద్ధంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఆశావాహుడిగా ఉన్న నవీన్ యాదవ్ ఏకంగా నియోజకవర్గం కాంగ్రెస్ కార్యాలయంలో కార్డులను పంపిణీ చేశారు. ఈ అంశంపై పలు రాజకీయ పార్టీలు స్పందించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఇదిలా ఉంటే కాంగ్రెస్ నేతలు ఓటరు కార్డులు పంచుతున్నారని ఎన్నికల కమిషన్‌కు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ చేతులలోకి రావాల్సిన ఓటరు కార్డులు కాంగ్రెస్ నేతల చేతుల్లోకి ఎట్లావచ్చాయి. జీహెచ్‌ఎంసీ కమిషనర్లు, ఎన్నికల అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని రఘునందన్‌రావు ప్రశ్నించారు. కొత్త ఓటర్ కార్డులు పంచుతున్న నవీన్‌యాదవ్ పోటీకి ఎలా అర్హుడు అవుతారని ఓటర్ ఐడీ కార్డులు ఎవరి అనుమతితో పంచుతున్నారని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇచ్చారా లేక ఎన్నికల కమిషనర్ ఇచ్చారని అని ప్రశ్నించారు. సోమవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతోనే ఎన్నికల సంఘం అధికారులు రంగంలోకి దిగారు. నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ కార్డులు పంపిణీ చేయడంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నవీన్ యాదవ్‌పైన బీఎన్‌ఎస్ 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి పట్టివేత కేసు నమోదు



**బాలానగర్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** బాలానగర్ మండల పరిధిలో గుండెడు నుండి ఉడిత్యాల వెళ్లే దారిలో గల కిరాణా షాపులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచార మేరకు జడ్చర్ల ఎక్సైజ్ ఎస్సై నాగరాజు, వారి సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించగా గంజాయి పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ విప్లవ రెడ్డి తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న వి.కిషన్, నేనావత్ కృష్ణ, నేనావత్ లాలీల వద్దనుండి 1.2 కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాదు నుంచి ఒక కేజీ డ్రై గంజాయిని రూ. 15 వేలకు తీసుకువచ్చి, 6 గ్రాముల ప్యాకెట్లుగా తయారుచేసి రూ.400లకు చుట్టుపక్కల కంపెనీలలో పనిచేసే కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసామన్నారు. జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా గంజాయి క్రయ విక్రయాలు జరిపినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నాగరాజు తో పాటు సిబ్బంది సిద్ధార్థ, స్నేహలత, సునీత పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఐటీ సోదాలు?

### ఒక్కొక్కరికి రూ.కోట్లలో జరిమానా
### కలకలం రేపిన ప్రకటన

**జడ్చర్ల, అక్టోబరు7,ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలో ఐటి అధికారుల నోటీసుల జారి కలకలం రేపింది. మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐటీ అధికారుల పలు కంపెనీల్లో పలు వ్యాపార సముదాయాల్లో సోదాలు చేస్తుండగా హైదరాబాద్‌లో ప్రముఖంగా సోదాలు వార్త కలకలం రేపింది. ఈక్రమంలో జడ్చర్ల మున్సిపాలిటీలో మాత్రం ఐటీ అధికారులు సుమారు 15 మంది వ్యాపారస్తులకు రూ.100 కోట్లకు పైగా ఫైన్ విధిస్తూ నోటీసులు జారీ చేశారని సోషల్ మీడియాలో వార్తలు రావడం చర్యనీయాంశంమైంది. అందులో కొందరికి ఒక్కొక్కరికి రూ.5, 9, 11, 15 కోట్ల వరకు ఫైన్ విధించినట్లు సమాచారం. ఇదీ కాక ఈ వ్యాపారులు అంతా మున్సిపాలిటీలో నిత్యం కోట్ల రూపాయల జీరో బిజినెస్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఐటి అధికారులు భారీ మొత్తంలో ఫైన్ విధిస్తూ నోటీసులు జారీ చేశారని పట్టణంలో ప్రజలు చర్చించుకుం టున్నారు. ఏది ఏమైనా ఐటి అధికారులు జడ్చర్ల పట్టణంలోని వ్యాపారులకు 100 కోట్లకు పైగా ఫైన్ విధిస్తున్నట్టు వార్తలు షికారు చేశాయి. అయితే నోటీసులు కూడా జారీ చేయడంతో జడ్చర్ల పట్టణంలో ఏ స్థాయిలో జీరో నడుస్తుందో ఇట్టే తెలిసిపోతున్నది. ప్రభుత్వ ఆదాయానికి వ్యాపారులు ఏ స్థాయిలో గండి కొడుతున్నారు. అర్థం చేసుకో వచ్చని పలువురు చర్చించుకుంటున్నారు.

## ఎన్నికల కోడ్‌తో ముమ్మరంగా తనిఖీలు

### రూ.50 వేలకు మించి తరలిస్తే జప్తు చేయాలని పోలీసులకు ఆదేశాలు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా తగిన ఆధారాలు లేకుండా నగదుతో పాటు నగలు, ఇతర వస్తువుల తరలింపును ఆపేందుకు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేబట్టారు. హైదరా బాద్‌లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ యోజకవర్గానికి ఉప ఎన్నికతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో సర్పంచి, ఎంపిటిసి, జడ్‌పిటిసి స్థానాలకు ఐదు విడతలుగా ఎన్నికలు జరగనుండడం తెలిసిందే. ఈ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో హైదరాబాద్ సహా అన్నిచోట్ల పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలను ఆపుతూ సోదాలు చేబడుతున్నారు. సోమవారం నుంచి మొదలైన వాహనాల తనిఖీలు మంగళవారం ముమ్మరంగా పెరిగాయి. ట్రై కమిషనరేట్లలోని అన్ని ర హదా రులతో పాటు జిల్లాలోని జాతీయ రహదారులపై సాయుధ పోలీసుల పహారాతో ఆయా ప్రాంతాల పోలీసులు వాహనాలను ఆపుతూ తనిఖీలు చేస్తున్నారు. కొన్నిచోట్ల 50 వేల రూపాయలకు మించి నగదు తరలిస్తున్న వ్యక్తులు లేదా వ్యాపారుల నుంచి డబ్బులను పోలీసులు జప్తు చేసినట్లు డిజిపి కార్యాలయానికి సమాచారం అందింది. నగదుతో పాటు తగిన పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న నగలను కూడా పోలీ సులు కొన్నిచోట్ల జప్తు చేసినట్లు సమాచారం. ఎన్నికల కోడ్‌అమల్లో వున్నందున పెద్ద మొత్తంలో నగదు తరలించడాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని ఆయా ప్రాంతాల పోలీసులు వ్యాపారులకు చెబుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తమ అవసరాల కోసం భారీగా నగదు తరలించాలంటే తప్పనిసరిగా తగిన అనుమతి పత్రాలు వెంట తెచ్చుకోవాలని పోలీసులు తెలిపారు. బ్యాంకులతో పాటు ఎటిఎంలకు నగదు తరలించే సంస్థలు కచ్చితంగా తగిన అనుమతి పత్రాలు వెంట తీసుకువెళ్లాలని, లేకుంటే ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వీరితో పాటు మద్యం వ్యాపారులు, ఇతర వ్యాపారాలు కలిగి పెద్ద మొత్తంలో నగదు తరలించే వారు కూడా నిబంధనలను పాటించాలని పోలీసు అధికారులు కోరుతున్నారు. ఎన్నికల కోడ్ అ మల్లో వున్న సమయంలో అనుమతులు లేని డబ్బులు లేదా నగలు, ఇతర విలువైన వస్తువులు పట్టుబడితే కోడ్ ఎత్తేసిన తరువాతే ఇవ్వడం జరు గుతుందని పోలీసులు తెలిపారు.

**హవాలారాయుళ్లపై పోలీసుల నిఘా:** ఇదిలా వుండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో హవాలారాయుళ్లపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల వేళ హవాలా ద్వారా నగదును తరలించడం ఎప్పటి నుంచో జరుగుతోంది. హైదరాబాద్ సహా దేశంలోని నలు నగరాల నుంచి వీటి నిర్వాహకులు కార్యకలాపాలు చేస్తుండగా వారి తరపున ఆయా ప్రాంతాల ఏజెంట్లు ముందుగా అందిన సమాచారం మేరకు ఆయా ప్రాంతాలలోని వ్యక్తులకు కోరినంత నగదు ఇవ్వడం పరిపాటిగా వస్తోంది. అయితే హవాలా ద్వారా నగదు తరలింపును అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా నిఘా వుంచుతారు. ఇందుకోసం ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేయడం, పాత నేరగాళ్లపై నిఘా వుంచడం వంటివి చేస్తుంటారు. ఈసారి కూడా ఇదేవిధంగా వ్యవహరించి హవాలారాయుళ్ల భరతం పట్టాలని పోలీసులు భావిస్తున్నారు.

## లాభాల్లో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ మిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.510 కోట్ల లాభం ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 11.95 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఉత్పత్తి చేసిన యూరియాను అంతే మొత్తంలో వివిధ రాష్ట్రా లకు సరఫరా చేయగా, రూ.5,300 కోట్ల టర్నోవర్ సాధించింది. ఉత్పత్తి చేసిన యూరియాలో తెలంగాణకు 4,68,954.76 టన్నులు, ఆంధ్ర ప్రదేశ్‌కు 1,78,363.39 టన్నులు, కర్ణాటకకు 1,91,288.07 టన్నులు, మహారాష్ట్రకు 82,986.39 టన్నులు, చత్తీస్‌ఘడ్‌కు 60,640.38 టన్ను లు, తమిళనాడుకు 1,01,520.99 టన్నులు, మధ్యప్రదేశ్‌కు 1,11,167.19 టన్నుల చొప్పున సరఫరా చేసింది. అదే 2023 -24 ఆర్థక సంవత్సరంలో 11.19 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేయగా. తద్వారా రూ.441 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఈ లెక్కన గతేడాదితో పోల్చితే 76 వేల మెట్రిక్ టన్నులను అధికఉత్పత్తిచేసి, రూ.69కోట్ల లాభం అదనంగా పొందగలిగింది.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

ఫారం-VII
(చట్టం 30/2013లోని సెక్షన్ 19(1) మరియు నిబంధన 25(1) అనుసరించి)
జిల్లా కలెక్టర్ గారి కార్యాలయం, కామారెడ్డి
డిక్లరేషన్

సబ్ కలెక్టర్, బాన్సువాడ ఫైల్ సంఖ్య:ఎ/3195/2024 తేది: 23.09.2025
జిల్లా కలెక్టర్, కామారెడ్డి ఫైల్ సంఖ్య: జి1/5854/2022 తేది: 27.09.2025
గెజిట్ నెం. 162 తేది: 30.09.2025

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలములోని వడ్డేపల్లి గ్రామములో గల భూమి విస్తీర్ణము ఎ. 02.14 గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన మంజీరా నదిపై నిర్మించతలపెట్టిన మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణంలో భాగంగా స్టేజ్-1 ప్రెజర్ మెయిన్ పైప్ లైన్ (stage-1 Pressure Main Pipe Line) ను Ch.0.000 Km నుండి 0.675 Km వరకు వేయుట కొరకు అవసరము అయి ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, కామారెడ్డి భావించనైనది.

అందువలన, పైన పేర్కొన్న ప్రాజెక్టు నిమిత్తం కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ మండలములోని వడ్డేపల్లి గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.2.14 గుంటల భూమికి కొంచెం ఎక్కువగా కాని, తక్కువగా కాని (ప్రామాణిక కొలతల ప్రకారం) ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం డిక్లరేషన్ జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము : వడ్డేపల్లి మండలం : నిజాంసాగర్ జిల్లా : కామారెడ్డి

| క్ర. సం. | సర్వే నెం. | భూ స్వభావం | భూమి రకము | భూసేకరణ చేయు విస్తీర్ణము (ఎ.-గుం.) | పట్టాదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | సరిహద్దులు తూ | ప | ఉ | ద | చెట్లు సంఖ్య | రకము | నిర్మాణము విస్తీర్ణం | రకము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 34/అ/1/1 | [illegible] | మెట్ట/ ఖుష్కి | 0.0200 | [illegible] | 47 | 36 | 38 | 34 | 1 | వేప చెట్టు | 40 ఫీట్లు | పైప్ లైన్ |
| 2 | 36 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.1100 | [illegible] | 34 | 27 | 37 | 36 | 5 | వేప చెట్లు | 80 ఫీట్లు | పైప్ లైన్ |
| 3 | 37 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.2000 | [illegible] | 34 | 24 | 38 | 36 | - | - | 150 ఫీట్లు | పైప్ లైన్ |
| 4 | 38అ/11 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.0400 | [illegible] | 47 | 37 | 38 | 38 | - | - | 2 | [illegible] |
| 5 | 43/అ/1 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.0100 | [illegible] | 71 | 43 | 43 | 70 | 1 | [illegible] చెట్టు | 30 ఫీట్లు | పైప్ లైన్ |
| 6 | 43/ఆ/2/2/1 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.0050 | [illegible] | 71 | 43 | 43 | 70 | 1 | [illegible] చెట్టు | 30 ఫీట్లు | పైప్ లైన్ |
| 7 | 43/అ/1/1 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.0050 | [illegible] | 71 | 43 | 43 | 70 | - | - | 20 ఫీట్లు | పైప్ లైన్ |
| 8 | 47/అ/1/1 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.1800 | [illegible] | 48 | 38 | 47 | 47 | 1 | వేప చెట్టు | 300 ఫీట్లు; 01 | పైప్ లైన్; [illegible] |
| 9 | 48/అ | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.1450 | [illegible] | 48 | 47 | 70 | 48 | 2 | [illegible] చెట్లు | 160 ఫీట్లు | పైప్ లైన్ |
| 10 | 48/అ/1 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.0950 | [illegible] | 48 | 47 | 70 | 48 | 1 | [illegible] చెట్టు | 200 ఫీట్లు | పైప్ లైన్ |
| 11 | 70/అ/2 | పట్టా | మెట్ట/ ఖుష్కి | 0.1300 | [illegible] | 70 | 70 | 43 | 48 | - | - | 100 ఫీట్లు | పైప్ లైన్ |
| | | మొత్తం | | 2.14 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునరుపాధి కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారం పొందే హక్కు చట్టం, 2013 (చట్ట సంఖ్య 30/2013) యొక్క సెక్షన్ 15 క్రింద కల్పించిన విధంగా, ఆసక్తి గల వ్యక్తుల అభ్యంతరాలను విని, తగిన విధంగా విచారణ జరిపిన అనంతరం ఈ ప్రకటన (డిక్లరేషన్) చేయబడినది. ఈ భూసేకరణ కారణంగా పునరావాసం పొందవలసిన కుటుంబాలు ఏవీ లేవు అని తెలియజేయబడినది.

భూసేకరణకు గురైన భూభాగం క్రింద గల బొగ్గు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఉపయోగితం వున్న పక్షంలో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాను మరియు వివరములు ఏదేని పని దినములలో భూసేకరణ అధికారి మరియు సబ్ కలెక్టర్, బాన్సువాడ గారి కార్యాలయంలో పరిశీలించవచ్చును.

సం/-. భూసేకరణ అధికారి & సబ్ కలెక్టర్, బాన్సువాడ | సం/- అదనపు కలెక్టర్ (రె), కామారెడ్డి. | సం/-. జిల్లా కలెక్టర్ కామారెడ్డి.

DIPR RO.NO: 678/LA/PP/Advt/Pub/2025-26



భారత్ డైనమిక్స్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ)
రక్షణ మంత్రిత్వశాఖ, గచ్చిబౌలి, హైదరాబాద్ - 500 032

Ref:BDL/CC/OT/GT/009/2025-26 తేది: 08.10.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
స్వదేశీ పోటీ బిడ్డింగ్ ఆహ్వానిస్తూ

| క్ర.సం. | టెండర్ ID | వివరణ | అంచనా రూ.లలో |
|---|---|---|---|
| 1 | 66561 | బీడీఎల్, భానూర్ వద్ద ప్లాంట్ ఏరియాలో నిర్వహణ సేవల సౌకర్యం. | 173.86 లక్షలు |

వివరాలకు డ్యాష్ బోర్డ్ పై సెలక్ట్ ఆన్‌లైన్ టెండర్స్ https://bdltenders.abcprocure.com సందర్శించండి. బిడ్స్ ఆన్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయవలెను. "సవరణ ఏదైనా మా వెబ్‌సైట్ ద్వారా మాత్రమే జారీ చేయబడును. మరియు వార్తా పత్రికలలో కాదు".
BDL వెబ్‌సైట్ https://bdl-india.in/registration-contractors ప్రొస్పెక్ట్‌లో విక్రేత ఆన్‌లైన్ కొరకు దరఖాస్తు చేయవలసినదిగా కోరుతున్నాము.
అడిషనల్ జనరల్ మేనేజర్ (Corp Comml)

వార్త

శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడమంత మాధుర్యం మరొకటి లేదు.

-గోథే


# మానవత్వంలోనూ అత్యున్నతమే!

అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి గౌరవ ప్రతిష్టలను కాపాడడం ఈ దేశ సంస్కారం. భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలు కూడా అదే చెబుతున్నాయి. దేశ స్థాయిలోనే వారు అలంకరించిన స్థానం అత్యున్నతమైనది. అలాంటి భారత దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మీద ఓ సీనియర్ న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేసాడు. కోర్టులో తమకనుకూలమైన తీర్పులు రానివారు ఆ న్యాయమూర్తుల పట్ల కసితో రగిలిపోయిన సందర్భాలు చూశాం. కొన్ని ఉదంతాలు కూడా మనకు తెలుసు. కానీ ఏకంగా అత్యున్నత ధర్మాసనం అధిష్టించిన ప్రధాన న్యాయమూర్తిపై ఈ రకమైన దాడి ఇదే తొలిసారి. సభ్యసమాజం హర్షించలేనిది. 'ఈ దాడి భారతీయులందరినీ ఆగ్రహానికి గురి చేసింది. ఇలాంటి చర్యలకు మన సమాజంలో చోటు లేదు' ఈ మాటన్నది ఎవరో కాదు, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌ని ఫోన్‌లో పరామర్శించిన అనంతరం ప్రధాని నరేంద్రమోడీ అన్న మాటలివి. ఘటన జరిగిన సమయంలోనూ, అదే సందర్భంలోనూ ఆ తర్వాత ప్రశాంతతను కాపాడుతూ సిజెఐ స్పందించిన తీరును ప్రధాని అభినందించారు. ఉన్నత ధర్మాసనాన్ని ఎంతో హుందాగా నిర్వహించడంలో గవాయ్ ఎన్నోసార్లు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు. అనేక సంచలనాత్మక నిర్ణయాలను తమ తీర్పుల్లో ప్రవచించేవారు. అంతేకాదు కాల మాన పరిస్థితులకు అనుగుణంగా నేటి తీర్పులుండాలని పదేపదే తమ న్యాయమూర్తులకు బోధించేవారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల విచారణ కోసం ఎదురు చూసేవారు కాలాతీతమవుతోందని భావించే ఆందోళనే తప్ప సుప్రీం తీర్పులను విమర్శించేవారు బహు తక్కువ. న్యాయచట్టాల పరిధిలో తీర్పులు, అప్పీళ్లు, పునశ్చరణ, పునః ప్రస్తావన వంటి ఎన్నో ప్రక్రియలు న్యాయస్థానం గౌరవాన్ని పెంచేటట్లుగానే ఉంటాయి. తుది తీర్పుల్లో న్యాయం అందే తీరుతుందని భారతీయులంతా మెచ్చుకుంటూ న్యాయస్థానాలను, న్యాయాధిపతులను గౌరవిస్తూనే ఉన్నారు. కానీ విచిత్రంగా సోమవారం సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరుగబోయిన అఘాయిత్యాన్ని జాతి యావత్తూ ఖండిస్తోంది. ఈ దాష్టీకానికి ప్రయత్నించింది పరాయి దేశస్థుడో, జాతికుల మత ద్వేషాలున్నవారో కాదు. అతనూ భారతీయుల్లో ఒకరే. ఆయనెలా విమర్శించినా, ఎన్ని ఎత్తుగడలు గుప్పించినా అతని మీద ఎలాంటి కేసు నమోదు చేయవద్దని సిజెఐ ఆదేశించడం ఆయనలోని వ్యక్తిత్వమే చెబుతోంది. ఉన్నత ధర్మాసనాధిపతిగా తీసుకునే ప్రతి చర్యా ఆ స్థానంగౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసేవిగానే ఉంటాయి. సాధారణంగా తమ ముందుకొచ్చిన కేసుల్లోని వాస్తవాలను, లోతుపాతుల్ని వెలికితీసేందుకు న్యాయమూర్తులు బెంచి మీద నుంచి ప్రశ్నలు వేయడం ద్వారా కక్షిదారుల తరపు న్యాయవాదుల వాదనలు, వాటిలోని పసను రాబట్టుకునే ప్రయత్నం చేస్తుండడం సహజం న్యాయ ప్రక్రియలో అదీ ఒక భాగమే. అంతేకాదు కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యలు చేస్తుంటారు. అది సానుకూల వ్యాఖ్యలు కావొచ్చు. కాకపోవచ్చు. అవన్నీ న్యాయాన్వేషణలో భాగంగానే చూడాలి. 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించబోనంటూ' కోర్టు హాల్‌లోని సీనియర్ న్యాయవాది రాకేష్ సురేష్ ఒక్కసారిగా ప్రధాన న్యాయమూర్తి వైపు లంఘించబోగా వేదిక వద్దకు చేరకుండానే భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకొని వారించారు. ఆ సమయంలో కోర్టు నెం.1 బెంచి మీద జస్టిస్ గవాయ్, జస్టిస్ కె. వినోద చంద్రన్‌లు కేసులు నిర్వహిస్తున్నారు. సిజెఐ గవాయ్ మాత్రం ఇలాంటివ్యాఖ్యలు తనను ప్రభావితం చేయబోవని వ్యాఖ్యానించారు. ఇటీవల ఖజురాహోలో విష్ణుమూర్తి విగ్రహ పునఃస్థాపన విషయంలో కోర్టులో సిజెఐ వ్యాఖ్యలకు నిరసనగానే ఇలాంటి ప్రయత్నం జరిగినట్లు తెలిసింది. కేసును కొట్టేసి 'ఆ దేవుడినే ఏదైనా చేయమని అడగండి' అన్న వ్యాఖ్యలపై కొందరికి అసంతృప్తి కలిగిన మాట నిజమే. అది తీర్పులో భాగం కాదు. వ్యాఖ్యానప్రస్తావన మాత్రమే. ఈ అంశాలేవీ తీర్పును ప్రభావితం చేయవు. న్యాయప్రక్రియలో దీనికి పెద్ద దోషమేమీ అంటదు. నిజానికది పురావస్తు శాఖ స్థలం కనుక వారే అనుమతినివ్వాలని తాను చేయగలిగేదేమీ లేదని అన్నారు. ఆ తర్వాత ఒక సందర్భంలో సిజెఐ తాను అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు కూడా. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిందితుడు రాకేశ్ మీద ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించగానే పోలీసులు ఆయనను ప్రశ్నించి వదిలేశారు. ఇప్పుడాయన టీవీ ఛానల్స్‌కు తన చర్యలను సమర్థించుకుంటూ వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. 'ఆ బూటు విసిరించి నేను కాదు, దేవుడేనని' రాకేష్ చేస్తున్న వ్యాఖ్యలు హర్షించదగినవి కావు. సిజెఐ వ్యాఖ్యల నాటి నుంచి తనకు నిద్రపట్టడం లేదని, తనను 'గమ్మునుంటా వెందుకని ఆ దేవుడు తట్టి లేపాడ'ని ఇలా అర్థం లేని వాగుడుతో 'ఏదో దైవికశక్తి నాతో ఆ పనిచేయించిందం' టూ తన తప్పు కప్పిపుచ్చుకోవాలని సంజాయిషీ చెప్పు న్నాడు. జైలుకైనా సిద్ధమట. బార్‌కౌన్సిల్ ఈ ఉదం తంపై స్పందిస్తూ రాకేశ్ దేశంలోని ఏ కోర్టులోనూ వాదిం చకుండా అతడి సభ్యత్వాన్ని తాత్కాలికంగా రద్దు చేసింది. ఈ ఘటన అన్ని రాజకీయ పక్షాల అగ్రనేతలూ ఖండించారు. ప్రధాన న్యాయమూర్తి తనపై దాడియత్నం మీద మానవత్వంతో స్పందించారన్న ప్రశంసలు అందుకున్నారు. తుచ్ఛమైన ప్రచారం కోసం ఓ వ్యక్తి ఇలాంటి చర్యకు పాల్పడ్డారని కొట్టిపారేశారు. ఈ సంఘటన దురదృష్టకరం. భారతీయ సమాజం ఖండిస్తున్న సంఘటన.



ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

సెయింట్ థెరిస్సా



దేశసేవ అంటే ఉపన్యాసాలు దంచడం కాదు. ఎవరి విధిని వారు సక్రమంగా నిర్వర్తించడమే.

మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### నిరంతర పర్యవేక్షణ అవసరం

ప్రభుత్వ బాలికల గురుకులంలో ఒకేసారి 120 మంది బాలికలు అనారోగ్యంపాలవడం ఆందోళనకరం. అందులో 80 మందికి పైగా స్థానిక,జిల్లా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా,30 మందిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. వీరంతా పచ్చ కామెర్లు బారిన పడ్డారు. ప్రాథమికంగా అది హెపటైటిస్ ఏ వైరస్ కారణంగా వచ్చిందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఆ వైరస్ కలుషిత మంచినీరు లేదా ఆహారం తీసుకోవడం వల్ల వస్తుంది. ఆ పాఠశాలలో రక్షిత మంచి నీరు ప్లాంట్ పనిచెయ్యడం లేదని,ఈ ఉదంతం బయట పడ్డాక కొత్త ప్లాంట్‌ని అధికార యంత్రాంగం సమకూర్చిందని వార్త. అదృష్టవశాత్తూ అస్వస్థతకు గురైన పిల్లలు వైద్యుల పర్యవేక్షణలో కోలుకొంటున్నారు. శుభ్రమైన వాతావరణం, రక్షిత మంచినీరు, పౌష్టికాహారం,దోమలు,కీటకాల నుండి రక్షణఅన్నవి అన్నిహాస్టళ్లకు ప్రాథమిక అవసరాలు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### అమెరికాపై ఆధారపడడం తగ్గించాలి

భారతఐటీరంగం ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బి వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం,రిమోట్ డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికసిత భారత్ సాధ్యమా?

పన్నెండవ పంచ వర్షప్రణాళికలో పేర్కొన్నట్టు వేగవంతం అయిన సమ్మిళిత ఆర్థిక వృద్ధేభారత్ లాంటి దేశాలకు శ్రీ రామ రక్షఎందుకని భారత్ ఇప్పటికి వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థతో,గ్రామీణ ఆర్థికవ్యవస్థతో ముడిపడి ఉంది. కాబట్టి గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలి. భారత్ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేపుతున్నట్టు వికసిత భారతం వైపు అడుగులు వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### కల్తీ నూనె విక్రయాల జోరు

వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కల్తీ నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు కల్తీనూనె విక్రయిస్తున్నారు. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి వెళ్తున్నారే తప్ప కల్తీ నూనె విక్రయాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, వివిధ ప్రాంతాల నుంచి డ్రమ్ములు, క్యాన్లలో నూనెను వివిధప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అలాగే లూజు నూనె పేరుతో విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు నకిలీ నూనెను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారు లు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కల్తీనూనె విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

- కామిడి సతీశ్ రెడ్డి,భూపాలపల్లి జిల్లా

### న్యాయస్థాన గౌరవానికి దెబ్బ

దేశ రాజధానిలోని సుప్రీంకోర్టులో జరిగిన ఘటన దేశాన్ని కలవరపరిచింది. ఢిల్లీకి చెందిన న్యాయవాది రాకేష్ కిశోర్ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారిపై కోర్టు మధ్యలో చెప్పు విసిరిన ఘటన తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. సనాతన ధర్మానికి అవమానం సహించను" అని నినదిస్తూ ఈ ఘటన జరగడంతో కోర్టు వాతావరణం క్షణాల్లో ఉద్రిక్తమైంది. వెంటనే భద్రతా సిబ్బంది ఆ న్యాయవాదిని అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఖండిస్తూ, ఆయన న్యాయవృత్తి అనుమతిని తాత్కాలికంగా రద్దు చేసింది. న్యాయ వ్యవస్థ పట్ల అసంతృప్తి లేదా విభిన్నాభిప్రాయాలు ఉన్నా, వాటిని చట్టపరమైన మార్గాల్లోనే వ్యక్తపరచాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్రతిభను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివి పైకిరావాలని ఆశించడం సహజమైనప్పటికీ వారికి ఏరంగంలో ఆసక్తిగలదో తెలుసుకోవాల్సిన అవసరంఉంది. అందుకు ఉపాధ్యాయులు విలువ గల విద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. చిన్న చిన్న తప్పులను క్షమించి మరోసారి పునరావృతం కాకూడదని గట్టిగా హెచ్చరించాలి. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

-ఆర్.వెంకటేష్ చరణ్, బెంగళూరు

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'చేనేత'కు అక్కరకు రాని జిఎస్‌టి

*నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధార పడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమరుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి.*



డాక్టర్ రామకృష్ణ బండారు

మన దేశంలో చేనేత పరిశ్రమ అత్యంత పురాతనమైన వృత్తి. దీనిని దేశ వారసత్వ సంపదగా కూడా గుర్తిస్తారు. వ్యవసాయ రంగం తరు వాత దేశంలో ఎక్కువమంది గ్రామీణ ప్రజలు ఆధారపడ్డ రంగం చేనేత రంగం. ముఖ్యంగా, ఎక్కువ మంది మహిళలు ఆధారపడ్డ రంగం ఇది. గ్రామీణ మహిళా సాధికారతకు అండ గా నిలిచేది చేనేత రంగం మాత్రమే చేనేత పరిశ్రమ మీద ఆధారపడి దేశం లో కొన్ని లక్షల మంది జీవనం సాగిస్తున్నారు. 2019-20 జాతీయ హ్యాండ్లూమ్ సెన్సస్ ప్రకారం సుమారు 26,73, 891 మంది నేతకార్మికులు మన దేశంలో ఉన్నారు. వారిలో 88.7 శాతం గ్రామీణ ప్రాంతాలవారు కాగా 11.3 శాతం పట్టణ ప్రాంతానికి చెందినవారు. మొత్తం చేనేత కార్మికుల లో 71.6 శాతం మహిళలు, 28.4 శాతం పురుషులు. సుమారు 2,10,751 మంది పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలలో కూడా చేనేత కార్మికుల సంఖ్య ఎక్కువే. తెలంగాణలో సుమారు 27,916 కుటుం బాలు చేనేత పరిశ్రమ మీద ఆధారపడి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 19,417 కుటుంబాలు, పట్టణ ప్రాంతాలలో 8,499 కుటుంబాలు చేనేత వృత్తినే నమ్ముకున్నాయి. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో 1,22,644 కుటుంబాలు ఉండగా, గ్రామీణ ప్రాంతాలలో 77,065, పట్టణ ప్రాంతాలలో 45,579 చేనేత కుటుంబాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. పోచంపల్లి, గద్వాల్, ఉప్పాడ, వేంకటగిరి మంగళగిరి ధర్మవరం వంటి ప్రాంతాలు చేనేత వస్త్రాల తయారీకి పెట్టింది పేరు. అలాగే ఈ ప్రాంతాలలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ సైతం కలిగివున్నాయి. దేశ వ్యాప్తంగా చేనేత వస్త్రాలు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. కానీ ఇటీవల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులలో భాగంగా చేనేత,టెక్స్టైల్ రంగంపై ఏకంగా 18 శాతం జిఎస్‌టిని విధించడంతో ఆయా రంగాలపై పెనుభారం పడనుంది. ఇప్పటికే 5శాతం జిఎస్‌టి వలన చేనేత పరిశ్రమ భారీగా నష్టపోతోంది. జిఎస్‌టి 20 లో చేనేత దుస్తులను 18 శాతం స్లాబ్‌లో చేర్చడంపై పరిశ్రమ వర్గాలే కాకుండా ఇటు వినియోగదారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 1000 రూపాయల కంటే తక్కువ ధర ఉన్న చేనేత వస్త్రాలపై 12 శాతం జిఎస్‌టిని విధిస్తున్నారు. నూతన జిఎస్‌టి మార్పులలో భాగంగా, 2500 రూపాయల కంటే తక్కువ ధర ఉండే వస్త్రాలపై 5 శాతం,2500 రూపాయల కంటే ఎక్కువ ధర ఉండే చేనేత, ఇతర వస్త్రాలపైఉన్న 12 శాతం జిఎస్‌టిని 18 శాతంకు పెంచారు. ఈ నెల 22నుండి నూతన రేట్స్ అమలులోకి వచ్చాయి. వాస్తవానికి, జిఎస్‌టి మార్పులలో భాగంగా చేనేత వస్త్రాలపై పన్నును ఎత్తివేస్తారు అనిభావించిన పరిశ్రమ వర్గాలకు జిఎస్‌టిని 12 శాతం నుండి 18 శాతంకు పెంచడం ఆశ్చర్యానికి గురి చేసింది. జిఎస్‌టి పెంపుతో దేశవ్యాప్తంగా చేనేత వస్త్రాల ధరలుపెరుగుతాయి. ఫలితంగా డిమాండ్ తగ్గి చేనేత పరిశ్రమకు నష్టాలు వాటిల్లే అవకాశం ఉన్నది. మొదటి నుండి చేనేత రంగానికి జీఎస్టీ



భారంగా మారింది. 5శాతం పన్నుతో ఈ రంగం మనుగడ కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. దేశంలో కొన్ని రాష్ట్రాలు ముడి సరుకుపై సబ్సిడీని, చేనేత వస్త్రాలపై జిఎస్‌టి పన్ను భారాన్ని భరించడానికి ముందుకు వచ్చినప్పటికీ దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు, సంఘాలు, పరిశ్రమ పన్నుల భారంతో నష్టాలు ఎదుర్కొంటున్నారు. చేనేత కార్మికులు చేతితో తయారు చేసే వస్త్రాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబాలు. చేనేత వస్త్రాలను తయారు చేయడం అంత సులభమైన ప్రక్రియకాదు. ఒక్కో చీరను తయారు చేయడానికి సుమారు 4 నుండి 5 గంటల సమయం పడుతుంది. సహజ సిద్ధమైన దారాలు, రంగులు వంటి ఇతర ముడిసరుకులను ఉపయోగించి భారతీయత కనిపించేలా చేనేత వస్త్రాన్ని తయారు చేస్తారు. అయితే గత కొన్నేళ్లుగా, మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా వస్త్రాలధరలు పెంచడం ద్వారా 5 శాతం స్లాబ్ నుండి 12 శాతం స్లాబ్‌లోకి రావడంతో పన్నుభారం పెరిగి, ధరలు పెరిగి వస్త్రాలకు మార్కెట్‌లో డిమాండ్ లేకుండా పోతుంది. ఫలితంగా ఆదాయం లేక ఇప్పటికే చాలా కుటుంబాలు చేనేత వృత్తిని వదిలి ఇతర వృత్తులను ఎంచుకుంటున్నారు. ఇక ప్రస్తుత 12శాతం నుండి 18 శాతానికి జిఎస్‌టి పెంచడంతో రానున్న రోజుల్లో చేనేత పరిశ్రమ మరింత నష్టాలను ఎదుర్కోక తప్పదు. ఇప్పటికే, చేనేత వృత్తి లాభదాయకం కాకపోవడంతో యువత ఈ రంగాన్ని ఎంచుకోవడంలేదు. భవిష్యత్‌లో పన్నులు పెరగడంతో చేనేత వస్తువులకు ధరలు పెరిగి,మార్కెట్‌లో డిమాండ్ పడిపోయి మరింత నష్టాలు రావడం. తద్వారా చేనేత పరిశ్రమ కనుమరుగయ్యే అవకాశాలు లేకపోలేదు. కార్మికుడి శ్రమతో యంత్రాలు ఉపయోగించకుండా, చేతులతో తయారు చేసే చేనేత ఎంతో మన్నికైనవి. సహజ సిద్ధమైన ముడి సరుకుల ధర కూడా అధికం. ఎంతో కష్టంతో కూడుకుని ఉన్న చేనేత వస్త్రాలు 2500రూపాయల కంటే తక్కువ ధరతో మార్కెట్‌లో అమ్మడం సాధ్యమేనా? దేశంలో పేరొందిన పోచంపల్లి, కంచి, బెనారస్, ధర్మవరం, గద్వాల్ వంటి ఇతర చేనేత వస్త్రాలు కేవలం 2500 రూపాయలకు మార్కెట్‌లో దొరుకుతాయా? కొత్త జిఎస్‌టి ప్రకారం 2500 పైన ధర ఉండే వస్త్రాలపై 18 శాతం పన్ను విధింపపడతాయి. అంటే, భవిష్యత్‌లో ముడిసరుకు,ఇతర కారణాలతో చేనేత వస్త్రాల ధరలు పెరగక తప్పదు. ఫలితంగా, 5 శాతం పన్ను నుండి 18 శాతం పన్ను స్లాబ్‌లోకి రావడంతో ధరలు పెరిగి ఆ భారం వినియోగదారుని మీద పడుతుంది. అప్పుడు చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో కొనుగోలు తగ్గి వాటి మీద ఆధారపడ్డ చేనేత కార్మికులకు నష్టాలు వస్తాయి. గమనించదగ్గ విషయం ఏమిటంటే,చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని 18 శాతానికి పెంచిన కేంద్రం, ఎటువంటి శ్రమ లేకుండా కృత్రిమ దారాలతో, యంత్రాల సహాయంతో తయారు చేసే పాలిస్టర్ వంటి వస్త్రాలపై జిఎస్‌టిని 12 శాతం నుండి 5 శాతంకు తగ్గించింది. యంత్రాల సహాయంతో తయారు చేసిన వస్త్రాలు తక్కువ ధరలకు లభించడంతో వినియోగదారులు వాటిపై మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. ఫలితంగా చేనేత పరిశ్రమకు మరింత నష్టాలు తప్పవు. నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధారపడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమరుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి. ●

# ప్రపంచ దేశాల నెత్తిన ఆర్థిక అస్థిరత్వం

ఐ.ప్రసాదరావు

కోవిడ్ 19 సంభవించిన నాటి నుంచి నేటివరకు దాదాపు అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. నేటికీ చాలా దేశాల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ పారిశ్రామిక సేవారంగాలు పుంజుకోలేదు. ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించింది. ముఖ్యంగా మన దేశంలో పేద మధ్యతరగతి ప్రజలు కరోనా వైరస్ సృష్టించిన విలయతాండవం నుంచి నేటికీ తేరుకోలేదు. వలస వెళ్ళినవారు స్వస్థలాలకు చేరుకుని, తిరిగి వెళ్ళలేదు. దీంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయిరి. అల్ప ఉపాధితో కాలం గడుపుతున్నారు. దీనికి తోడు అధిక ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలతో బ్రతుకులు బహు భారంగా మారింది. నిన్నటి వరకూ జి.యస్.టి భారం. ఇదే సమయంలో విద్యా, వైద్య వైద్యం ప్రైవేటీకరణ జరుగుటచే,సంపాదించిన ఆదాయం కాస్త వీటిపై ఖర్చు చేయడం ద్వారా, దాదాపు డెబ్బై శాతం కుటుంబాలు అప్పులు ఊబిలో చిక్కుకుపోయాయి. గతంలో పారు ( మొండి) బకాయిలు ఎక్కువగా బడా పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక వేత్తల పేర్లు మీద ఉండేవి. వీటికితోడు, నేడు ఈ బకాయిలు ఎక్కువగా వ్యక్తిగత ఖాతాల్లో నమోదు అవుతున్నాయి. ఈ పరిణామాలు ఆందోళనకరమైనవి. దీనికి ప్రధాన కారణం ఉపాధి అవకాశాలు లేకపోవడం. నిరుద్యోగం పెరుగుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అన్నిటికీ మించి 'పొదుపు' కరువైంది. దీనికితోడు 'అనవసర వినియోగం' అనగా 'వినిమయ సంస్కృతి' పెరుగుతుంది. దీంతో మధ్య తరగతి ప్రజల్లో పొదుపు కరువైంది. అప్పులు కుప్పలుగా కుటుంబాలు నెలవు అవుతున్నాయి. ఇక పేద ప్రజల కష్టాలు వర్ణనాతీతం. దేశంలో నేటికీ ఎనభై శాతం మంది ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్, ఉచిత బియ్యం పథకం పై జీవనం సాగిస్తున్నారు. అయితే విచిత్రంగా దేశంలో మిలియనీర్లు, బిలియనీర్ల సంఖ్యపెరిగింది.. సంపద కేంద్రీకృతమైంది. ముఖ్యంగా జి.డి.పి పెరుగుతుంది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది. వాస్తవానికి ఈ జీ.డి.పికి, దేశంలో ఎనభై శాతం ఉన్న పేద మధ్యతరగతి ప్రజల ఆదాయానికి, జీవన ప్రమాణాలకు,ఆర్థిక పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా. ఇక్కడే పాలకులు, మేధావులు, వివిధ ఆర్థిక సర్వే సంస్థలు, ఆర్థికవేత్తలు బహు జాగ్రత్తగా పరిశీలించాలి. నేటికీ పేదరికం భారీస్థాయిలో ఉంది. చాలామంది వేతనాలు కనీసం మూడుపూటలా భోజనం చేయడానికి సరిపోవడం లేదు అనేది కఠోరవాస్తవం. బడా పారిశ్రామిక సంస్థలకు వ్యక్తుల కు కారుచౌకగా ప్రకృతి వనరులు ధారాదత్తం చేయరాదు. ఋణ మాఫీలు, రాయితీలు ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తోంది. ముఖ్యంగా పాలకులుఆర్థిక వ్యవస్థను బలోపే తం చేసేందుకు సన్నాహాలు చేయాలి. ప్రజలకు, యువతకు ఉద్యోగఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పరుచుకోవాలి. ఇక ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు ఆందోళనకరంగా మారడానికి కరోనా వైరస్ సృష్టించిన విలయతాం డవం ఒక కారణం అయితే, తదుపరి రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్, పాలస్తీనా గాజాపై యుద్ధం, ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న 'టారిఫ్ నిర్ణయాలు' మొత్తం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. సాక్షాత్తూ అమెరికాలో కూడా 'షట్ డౌన్' అవుతుంది. అమెరికా డాలర్ విలువ క్షీణిస్తుంది. అమెరికా ఆంక్షల వల్ల యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చైనాలో పరిస్థితి గోప్యంగా ఉన్నా, కొంతమేరకు అక్కడ వస్తు ఎగుమతులు లేక పరిశ్రమలు మూతపడ్డాయి అని నిఘా వర్గాలు తెలుపుతున్నాయి. ఇక మన ఆసియా ఖండంలో ముఖ్యంగా మన ఇరుగు పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్,నేపాల్, పాకిస్థాన్, మయన్మార్ రాజకీయ అస్థిరత్వంతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. మరోవైపు భూకంపాలు,వరదలు వలనఎంతో నష్టం చవిచూస్తున్నాయి. రష్యా గత నాలుగు సంవత్సరాలుగా యుద్ధం చేయడంవల్ల, ఆర్థికపరిస్థితి దెబ్బతింటున్నది. వేళ్ళమీద లెక్కపెట్టే కొన్నిదేశాలు మినహా,దాదాపు ప్రపంచంలోని అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకోవాలి అంటే ముఖ్యంగా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, స్నేహసంబంధాలు మెరుగు పరుచుకోవాలి. ఆధిపత్యధోరణి తగ్గించుకోవాలి. గ్లోబలైజేషన్ వలన ప్రపంచం అంతా కుగ్రామంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని దేశాలు ఒకరికి ఒకరు సహకారించుకోవాలి. ఎగుమతి దిగుమతి సుంకాలు అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఉండాలి. వలస వ్యతి రేకత ఉండరాదు. ప్రతీకార సుంకాలతో పగలు పెంచుకోరాదు. ముఖ్యంగా యుద్ధాలు జోలికి పోకుండా, సమస్యలను చర్చల ద్వారా పరిష్కారించుకోవాలి. ఏ ఉద్దేశంతో అయితే 1945లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేయడం జరిగిందో, ఆ ఆశయాలు లక్ష్యాలు నెరవేర్చడానికి అన్ని దేశాలు ప్రయత్నాలు చేయాలి. ●

# జపాన్ ప్రధాని ముందున్న సవాళ్లు

డి జె మోహన రావు

జపాన్ రాజకీయం మరోసారి కల్లోలంలో పడింది. మధ్యలోనే ప్రధాని పదవి ముగియడం, పార్టీలో అంతర్గత గొడవలు, ఆర్థిక సంక్షోభం, ప్రజల నమ్మకం కోల్పోవడం వంటి కారణాలతో దేశం అస్థిరతలోకి జారుకుంది. అయితే, ఈ సంక్షోభం ఒక చారిత్రక పరిణామానికి నాంది పలికింది. సనే తకైచి జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రాజకీయ సంక్షోభంలో పదవిని కోల్పోయిన మాజీ ప్రధాని షిగేరు ఇషిబా. 2024 అక్టోబర్‌లో ప్రధాని అయిన ఆయన, కేవలం ఒక సంవత్సరంలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అవినీతి ఆరోపణలు, ఎన్నికల్లో ఘోర పరాజయాలు, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి)పై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఇందుకు ప్రధాన కారణాలు. దశాబ్దాల తర్వాత, ఎల్‌డిపి పార్లమెంట్‌లో తన మెజారిటీని కోల్పోయింది. యెన్ విలువ పడిపోవడం, నిత్యావసరాల ధరలు పెరగడం, జీతాలు పెరగకపోవడం వంటి ఆర్థిక సమస్యలు ప్రజల కోపానికి కారణమయ్యాయి. ఈ అంశాలతో పాటు, పార్టీలోని వారి ఒత్తిడి కారణంగా ఇషిబా రాజీనామా తప్పనిసరి అయ్యింది. ఇషిబా రాజీనామాతో ఎల్‌డిపిలో హోరాహోరీ పోటీ జరిగింది. ఈ పోటీలో సనే తకాయచి విజయం సాధించి, అక్టోబర్ మధ్య నాటికి పార్లమెంట్ ఆమోదంతో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆమె గెలుపు కేవలం జపాన్ తొలి మహిళా ప్రధాని కావడమే కాదు, కఠిన సంప్రదాయవాద భావజాలం కలిగిన నాయకురాలు అధికారంలోకి రావడం కూడా ఒక చారిత్రక ఘట్టం. ఆమె దివంగత ప్రధాని షింజో అబేకు అత్యంత సన్నిహితురాలు. అబే జాతీయవాద విధానాలను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యం ఆమెకు ఉంది. దేశం మార్పు కోరుకుంటున్న సమయంలో, ఆమె విజయం మరింత గంభీరమైన రాజకీయ మార్పుకు సంకేతం. నూతన ప్రధాని ముందు ఉన్న సవాళ్లు చిన్నవి కావు. దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం, ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోవడం, సామాజిక సమస్యలను పరిష్కరించడం ఆమెకు అత్యంత కీలకం. జపాన్ చరిత్రలో తరచుగా ప్రధానులు తక్కువ కాలంలోనే పదవీ విరమణ చేయడం సర్వసాధారణం. ఇప్పుడు అదే పరిస్థితి మళ్లీ ఎదురవుతుందేమోనని జపనీయులు ఆందోళన చెందుతున్నారు. తకాయచి ముందు ఉన్న అతిపెద్ద సవాలు ఇదే. ముఖ్యమైన చట్టాలు, బడ్జెట్ ఆమోదం పొందాలంటే ప్రతిపక్షం మద్దతు అనివార్యం. ప్రతిపక్షంతో కలిసి పనిచేస్తూ, ప్రభుత్వాన్ని స్థిరంగా నడిపించ



గలిగితేనే ఆమె నాయకత్వం నిలబడుతుంది. జపాన్ ఆర్థిక వ్యవస్థ దశాబ్దాలుగా స్తబ్దంగా ఉంది. యెన్ విలువ తగ్గిపోవడంతో జీవన వ్యయం పెరిగింది. అబే తరహాలోనే తకాయచి కూడా ప్రభుత్వవ్యయాన్ని పెంచేందుకు మొగ్గు చూపినా, ప్రజలు కోరుకునేది మాత్రం జీతాల పెంపు, మెరుగైన జీవన ప్రమాణాలు. ఈ దిశగా ఆమె తీసుకునే చర్యలుఆమె పాలనకు కీలకం కానున్నాయి. పెరిగిన వృద్ధ జనాభా వల్ల సామాజిక సంక్షేమ ఖర్చులు పెరుగుతూ, దేశంపై మరింత ఆర్థిక భారం పడుతోంది. ఎన్నికల ఓటములు పార్టీ నాయకత్వంపై నమ్మకాన్ని దెబ్బతీశాయి. 'జపాన్ ఫస్ట్' అనే నినాదంతో వలసలు, భద్రత, సైనిక బలోపేతంపై కఠిన వైఖరిని కోరుకునే వర్గాలు పార్టీలో బలంగా మారుతున్నాయి. తకాయచి కఠిన వైఖరి ఈ వర్గానికి అనుకూలంగా ఉన్నప్పటికీ, ప్రజల అసంతృప్తిని తగ్గించాలంటే ఆమె సమన్వయం సాధించాల్సి ఉంటుంది. దేశీయ సవాళ్ల మాదిరిగానే విదేశాంగ విధానం కూడా తకాయచికి కీలకం. ఆమె జపాన్ భద్రత కోసం బలమైన సైన్యం, అమెరికాతో పటిష్టమైన భాగస్వామ్యం, చైనాపై కఠిన వైఖరిని కోరుకుంటారు. అమెరికాతో సంబంధాలు బలంగానే కొనసాగే అవకాశం ఉన్నా,తిరిగి అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ వల్ల కొత్త చిక్కులు తలెత్తవచ్చు. జపాన్ రక్షణ ఖర్చులను జీడీపీలో 3.5శాతం వరకు పెంచాలని ట్రంప్ డిమాండ్ చేసే అవకాశంఉంది. ఈ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ, అమెరికా మద్దతును నిలుపుకోవడం తకాయచికి ఒక సవాలు. ఆసియా పొరుగు దేశాలైన చైనా, దక్షిణ కొరియా పట్ల ఆమె వైఖరి కఠినంగా ఉండవచ్చు. అబే జాతీయవాదానికి మద్దతు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 9 మార్పు సూచనలు, యాసుకుని మందిర సందర్శన వంటి అంశాలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచవచ్చు. అయినప్పటికీ, చైనా జపాన్‌కు ప్రధాన వ్యాపార భాగస్వామి కాబట్టి, తకాయచి తన మాటల్లో కొంత మృదుత్వాన్ని పాటించే అవకాశం ఉంది. ఆమె భారతదేశం, ఆస్ట్రేలియా వంటి దేశాలతో సంబంధాలు బలోపేతం చేసి,క్వాడ్ కూటమిలో జపాన్ పాత్రను మరింత పెంచాలనుకుంటున్నారు. సనే తకాయచి అధికారంలోకి రావడం రాజకీయంగా అనివార్యమైనప్పటికీ, ఇది పాత సంప్రదాయవాదానికి కొత్త చారిత్రక మలుపుగా మారింది. ఎల్‌డిపి తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేస్తూనే, ఒక మహిళా నాయకురాలిని ప్రోత్సహించడం జపాన్ రాజకీయ మార్పుకుసంకేతం. తకాయచికి ముందు ఉన్న పరీక్షలు కఠినమైనవి. ప్రతిపక్షంతో సయోధ్య, ఆర్థిక స్థిరత్వం, విదేశాంగ సమతుల్యత. ఈ పరీక్షల ఫలితమే ఆమెను జపాన్ 'ఐరన్ లేడీ'గా మారుస్తుందా లేదా మరో తాత్కాలిక ప్రధానిగా మిగిలిపోతుందా అన్నది నిర్ణయిస్తుంది. యుద్ధానంతర రాజకీయ స్థిరత్వం ముగిసిన తర్వాత, జపాన్‌లో ప్రారంభమైన ఈ కొత్త అధ్యా యం ఎంతవరకు కొనసాగుతుందో చూడాలి. ●

# భారత్ గౌరవ్ పర్యాటక ప్రత్యేక రైలు




## తెలుగు రాష్ట్రాల మీదుగా గుజరాత్‌కు రాకపోకలు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 7, ప్రభాత వార్త:** తీర్థయాత్రలలో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించాలనుకునే ఔత్సాహిక యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ సీమాంధ్ర మీదుగా గుజరాత్ కు భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 26న మధ్యాహ్నం 03:00 గంటలకు రేణిగుంట నుండి బయలు దేరే 'భారత్ గౌరవ్' ప్రత్యేక పర్యాటక రైలు భవ్య గుజరాత్ ప్యాకేజ్ (9 రాత్రులు / 10 రోజులు) కోసం బయలు దేరుతుంది. ఈ రైలు ఈనెల 27న, సికింద్రాబాద్ కు ఉదయం 08:00 గంటలకు, నిజామాబాద్, నాందేడ్, పూర్ణాల మీదుగా ద్వారకాలోని ద్వారకాధీశ్ ఆలయం, నాగేశ్వర ఆలయం, బేట్‌ద్వారకా, సోమనాథ్‌లోని సోమనాథ్ ఆలయం, అహ్మదా బాద్‌లోని సబర్మతి ఆశ్రమం, మోడేరా లోని సూర్యదేవాలయం (మోడేరా), రాణి కి వావ్ (పటాన్), ఎకతా నగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీలను యాత్రికులకు చూపుతుంది.

**ప్రయాణ మార్గం:** రేణిగుంట నుండి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట్, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్, పూర్ణా మీదుగా ప్రయాణిస్తుంది.

**ప్యాకేజ్ ధరలు:** ఎకానమీ క్లాస్ (స్లీపర్) రూ.18, 400, స్టాండర్డ్ (3ఎసి) 30,200 వేలు, కంఫర్ట్ (2ఏసి) 39,900 వేల రూపాయలు.

**సౌకర్యాలు:** రోజుకు మూడు భోజనాలు, వసతి, రవాణా సదుపాయం, ప్రతి బోగీలో కూడా ఐఆర్‌సిటి సిబ్బంది అందుబాటులో ఉంటారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

**తిరుపతి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు**

ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ తిరుపతి-అనకాపల్లితిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి అనకాపల్లి వెళ్లే నెంబర్ 07481 ప్రత్యేక రైలు నవంబరు 02 నుంచి 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 0800 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 09 30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అనకాపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబరు 07482 ఎక్స్ ప్రెస్ ఈనెల 03 నుంచి డిసెంబర్ 01 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 0535 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 0740 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.





జాన్ క్లార్క్ | మైఖేల్ హెచ్. డివోరెట్ | జాన్ ఎం. మార్టినిస్

# ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

## క్వాంటం టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌పై పరిశోధన

**స్టాక్‌హోమ్, అక్టోబరు 7:** భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి 2025ని ప్రకటించారు. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అణువుల స్థాయిలో మాత్రమే సాధ్యమనుకున్న క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలను, కంటికి కనిపించేంత పెద్ద ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో విజయవంతంగా ప్రదర్శించినందుకుగాను వారికి ఈ గౌరవం దక్కింది. క్వాంటం మెకానిక్స్ ప్రకారం, ఒక కణం తనకు అడ్డుగా ఉన్న గోడను సైతం దాటుకుని వెళ్లగలదు. దీనినే టన్నెలింగ్ అంటారు. అయితే ఇలాంటి వింత ప్రవర్తనలు కేవలం సూక్ష్మ ప్రపంచానికే పరిమితమని ఇప్పటివరకు భావించేవారు. కానీ, ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 1984-85 మధ్యలో చేసిన ప్రయోగాలతో ఈ అభిప్రాయాన్ని మార్చేశారు. వారు సూపర్ కండక్టర్లతో, మధ్యలో ఒక విద్యుత్ నిరోధక పొర (జోసెఫ్ సన్ జంక్షన్) ఉండేలా ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ సర్క్యూట్‌ను రూపొందించారు. ఈ సర్క్యూట్‌లో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు, అందులోని కణాలన్నీ కలిసి ఒకే స్థూల కణంగా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. ఈ స్థూల కణం, ఎలాంటి అడ్డంకి లేకపోయినా క్వాంటం టన్నెలింగ్ ద్వారా సున్నా వోల్టేజ్ స్థితి నుంచి బయటపడటాన్ని వారు నిరూపించారు. అలాగే, ఈ వ్యవస్థ నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే శక్తిని గ్రహించడం లేదా విడుదల చేయడాన్ని కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ ఆవిష్కరణపై నోబెల్ కమిటీ ఛైర్ ఓల్ ఎరిక్సన్ స్పందిస్తూ, "శతాబ్దాల నాటి క్వాంటం మెకానిక్స్ నిరంతరం కొత్త ఆశ్చర్యాలను అందిస్తుండటం అద్భుతంగా ఉంది. అన్ని డిజిటల్ టెక్నాలజీలకు క్వాంటం మెకానిక్సే పునాది కాబట్టి ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పరిశోధనలు క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది.



# ప్రజాజీవితంలో పాతికేళ్లు!

## ప్రధానిమోడీ పునఃశ్చరణం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 యేళ్లు పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 యేళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తనపరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సిఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆనాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సిఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తు చేశారు. భారీభూకంపం, సూపర్‌సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లోపెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు.

# సిజెఐపై దాడిపై నాకెలాంటి పశ్చాత్తాపంలేదు

## ఆ దేవుడే ఇలా చేయించాడు: న్యాయవాది రాకేశ్ కిశోర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసినందుకు తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని న్యాయవాది రాకేశ్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఓ విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన పిటిషన్‌పై సిజెఐ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, అందుకే ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 16న మధ్యప్రదేశ్‌లోని జవారీలో ఉన్న ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహం పునరుద్ధరణపై సిజెఐ ముందు పిటిషన్ విచారణకు వచ్చిందని రాకేశ్ కిశోర్ గుర్తుచేశారు. ఆ సమయంలో "వెళ్లి మీ దేవుడినే ఏదైనా చేయమని అడగండి" అంటూ సిజెఐ వ్యాఖ్యానించడం తనను కలచివేసిందన్నారు. "న్యాయం చేయకపోయినా పర్వాలేదు కానీ, నమ్మకాలను ఎగతాళి చేయకూడదు. పిటిషన్‌ను తిరస్కరించడం అన్యాయం" అని ఆయన పేర్కొన్నారు. తాను హింసకు వ్యతిరేకినని, అయితే ఒక సాధారణ పౌరుడు ఎందుకిలా చేశాడో ఆలోచించాలని అన్నారు. "నేను ఏ మత్తులోనూ లేను. ఆయన చర్యకు ఇది నా ప్రతిస్పందన మాత్రమే. నాకు భయంలేదు, పశ్చాత్తాపం లేదు. క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు. ఈ పని దేవుడే చేయించాడు. నన్ను జైలుకు పంపినా, ఉరితీసినా అది ఆయన చిత్తమే'నని రాకేశ్ కిశోర్ వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం, గుర్తింపు ప్రమాదంలో ఉన్నాయని, ప్రజలు తమ హక్కుల కోసం ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. తనను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేయడంపైనా రాకేశ్ కిశోర్ స్పందించారు. న్యాయవాదుల చట్టంలోని సెక్షన్ 35 ప్రకారం, క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసి, నోటీసు ఇచ్చి, తన వాదన విన్న తర్వాతే చర్యలు తీసుకోవాలని, కానీ బార్ కౌన్సిల్ ఆ నిబంధనలను ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ఇక, సిజెఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మంగళవారం సుప్రీంకోర్టు ఎదుట నిరసన తెలిపింది. ఇది న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!

## రక్షించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు



**లక్నో, అక్టోబరు 7:** ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులు సాధారణంగా కరెంటు, నీళ్లు, రోడ్లు, రేషన్ కార్డుల వంటి సమస్యలపై ఉంటాయి. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు విని అధికారులు నివ్వెరపోయారు. తన భార్య రాత్రిపూట పాముగా మారి తనను కాటు వేయడానికి ప్రయత్నిస్తోందని ఓ భర్త చేసిన ఆరోపణ ఇప్పుడు సంచలనంగా మారింది. మహమూదాబాద్ పరిధిలోని లోధ్సా గ్రామానికి చెందిన మెరాజ్ అనే వ్యక్తి సమాధాన్ దివస్ (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిశాడు. "అయ్యా, నా భార్య నసీమున్ రాత్రి అయితే చాలు పాములా మారిపోతోంది. నన్ను కాటు వేయడానికి వెంట పడుతోందని ఫిర్యాదు చేశాడు. తన భార్య వల్ల తనకు ప్రాణహాని ఉందని, ఆమె తనను మానసికంగా తీవ్రంగా హింసిస్తోందని వాపోయాడు. ఇప్పటికే చాలాసార్లు తనను చంపడానికి ప్రయత్నించిందని, అయితే ప్రతీసారి తాను మెలకువతో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డానని మెరాజ్ తెలిపాడు. నిద్రలో ఉన్నప్పుడు ఏదో ఒక రాత్రి తనను చంపేయగలదని భయం వ్యక్తం చేశాడు. ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్‌కు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు సమర్పించాడు. ఈ వింత ఫిర్యాదుతో ఆశ్చర్యపోయిన జిల్లా కలెక్టర్, వెంటనే దీనిపై విచారణ చేపట్టాలని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డీఎం), పోలీసులను ఆదేశించారు. పోలీసులు దీన్ని మానసిక వేధింపుల కోణంలో దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో వేగంగా వైరల్ అయింది. నెటిజన్లు దీనిపై సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఇంకెంత మందిని కరుస్తోందో ఏమో అని ఒకరు వ్యాఖ్యానించగా, ఏమైనా నాగమణి దాచిపెట్టావా? అని మరొకరు చమత్కరించారు. నీ పెళ్లి జీవితంలో శ్రీదేవి దొరికింది, చాలా అదృష్టవంతుడివి అంటూ 1986 నాటి నాగిన్ సినిమాలో నటి శ్రీదేవి పోషించిన ఇచ్ఛాధారి పాము పాత్రను గుర్తుచేస్తూ మరో నెటిజన్ కామెంట్ చేశారు. ఈ విచిత్రమైన కేసులో అసలు నిజం ఏంటో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# యేడాది తర్వాత కేజ్రీవాల్‌కు అధికారిక నివాసం కేటాయింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు అధికారిక బంగ్లా లభించింది. సిఎం అధికారిక నివాసాన్ని విడిచిపెట్టిన దాదాపు ఏడాది తర్వాత ఆయనకు కేంద్రం అధికారిక బంగ్లాను కేటాయించింది. 95, లోధి ఎస్టేట్‌లోని టైప్ 7 బంగ్లాను కేటాయించింది. అయితే, బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన లోధి ఎస్టేట్ లోని బంగ్లాను కేజ్రీవాల్‌కు కేటాయించాలని ఆప్ కోరింది. కానీ ఆ బంగ్లాను జూన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించడంతో.. కేజ్రీకి వేరే బంగ్లా అలాట్ చేశారు. 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సిఎం పదవి నుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీ చేశారు. నాటి నుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీ సభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు. ఈ క్రమంలో తనకు అధికారిక బంగ్లా కేటాయించాలంటూ కేజ్రివాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా పదిరోజుల్లోగా ప్రభుత్వనివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

## మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఐదురాష్ట్రాలపరిధిలోని 18 జిల్లాలను కలుపుతూ నాలుగు ప్రాజెక్టుల రైల్వే నెట్‌వర్క్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ సమావేశంలో ఈ నాలుగు ప్రాజెక్టులకు సుమారు రూ.24, 634 కోట్ల వ్యయం కాగలదని అంచనావేసారు. వాటిలో మహారాష్ట్రలోని వార్ధా భూసావాల్‌ల మధ్య ఉన్న మూడు, నాలుగో లైన్లు 314 కిలోమీటర్లు, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌పరిధిలోని గోండియా, డోంగర్‌గఢ్ నాలుగోలైన్ 84 కిలోమీటర్లు, గుజరాత్, మధ్యప్రదేశ్ పరిధిలోని 259 కిలోమీటర్ల నిడివికలిగిన వడోదర, రత్లాం మూడు నాలుగు లైన్లను అభివృద్ధి చేస్తారు. ఇటార్సీ, భోపాల్, బీనాలమధ్య నాలుగోలైన్ 237 కిలోమీటర్ల నిడివికలిగింది కూడా ఈ రైల్వే నెట్‌వర్క్ పరిధిలోఉంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు వల్ల సుమారు 85.84 లక్షల జనాభా ఉన్న 3633 గ్రామాలకు, రెండు ప్రధాన స్ఫూర్తిదాయక జిల్లాలు విదిషా, రాజ్‌నందగావ్‌లకు రవాణాసదుపాయం మరింతగా మెరుగుపడుతుందని కేబినెట్ అనంతరం సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. అంతే కాకుండా 18 జిల్లాల పరిధిలో సమగ్రాభివృద్ధితో పాటు స్వయం ఉపాధికూడా పెరుగుతుందని, ప్రజల్లో ఆత్మనిర్భరతను మరింత పెంచాలన్న ప్రధానిమోడీ లక్ష్యానికి అనుగుణంగా ఈప్రాజెక్టులు రూపుదిద్దుకుంటాయని తెలిపారు.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి

## ఏడుగురికి తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** పాకిస్థాన్‌లో ప్రయాణికుల రైలుపై మరోసారి దాడి జరిగింది. క్వెట్టా వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన పేలుడులో కనీసం ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లోని షికార్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలుపై దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. షికార్‌పూర్ జిల్లాలోని సుల్తాన్ కోట్ రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉదయం 8:15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై దుండగులు అమర్చిన బాంబు పేలింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గం గుండా వెళుతున్నప్పుడు ఈపేలుడు సంభవించినట్లు షికార్‌పూర్ డిప్యూటీ కమిషనర్ షకీల్ అబ్రో ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురిలో నలుగురిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి, మిగిలిన ముగ్గురిని షికార్‌పూర్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పేలుడు తర్వాత ప్రయాణికులను సమీప స్టేషన్లకు తరలించి, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సుక్కూర్ డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మోహసిన్ అలీ సియాల్ వివరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు తరచూ దాడులకు గురవుతోంది. గత నెల సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో ఇదే రైలుపై జరిగిన బాంబు దాడిలో 12 మంది గాయపడ్డారు. అంతకు ముందు ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఉగ్రవాదులు ఇదేరైలును హైజాక్ చేసి, 400 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది.

# ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలు

## ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్!




**న్యూయార్క్, అక్టోబరు 7:** మధ్య శ్రేణి, హెవీ డ్యూటీ ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. వచ్చే నెల 1 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపారు. ఈ ట్రక్కులను అమెరికాకు అధికంగా ఎగుమతి చేసే 5 దేశాల్లో మెక్సికో, కెనడా, జపాన్, జర్మనీ, ఫిన్లాండ్ ఉన్నాయి.

# సింగర్ జుబీన్ బాడీగార్డ్ ఖాతాల్లో రూ. కోటి లావాదేవీలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ఓ కీలకవిషయం వెలుగులోకి వచ్చింది. గాయకుడి భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి లావాదేవీలు జరిగాయి. గార్గ్ మృతిపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అంత డబ్బు ఎలా వచ్చిందనే దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాయకుడి మృతి కేసును ఆర్థిక కోణంలో కూడా దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని సిఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. ఇటీవల జుబీన్ బ్యాండ్‌మేట్ శేఖర్‌జ్యోతి గోస్వామి తన వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడికి ఆయన మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ విషమిచ్చి దాన్నిప్రమాదకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారన్నారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏ మాత్రం కంగారు పడలేదన్నారు. వెంటనే చికిత్స అందించకుండా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## వలసలపై ట్రంప్ ఉక్కుపాదం

# యుఎస్ వెళ్లేందుకు భారతీయ విద్యార్థుల అనాసక్తత




**వాషింగ్టన్, అక్టోబర్ 7:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19 శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది. సాధారణంగా యుఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్రదేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు చైనా విద్యార్థులకు యుఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్యకంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. ఈ యేడాదిమేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా లేదా అనే దాన్ని అంచనావేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే సోషల్ మీడియా వెట్టింగ్ అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్1బి వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.

# సంక్షిప్తంగా..

## పికెతో చిరాగ్ చెట్టాపట్టాల్

**పాట్నా, అక్టోబరు 7:** బీహార్‌లో వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కొత్త పొత్తు కుదిరే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ కూటమి కట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ, జేడీయూతో సీట్ల షేరింగ్‌లో లెక్క కుదరడం లేదు. ఎన్డీఏ కూటమిలో షీట్ల షేరింగ్‌పై తాను బీజేపీతో మాత్రమే మాట్లాడుతానని, జేడీయూతో సంబంధం లేదని చిరాగ్‌అన్నారు. బిజెపి కూడా తన డిమాండ్‌ను ఒప్పుకోకపోతే ఏ క్షణంలోనైనా కూటమి నుంచి బయటికి వెళ్లే ఆప్షన్ తనకు ఉన్నదని అన్నారు.

## 'కమల్‌హాసన్ అంతరాత్మను అమ్ముకున్నారు'



**చెన్నై, అక్టోబరు7:** ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం చీఫ్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌పై బీజేపీ నేత అన్నామలై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడటంపై మండిపడ్డారు. కమల్ అధికార డిఎంకెకి అనుకూలంగా ఉన్నారని ఆరోపించారు. రాజ్యసభ సీటు కోసం తన ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరూర్ బాధితుల పరామర్శకు వెళ్లి తొక్కిసలాటలో ప్రభుత్వం తప్పు లేదని అంటే ఎవరైనా అంగీకరిస్తారా ఆయన మరీ ఇంత దిగజారాలా అసలు ఆయన మాటలను తమిళనాడు ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నామలై అన్నారు.

## అధైర్య పడకండి.. నేనొస్తా, ఆదుకుంటా!

**చెన్నై, అక్టోబరు 7:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చిన ఆయన త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం ఆ తర్వాత సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కరూర్‌లో ఘటనాస్థలిని ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమిళగ వెట్రి కళగం సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## బిజెపి నేతపై కాల్పులు.. దుర్మరణం

**బర్హంపూర్, అక్టోబరు 7:** ఒడిశాలోని బరంపురంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేత, సీనియర్ న్యాయవాది పీతాబాస్ పాండాను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కాల్చి చంపారు. గత రాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ కార్యక్రమాన్ని ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో బైకుంఠనగర్‌లోని తన నివాసానికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఇంటి సమీపంలోనే మాటువేసిన ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి పాండాను అడ్డగించారు. అత్యంత సమీపం నుంచి ఆయనపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో పాండా చాతీలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

## గ్రేస్ ఓమైలీకి బ్రిటన్ పౌర పురస్కారం

**లండన్, అక్టోబర్ 7:** రెండేళ్ల క్రితం నాటింగ్‌హాంలో స్నేహితురాలిని కాపాడే ప్రయత్నంలో కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన భారత సంతతి యువతి గ్రేస్ ఓమైలీ కుమార్ (19)కి మరణానంతరం బ్రిటిష్ ప్రభుత్వం ద్వితీయ అత్యున్నత పౌర పురస్కారం జార్జ్ మెడల్‌ను ప్రకటించింది. 2023 జూన్ 13న గ్రేస్ తన స్నేహితురాలు జానబీ వెబర్‌తో కలిసి ఇంటికి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు దాడి జరిగింది. వాల్డోకైలోకేన్ అనే వ్యక్తి వెబర్‌పై వెనకనుంచి కత్తితో దాడి చేయగా, గ్రేస్ ధైర్యంతో అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దాడిలో స్నేహితులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గ్రేస్ క్రీడాకారిణి కూడా. ఆమె ధైర్యం అసలైన శౌర్యానికి మంచి ఉదాహరణ అని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. గ్రేస్ కుటుంబ సభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఇలా మొత్తం 20 మందిని గౌరవిస్తారు.



మంగళవారంప్రజాభవన్‌లో ప్రజావాణిలో చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్-2 సభ్యులు

# ప్రజావాణికి 302 దరఖాస్తులు

## స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 7,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 302దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణా భివృద్ధి శాఖకు సంబంధించి 87దరఖాస్తులు, ఒవెన్యూ శాఖకు సంబంధించి 42దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 102దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 3 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సీఎం ప్రజావాణీ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్‌అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు వినిసంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్ 2 సభ్యులు**

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ -2పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులు చిన్నారెడ్డిని మంగళవారం ప్రజాభవన్‌లో శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రూప్ 2 ఫలితాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పలు మార్లు అభ్యర్థులు ప్రజాభవన్‌లో జరిగే సీఎం ప్రజావాణీకి వచ్చి చిన్నారెడ్డిని కలవగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ సెక్రటరీలతోఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం నింపిన చిన్నారెడ్డిని కలిసి వారు ధన్యవాదాలు తెలిపి పోస్టింగ్స్ కూడా త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు ఆయనను కోరారు.

# 12 వరకు ఆర్‌టిఐ అవగాహన వారం

## విసిలతో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు7:** పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంపై సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) కీలకంగా మారిందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిం చడంలో భాగంగా ఈ నెల 5నుంచి 12 వరకు ఆర్‌టిఐ వీక్-2025ను నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఆయన యూనివర్సిటీ విసిలు, రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, 2005 ప్రజా స్వామ్య పరంపర, పారదర్శకత, జవాబు దారీతనం కోసం కీలకమైన చట్టమని తెలిపారు. భారతదేశంలో ఆర్‌టిఐ చట్ట చరిత్ర, రాజ్యాంగ పరిరక్షణలు (ఆర్టికల్ 19(1) (ఎ) అండ్ 21) ప్రధానమైన సుప్రీంకోర్టు తీర్పులను వివరించారు. ఆర్‌టిఐచట్టం అంతర్జాతీయ మానవహక్కుల ప్రమాణాలను భారత రాజ్యాంగ హామీలతోకలిపి పనిచేస్తుందన్నారు. ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్4 (పబ్లిక్ అథారిటీల బాధ్యతలు), సెక్షన్ 8(మినహాయింపులు) పై విశేషంగా దృష్టిపెట్టారు. ఏ సమాచారం వెల్లడించవచ్చునో, ఏదికాదు అనే దిశానిర్దేశాలను విసి, రిజిస్ట్రార్లకు వివరించారు. విశ్వవిద్యాలయాలకు ఆర్‌టిఐ క్వెరీస్ నిర్వహణ కోసం సాధారణ బుక్లెట్, హ్యాండ్‌బుక్ తయారీలో భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమం ముగింపులో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఆర్‌టిఐ వారం (5నుంచి 12 అక్టోబర్) అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఫోటోలు, నివేదికలను ఈనెల 15 నాటికి తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలికి సమర్పించాలని సూచించారు.

## పిజిఇ సెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో

# 2926 మందికి సీట్ల కేటాయింపు

## 9లోగా కాలేజీల్లో చేరాలి: అడ్మిషన్ల కన్వీనర్ పాండురంగా రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 7:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎంఈ, ఎంటెక్ ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో చేరడం కోసం నిర్వహించిన పిజిఈసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు మంగళవారం చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 3345 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 2926 మందికి సీట్లకేటాయింపు చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 5370 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వారిలో 2926 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 9లోగా ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని సూచించారు. మొదటి విడతలో 5529 సీట్లు అందుబాటులో ఉండగా వాటి కోసం 7471 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. అందులో 4320 మందికి సీట్ల కేటాయింపు చేయగా వారిలో 2521 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిపారు. ఫైనల్ ఫేజ్‌లో 3345 సీట్లకిగానూ 2926 సీట్లను కేటాయించారు.

# కులధ్రువీకరణ పత్రాలు మళ్లీ సమర్పించండి

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్టీసిలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టులకు దరఖాస్తు చేసిన ఎస్‌సి అభ్యర్థులు తమ కుల ధృవీకరణ పత్రాలను తాజా జిఒ అనుసారం నూతన ఫార్మట్‌లో సంబంధిత తహసీల్‌దార్ కార్యాలయాల నుంచి తీసుకుని, వాటిని సమర్పించాలని పోలీసు నియామక మండలి కోరింది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలను నూతన ఫార్మట్‌లో ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.




పోటీలను ప్రారంభిస్తున్న అదనపు జిఎం సత్యప్రకాష్ తదితరులు

# ఆల్ ఇండియా రైల్వే కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

**తార్నాక, అక్టోబరు 7 ప్రభాతవార్త :** రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ (ఆర్.ఎస్.పి.బి) ఆధ్వర్యంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసి యేషన్ 47వఆల్ ఇండియా రైల్వే కబడ్డీ (మహిళలు) ఛాంపియన్ షిప్ పోటీలను ఈ నెల 7నుండి 10 అక్టోబర్ వరకు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్ మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఫైనాన్షియల్ అడ్వైజర్ మరియు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, స్టోర్స్ వర్క్‌షాప్ పి. కోటేశ్వరరావు ఇతర సీనియర్ రైల్వే అధికారులు మరియు క్రీడా సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సంవత్సరం సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్టర్న్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే, సెంట్రల్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, నార్త్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్‌కోస్ట్ రైల్వే మరియు ఆతిథ్య వహిస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వేలకు సంబందించిన మొత్తం తొమ్మిదిజట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. ఈ టోర్నమెంట్‌లో అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఆటగాళ్ళు పాల్గొంటారు. తొలి నాకౌట్ ప్రారంభ మ్యాచ్ దక్షిణ మధ్య రైల్వే, నార్త్ ఈస్టర్న్ రైల్వే మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో దక్షిణ మధ్యరైల్వే 48పాయింట్లు సాధించి విజేతగా నిలువగా, నార్త్ ఈస్టర్న్‌రైల్వే 25 పాయింట్లు సాధించింది. ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్లకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నిజమైన క్రీడా స్ఫూర్తి, నిబద్ధత మరియు కృషిని ప్రదర్శించాలని ఆయన పాల్గొనే వారిని ప్రోత్సహించారు.

# గోల్ఫ్ టోర్నీలో కోరుకొండ విజయఢంకా

**హైదరాబాద్‌అక్టోబరు 7, ప్రభాతవార్త :** అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన ఆర్డీ ఇంజినీరింగ్ సైనిక్ స్కూల్స్ అలుమ్ని గోల్ఫ్ టోర్నమెంట్ 2025హైదరాబాద్‌లోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ లోని బ్యాంక్వెట్ హాల్‌లో ఘనంగా ముగిసింది. గాలా డిన్నర్, అవార్డుల ప్రదానో త్సవంతో ఆ సాయంత్రం సైనిక, సివిల్ అధికారులు, పరిశ్రమ నాయకులు, వ్యాపారవేత్తలు, గోల్ఫ్ అభిమానులతో కళకళలాడింది. 2 రోజుల ఉత్కంఠభరితమైన పోటీల అనంతరం, సైనిక్ స్కూల్ కోరుకొండ చాంపియన్‌గా



నిలిచింది. సైనిక్ స్కూల్ చిత్తోర్గఢ్ రన్నరప్ స్థానం సాధించింది. ఆర్డీ ఇంజినీరింగ్ లిమిటెడ్ ఛైర్మన్, ఎండి చంద్రశేఖర్ మోటూరు విజేతలకు చాంపియన్ షిప్ ట్రోఫీ అందచేశారు.

# అడ్డదారులు తొక్కిన అధికారులు

## ఎసిబి చిక్కిన డ్రగ్ కంట్రోల్ అధికారులు

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** ప్రజలకు నమ్మకం కలిగించేందుకు నిరంతరం ఫార్మసీలను తనిఖీలు చేసి నాణ్యమైన మందులు, సేవలందిస్తున్నారని నిర్ధారించాల్సిన అధికారులు అడ్డదారులు తొక్కారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఫార్మసీని తనిఖీచేసి సర్టిఫికెట్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్‌చేసి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా మంగళవారం జిల్లా కేంద్రంలో పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి జిల్లా కేంద్రానికి డ్రగ్ కంట్రోల్ విభాగం ఉంటుంది. ఫార్మసీలను, అనుమతులు లేకుండా మార్కెట్లో లభ్యమయ్యే మందులను తనిఖీలు చేసి వాటి వినియోగంపై పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాల్సిన పని డ్రగ్ కంట్రోల్ విభాగం విధి. ప్రతి ఏటా ప్రైవేట్ ఆస్పత్రుల



ఫార్మసీ దుకాణాలను తనిఖీలు చేసి సర్టిపై చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఫార్మసీస్ట్ లైసెన్సులు పునరుద్ధరించడం వారి విధుల్లో భాగం.. అయితే దీనికోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గల ఫార్మసీకి క్లీన్ చిట్ ఇచ్చేందుకు డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులు డబ్బులు డిమాండ్ చేశారు. అధికారుల అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోవడంతో మందుల దుకాణాల నిర్వాహకులు అవినీతి నిరోధకశాఖ అధికారులను సంప్రదించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు మంగళవారం రంగంలోకిదిగారు. బాధితుని నుంచి డిమాండ్ చేసిన లంచం డబ్బులు రూ.20,000 అధికారులకు చెందిన ఓ ప్రైవేటు వ్యక్తి తీసుకుంటుండగా దాడులు నిర్వహించడంతో రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. డబ్బులు తీసుకున్న రామును అదుపులోకి తీసుకొని అతనిని పురమాయించిన డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి లంచంగా తీసుకున్న డబ్బులను రికవరీచేసి రసాయన పరీక్షలు నిర్వహించి, నిర్ధారించి అధికారులు ఎసిబి కార్యాలయానికి తరలించి విచారణ అనంతరం నిందితుల ముగ్గురిని కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

# భీమ్ పోరాట స్ఫూర్తి ప్రపంచానికి ఆదర్శం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీం పోరాట స్ఫూర్తి తెలంగాణకే కాదు యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివాసీల ఆరాధ్యదైవం కుమ్రం భీం 85వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కుమ్రం భీం విగ్రహానికి సంప్రదాయ బద్ధంగా నివాళర్పించి, సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి పూజలు చేసి



భీం స్మృతి చిహ్నాం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆదివాసీల ఆశాజ్యోతి కుమ్రం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని, ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం.. బానిసత్వపు సంకెళ్ల తెంచడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని, స్వయంపాలన ఉద్యమానికి పితామహుడిగా నిలిచిన కుమ్రం భీం చరిత్ర భావితరాలకు ఆదర్శనీయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కొమ్రం భీం మనువడు సోనేరావు, ఆదివాసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# డిజిపి కార్యాలయంలో వాల్మీకి జయంతి



**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు డిజిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి, ఈ సందర్బ ంగా వాల్మీకి చిత్ర పటానికి శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించడంతో పాటు వాల్మీకి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. మహర్షి వాల్మీకి ఆలోచనలు, ఆత్మ నిబ్బరత, సత్యం ధర్మం కోసం ఎంతో సేవలు చేశారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐజి రమణ కుమార్ సహ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకులపై ప్రభుత్వం చిన్నచూపు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** బిజెపి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాం జలి ఘటించి, ఆయన స్ఫూర్తిదాయక జీవితాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి వారసత్వానికి సంబంధించిన వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. వాస్తవానికి వాల్మీకి సమాజం వెనుకబడిన తరగతులలో భాగంగా ఉంది. అయితే వాల్మీకి సమాజాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండి పడ్డారు. ఇటీవల గద్వాల ప్రాంతంలో బోయ వాల్మీకి సోదరులు నన్ను కలిసి తమ సమస్యలను వివరించారని, వారికి ఎమ్మార్వో ఆఫీసుల్లో కనీసం కుల ధృవపత్రాలు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



వాల్మీకి సమాజం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని ఇప్పటికైనా వాల్మీకి బోయల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ నేతలు బిజెపి నేతలను విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు:బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ కాంగ్రెస్ నాయకులు నిత్యం బీజేపీ నేతలను విమర్శించడమే తమ ధ్యేయంగా పెట్టుకున్నారని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచం దర్ రావుపై ఇష్టానుసారంగా, అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నార న్నారు. ఒక రాజకీయ పార్టీలో మంత్రి పదవిని పొందిన పొన్నం ప్రభాకర్ వంటి నాయకులు దిగజారి మాట్లాడటం తగదని హితవు పలికారు. మొన్నటికి మొన్న సొంత మంత్రివర్గం లోని మాదిగ సమాజానికి చెందిన అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌పై పొన్నం ప్రభాకర్ కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సమాజం చూసిందన్నారు. భారతీయ జనతా పార్టీ మొదటి నుండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విష యంలో మద్దతు తెలిపిందని, బిజెపి ఎమ్మె ల్యేలు సంపూర్ణ మద్దతు ప్రకటిం చారని గుర్తుచేశారు.



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

# మంత్రి పొన్నం క్షమాపణలు చెప్పాలి

## సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తున్నాం: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్(తార్నాక), అక్టోబరు 7 ప్రభాతవార్త :** మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ముందు నిర్వహించిన కార్యక్రమంలో మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన కట్లూర్ లక్ష్మణ్ ఉద్దేశించి దున్నపోతు అనేమాటను ఉపయోగించి మాట్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు తప్పు జరిగింది వాస్తవమేనని పొన్నం చేతక్షమాపణ చెప్పించే విధంగా చూస్తామని తెలిపారని అన్నారు. పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యచరణను తీసుకోవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తిక్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ముశేఖర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, పల్లెర్ల సుధాకర్, బైర పోగు శివకుమార్, జన్న పాల మహేష్, ఎడవెల్లి అజయ్, ఆదిత్య, మంద అనీల్ మాదిగ, మహేంద్ర మదిగ, మామిడి ప్రశాంత్, రవికుమార్, అజయ్ కుమార్, కొమ్ము తురుపతి, మణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మంగళవారం వివరాలు వెల్లడిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# రిజర్వేషన్లపై 30 బిసి సంఘాల కేసులు

**హైదరాబాద్,అక్టోబరు 7 ప్రభాతవార్త:** స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్ల కేసులో 30కి పైగా బీసీ సంఘాలు మంగళవారం తెలంగాణ హైకోర్టులో ఇంప్లిట్ కేసులు వేశారు. కేసులో ఇంప్లీడ్ అయిన వారిలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణ, కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, తెలంగాణ బి.సి మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల కావణి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి, బీసీ విద్యార్థి యువజనసంఘం అధ్యక్షుడు జామ్మూర్తి గౌడ్, తెలంగాణ బీసి సంఘం అధ్యక్షుడు రాజేందర్, తెలంగాణ బి.సి ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, కార్మికసంఘం నేత చెదుకు మణికంఠ, తెలంగాణ బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, గ్రేటర్ అధ్యక్షుడు బి.సాగర్, తెలంగాణ బి.సి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగళ్ళ సతీష్, తెలంగాణ బి.పి యువజన సంఘం కన్వీనర్ భాస్కర్ ప్రజాపతి, నాయి బ్రాహ్మణ సంఘం నేత జగదేశ్. జాతీయ బి.సి సంక్షేమ సంఘం నేత పరదాల సుధాకర్ తదితర సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున కేసులు వేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది కావున అసెంబ్లీ చట్టం చేశారు. జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల కేసులు గెలిచే అవకాశం ఉందన్నారు.

# మద్యం, గంజాయి, నల్లబెల్లం స్వాధీనం


**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** వేర్వేరు కేసుల్లో ఎక్సైజ్ అధికారులు 44 మద్యం బాటిళ్ళను, 2.5 కేజిల గంజాయి, 120 కేజిల బెల్లంను మంగళవారం పట్టుకున్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వచ్చే తెలంగాణ ఎక్స్ ప్రెస్ రైల్లో సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సౌజన్య సిబ్బంది కలిసి నిర్వహించిన తనిఖీల్లో 44 మద్యం బాటిల్లు పట్టుబడ్డాయి. ఈ మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. అదే విధంగా నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని ఎస్‌టిఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి ఇచ్చిన సమాచారంమేరకు ఎస్టీఎఫ్ ఏ టీం లీడర్ సిబ్బంది దాడులు నిర్వహించి తనిఖీల్లో 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు టు వీలర్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని హాట్ గోడ సంజయ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో సంజయ్ తో పాటు శేఖర్ బాబు, కామ్రే బాబు, గంగోలి బహు అనే ముగ్గురు పై కూడా కేసు నమోదు చేశారు.


మరో కేసులో హైదరాబాద్ హైదరాబాదు ఎంజీబీఎస్ బస్ స్టేషన్ నుంచి నాగర్ కర్నూల్ కు బస్సులో తరలిస్తున్న బెల్లాన్ని ఎస్టీఎఫ్ బీ టీం సీఐ భిక్ష రెడ్డి ఎస్సై బాలరాజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. బెల్లాన్ని తీసుక వెళుతున్న ఎల్లమ్మ అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 120 కేజీల బెల్లం, 30 కేజీల ఆలమును స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ స్టేషన్‌లోఅప్పగించారు. అదే విధంగా మరో కేసులో నాగర్ కర్నూల్‌కు హైదరాబాదు నుంచి బయలుదేరినటువంటి బొలెరో వాహనాన్ని బిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకుని అందులోని 900 కేజీల బెల్లాన్ని, 20 కేజీల ఆలమును, వాహనాన్ని నాగర్ కర్నూల్ డి టి ఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. బొలెరో వాహనంతో పాటు బిజినేపల్లి భాస్కర్ రెడ్డి, డ్రైవర్ రాంబాబును అరెస్ట్ చేశారు.

# టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలంటే ఆవిష్కరణ, నైపుణ్యం మీద దృష్టి సారించాలి: డాక్టర్ క్రిష్ణా ఎల్లా

### ఘనంగా హెచ్‌సియు స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత్ బయోటెక్ ఛైర్మన్ క్రిష్ణ ఎల్లా తదితరులు. అవార్డులను అందజేస్తున్న హెచ్‌సియు చాన్సిలర్ నర్సింహారెడ్డి, వైస్ చాన్సిలర్ బిజె.రావు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 7 ప్రభాతవార్త:** టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడే విధంగా ఉండాలని, దానిని భర్తీ చేయకూడదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, హెచ్‌సియు చీఫ్ రెక్టార్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. విద్య సమాజంలో సమగ్రమైన, అందరికీ సమానమైన సమాజాన్ని నిర్మించే విధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవ వేడుకలను మంగళవారం బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆడిటో రియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎక్జిక్యూటీవ్ ఛైర్మన్ క్రిష్ణ ఎల్లా ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం మొత్తం 1717మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు ప్రకటించగా, అందులో 990మంది తమ పట్టాలను అందుకున్నారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ మెరుగైన భవిష్యత్తుకు ఆలోచన, విద్యార్థుల కష్టానికి వేడుకగా స్నాతకోత్సవాన్ని అభివర్ణించారు. మానవుడి ఉనికి అంతిమ లక్ష్యం మేధస్సును పెంచడమే కావాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలను ఊటంకించారు. నేటి యువతకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి, తోటి వారికి సేవ చేసేందుకు ఉపయోగించాలని సూచించారు. పట్టాలు అందుకున్న గ్రాడ్యుయేట్లు వనయాన్ని వదులుకోవద్దని, ఇతరులకు అవకాశాలు సృష్టించే విధంగా ఎదగాలని పిలుపునిచ్చారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు క్రిష్ణ ఎల్లా మాట్లాడుతూ భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే మన యువత ఆవిష్కరణలు, నైపుణ్యం మీద దృష్టి సారించాలని సూచించారు. విశ్వవిద్యాలయం డిగ్రీ పట్టాను ఇస్తుందని, కానీ ఉత్తమ ఆవిష్కరణ, నైపూణ్యం జీవితంలో ముందుకు తీసుకువెళ్తాయని అన్నారు. నేటి విద్యార్థులు ఉద్యోగాల వేటలో పడి ఉద్యోగ అన్వేషకులుగా మారుతున్నారని, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారతీయ శాస్త్రవేత్తల సందేహాలు వ్యక్తం చేశారని, కానీ కోవిడ్ వ్యాక్సిన్‌ను సొంతంగా తయారు చేసి భారతీయుల సైన్స్‌ను, మేధోసంపత్తిని ప్రపంచానికి చూపించామన్నారు.

హెచ్‌సియు వైస్ చాన్సిలర్ బిజె.రావు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని, ఇది ఒక గ్రీన్ క్యాంపస్ అని అన్నారు. ప్రపంచ క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సియు గత సంవత్సరం ఉన్న 372నుంచి ఈ సంవత్సరం 335కు చేరిందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, నూతన టెక్నాలజీలో సవాళ్లను పరిష్కరించేందుకు 6 విశ్వవిద్యాలయాలను అనుసంధానం చేస్తూ 100కోట్లతో ఏర్పాటు చేసిన ఎఎన్ఆర్ఎఫ్ ప్రాజెక్టుకు హెచ్‌సియు నాయకత్వం వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దృష్టి లోపాన్ని అధిగమించి ఎంఎ పొలిటికల్ సైన్స్‌లో పట్టా అందుకున్న విద్యార్థిని గోపితేజస్వీకి ఓబిసి కేటగిరి గోల్డ్‌మెడల్‌ను అందజేశారు. జంతు, జీవ శాస్త్రంలో పిహెచ్‌డి పట్టా పొందిన కాశ్మీర్ విద్యార్థి డాక్టర్ మహమ్మద్ సుల్తాన్ ఖాన్‌కు ప్రొఫెసర్ ఏనుగు రామస్వామి నాయుడు పథకాన్ని అందజేశారు. ఉత్తమ విద్యాభోధన చేసిన 5గురు ప్రొఫెసర్లకు చాన్సిలర్ అవార్డులను అందించారు.

ఈ కార్యక్రమంలో హెచ్‌సియు చాన్సిలర్ డాక్టర్ ఎల్. నర్సింహారెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ బరిలో టిడిపి

## తెలంగాణలో కమిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

## టిటిడిపి నేతలతో సిఎం చంద్రబాబు సమావేశం



ఏపి సిఎం చంద్రబాబుతో భేటీ అయిన తెలంగాణ టిడిపి నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ టిడిపి నేతలతో తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ నారా చంద్రబాబునాయుడు సమావేశం అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన విధానంపై చర్చించారు. కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేయా లని సిఎం నేతలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ స్థానిక ఎన్నికలపైనా సిఎం చంద్రబాబు తెలంగాణ టిడిపి నేతలతో చర్చించినట్లు సమాచారం. ఉప ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్,బిఆర్ఎస్ సహా టిడిపి కూడా దూకుడు పెంచింది. సిఎం చంద్రబాబు వద్దకు అరవింద్‌కుమార్‌గౌడ్, బక్కని నర్సింహులు, ఇతర ముఖ్యనేతలు వెళ్లారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేయాలా? లేదా బిజెపి అభ్యర్థికి మద్దతు ఇవ్వా లా? అనే దానిపై మంతనాలు జరిగినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లో పోటీ చేద్దామని టిడిపి నేతలు అం టున్నట్లు సమాచారం. అయితే టిడిపితో కలిసి వెళ్లేందుకు తెలంగాణ బిజెపి నేతలు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ఏదీమైనా త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది. చంద్రబాబునాయుడు చాలా కాలం తర్వాత తెలంగాణ పార్టీ వ్యవహారాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తెలంగాణలో పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ఆయన కీలక నేతలతో సమావేశమయ్యారు. సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టి, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలంటూ తెలంగాణ టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ టిడిపి నేతలతో భేటీ సందర్భంగా తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడిని నియమించడం, రాష్ట్ర, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం వంటి సంస్థాగత అంశాలపై కూడా చర్చించారు. ఇప్పటికే మండల అధ్యక్షుల నియామకానికి సంబంధించిన కసరత్తు పూర్తయిందని, దానిని వెంటనే పూర్తి చేయాలని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా, తెలంగాణలో పార్టీకి 1.78 లక్షల సభ్యత్వ నమోదు పూర్తయినట్లు నేతలు చంద్రబాబుకు వివరించారు. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారని, సరైన నాయకత్వం అందిస్తే పార్టీని మళ్లీ క్రియాశీలంగా మార్చవచ్చని వారు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి నియామకం ఆలస్యమైతే, తాత్కాలికంగా ముఖ్య నేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా వారు సూచించారు. నేతల అభిప్రాయాలను పూర్తిగా విన్న చంద్రబాబు, వీలైనంత త్వరగా కమిటీల నియా మకం పూర్తి చేసి, పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీని సమర్థవంతంగా నడిపించగల నాయకు డికే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని ఆయన స్పష్టమైన సందేశం ఇచ్చారు. సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ నేతలతో చంద్ర బాబు సమావేశం కావడం పార్టీ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



## మల్లికార్జున ఖర్గేను పరామర్శించిన మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** ఇటీవల అనారోగ్యానికి గురై పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్స చేయించుకుని, ప్రస్తుతం బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గారిని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు,ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఖర్గే త్వరగా పూర్తిగా కోలుకుని, తిరిగి ప్రజా జీవితంలో క్రియాశీలకంగాపాల్గొనాలని మనస్ఫూర్తిగాఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

# స్వల్పంగా పెరిగిన వరద

## జూరాల 11గేట్లు ఎత్తి నీటివిడుదల

## శ్రీశైలం డ్యాం 6 గేట్లు ఎత్తివేత

## 214టీఎంసీలకు చేరిన నీటిమట్టం

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 7, ప్రభాతవార్త:** ఎగువ నుంచి వరద కొంత తగ్గుముఖం పట్టడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు స్వల్పంగా వరద నమోదవుతున్నది. పాలమూరు వరప్రదాయిని జూరాల 11గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నాయి. జలాశయానికి 1,24,000ఇన్‌ఫ్లో నమోదు కాగా, 11గేట్లు ఎత్తి దిగువకు 77,704క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పవర్‌హౌజ్‌కు 37,389క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 5.202టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. జూరాల ఎడమ కాలువకు 1030, కుడి కాలువకు 600క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 1,16,792క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

**నిండుకుండలా శ్రీశైలం డ్యాం**

శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తున్నది. డ్యాం గేట్లు ఎత్తడంతో పర్యాటకుల సందడి నెలకొన్నది. వరద తగ్గుముఖం పట్టడంతో మంగళవారం 6గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం 885అడుగులకు గాను 884.80అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 214.845 టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల పవర్ హౌజ్ నుంచి 37389, సుంకేసుల నుంచి 13,437క్యూసెక్కులు,హంద్రీ నుంచి 250క్యూసెక్కులు వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 65,581క్యూసెక్కులు, గేట్ల ద్వారా 1,67,989క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాంకు 1,28,780క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, 2,14,967క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.

# సంక్షేమం, అభివృద్ధిపై సర్కార్ దృష్టి

## కొత్త, పాత పథకాల అమలు తప్పనిసరి

## నిధుల సమీకరణ కోసం యత్నాలు

## కీలక శాఖలకు రెవెన్యూ లక్ష్యాలు

**హైదరాబాద్,అక్టోబరు 7,ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలపై దృష్టిసారించిన తెలంగాణ సర్కార్ అందుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తోంది. ప్రధానంగా రాష్ట్రంలో అమలు చేయబోతున్న కొత్త, ఇప్పటికే అమలు చేస్తున్న పాత పథకాల నిమిత్తం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేయాల్సిన పరిస్థితి తప్పనిసరి అయింది. అయితే అందుకు అనుగుణంగా నిధులు లేకపోవడంతో వాటిని సమీకరించే విషయంపై దృష్టిసారించింది. ఇప్పటికే ప్రతీ నెలా ఉద్యోగులకు వేతనాలు, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్ సొమ్ములను సకాలంలో ఇచ్చేందుకే ప్రభుత్వానికి గగనమవుతోంది. రాష్ట్ర ఖజానాకు ఆదాయం ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఎక్కువ మొత్తం తీసుకొచ్చిన అప్పులు, వాటి కిస్తీలు, వడ్డీలు, పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, సామాజిక పెన్షన్లు తదితర వాటికే సరిపోతోంది. ఇప్పటికే ఆదాయం కంటే ఖర్చు ఎక్కువ కావడంతో ప్రతీ నెలా దాదాపు రూ.2 వేల కోట్ల మేర వ్యత్యాసం ఉంటోంది. ప్రభుత్వానికి ప్రతీ నెలా సగటున పన్నులు, పన్నేతర ఆదాయం సుమారు రూ.11 వేల కోట్ల వరకూ వస్తోంది. ఈ విధంగా నెలనెల రాష్ట్రానికి దాదాపు 15వ వేల కోట్ల రూపాయలు సమకూరుతుండగా, ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు 4 వేల కోట్లు, అప్పులు, వాటి కిస్తీలకు మరో 4 వేల కోట్ల రూపాయలు, అప్పులకు చెల్లించాల్సిన వడ్డీల కింద ఇంకో 1,800 కోట్ల రూపాయలు, సామాజిక పెన్షన్లకు 1,200 కోట్ల రూపాయలు విధిగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే సంక్షేమ కార్యక్రమాల అవసరాలను తీర్చడానికి వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. దీంతో వివిధ అవసరాలను తీర్చడానికి రిజర్వ్ బ్యాంక్ అందించే ఆర్థిక సహకారంపైన కూడా నిధులకు సంబంధించి తెలంగాణ ఆధారపడి ఉంది. ప్రత్యేక డ్రాయింగ్ సౌకర్యం, అడ్వాన్స్‌లు, ఓవర్ డ్రాఫ్ట్ తదితర వాటిని వినియోగించుకుంటోంది. ఇలా నిధుల సమస్య కారణంగా యాసంగి సీజనులో రైతులకు చెల్లించాల్సిన 1,160 కోట్ల రూపాయలు బోనస్‌ను ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంచింది. ప్రస్తు వానాకాలం సీజనుకు సంబంధించిపంటల బీమా అమలు చేయాలని భావించినా నిధులు లేకపో వడంతో దానికి కూడా బ్రేక్ పడింది. స్థలాలు ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన నిధులు కూడా లేకుండా పోయింది. అలాగే కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సమ్మక సాగర్ తదితర సాగు నీటి ప్రాజెక్టుల పనులను కొంత వరకూ అయినా చేపట్టాల్సి ఉంటుంది. అంతేకా కుండా సొంత జాగా ఉన్నవారికి ఇండ్లు కట్టుకు నేందుకు గృహలక్ష్మి, మరోపక్క ఉద్యోగులకు చెల్లించానిల్సిన బకాయిలకు సంబంధించి రాష్ట్ర ఖజానాకు మరింత నిధుల అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఏదో విధంగా ఆదాయం తీసుకురావలని వివిధ శాఖలకు లక్ష్యాలను నిర్ధారించింది. దీంతో నిధుల కోసం సర్కార్ వివిధ శాఖలపై వత్తిడి తెస్తోంది. ఇందులోభాగంగా 25 వేల కోట్ల రూపాయల మేర రెవెన్యూను అదనంగా సమకూర్చాలని ఎక్సైజ్, రవాణా, వాణిజ్య పన్నులు, భూముల రిజిస్ట్రేషన్లు తదితర కీలకమైన శాఖలకు టార్గెట్లు ఇచ్చింది. మరోపక్క భూములను తనఖా పెట్టి తద్వారా భారీగా నిధులను సమీకరించుకోవడంతోపాటు, అవి ఫిజికల్ రెస్పాన్సిబులిటీ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్ ఎంబి) పరిధిలోకి రాకుండా ఉండేందుకు ఇటీవలే రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌ను కోరింది.

# రాష్ట్రంలో బంగాళాదుంప సాగు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో బంగాళాదుంప సాగుపై ఉద్యాన శాఖ దృష్టిసారించింది. పస్తుతం రాష్ట్రంలో 6,606 ఎకరాల్లో బంగాళాదుంప సాగవుతోంది. తద్వారా ఏటా 38 వేల టన్నుల వరకూ దిగుబడి అవుతోంది. అయితే బంగాళాదుంప పంటను సాగు చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల ఎకరాలు అనుకూలంగా ఉన్నాయని అంచనా. హార్టికల్చర్ అధికారుల వివరాల ప్రకారం రాష్ట్రంలోని వికారాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో చల్లని వాతావరణం, ఫెర్టైల్ సాయిల్ ఉండటంతో ఆలుగడ్డ సాగుకు విస్తార అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా కుఫ్రీ సూర్య, కుఫ్రీ ఖ్యాతి, చంద్రముఖి, బాద్షా, పుఖ్రాజ్, జ్యోతి, చిప్సోన3 వంటి ఏడు రకాల విత్తనాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయని అంటున్నారు. ఇవి అధిక ఉష్ణోగ్రతను తట్టుకుంటాయని, ఎకరానికి 200 నుంచి 400 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల నుంచి బంగాళాదుంపలు దిగుమతి చేసుకోవడం వల్ల రవాణా ఖర్చులు, నిల్వ సవాళ్లు, ధరల మార్పులు వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. స్థానికంగా ఆలుగడ్డల ఉత్పత్తి పెరిగితే దిగుమతి వ్యయం తగ్గి, రైతుల ఆదాయం పెరిగి, రాష్ట్రం స్వయం సమృద్ధిని సాధించే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు...

## హైకోర్టులో కెసిఆర్, హరీశ్, స్మిత సబర్వాల్ పిటీషన్లపై విచారణ వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో దాఖలైన పిటీషన్‌పై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తర్వాత పిటీషనర్లు రిప్లై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ సిఎస్ ఎస్‌కె జోషి హైకోర్టులో విడివిడిగా దాఖలు చేసిన పిటీషన్లపై మంగళవారం విచారణ జరిగింది. కమిషన్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ కౌన్సిల్ నిరంజన్‌రెడ్డి అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు చెప్పారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. వాదనలు పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం నవంబర్ 12కు విచారణను వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది.

# తీన్మార్ మల్లన్నకు హైకోర్టులో ఊరట..

## పార్టీ గుర్తుపై ఎన్నికల సంఘానికి కీలక ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన పార్టీ గుర్తింపు, గుర్తుకు సంబంధించిన అభ్యర్థనను పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న మల్లన్నకు ఊరట లభించినట్లయింది. ఇటీవల తాను స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీకి గుర్తింపునిచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు గుర్తును కేటాయించాలని కోరుతూ తీన్మార్ మల్లన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకుని, నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. తెలంగాణలో బీసీలకు రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న సెప్టెంబర్ 17న తెలంగాణ రాజ్యాధికార పార్టీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎరుపు, ఆకుపచ్చ రంగుల జెండా మధ్యలో పిడికిలి, కార్మిక చక్రం, వరి కంకులతో పార్టీ పతాకాన్ని రూపొందించారు.ఆత్మగౌరవం, అధికారం, వాటా అనే నినాదాలను జెండాపై ముద్రించారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో పార్టీ గుర్తింపు, గుర్తుకేటాయింపునకు గల అవకాశాలను ఎన్నికల సంఘం పరిశీలించనుంది.

# అత్యుత్తమ రీసెర్చ్ యూనివర్సిటీగా సమ్మక్క సారక్క

## ఢిల్లీలో సామక్కసారక్క యూనివర్సిటీ లోగోను ఆవిష్కరించిన కేంద్ర మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** సాంస్కృతిక వారసత్వం, సంచార జాతుల ప్రజలు ఉండే ప్రాంతంలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పడుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. అత్యుత్తమ రీసెర్చ్ యూనివర్సిటీగా సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిలుస్తుందని ఉద్ఘాటించారు. సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ లోగోను మంగళవారం ఢిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, యూనివర్సిటీ వీసీ వై. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడారు. ఈ యూనివర్సిటీ ద్వారా చాలా విషయాలు వెలుగులోకి తీసుకురావచ్చని చెప్పుకొచ్చారు. తెలుగు, హిందీ, మరాఠీతో సహా లోకల్ ట్రైబల్ భాషను మెరుగు పరచవచ్చని వెల్లడించారు ఫాలో సమ్మక్క సారక్క యూనివర్సిటీ లోగో వినూత్నంగా ఉందని తెలిపారు. యూనివర్సిటీ లోగోలో ట్రైబల్ భాషలు కోయ, బంజారా, గోండు భాషలు పొందుపరచడంపై ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు త్వరలో సమ్మక్క సారక్క యూనివర్సిటీని సందర్శిస్తా, కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేస్తానని హామి ఇచ్చారు. సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీని విభజన చట్టంలో పొందుపరిచారని గుర్తుచేశారు. తాము విభజన చట్టం చేయకపోయినా యూనివర్సిటీ ఏర్పాటుకు కట్టుబడి సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని నొక్కిచెప్పారు. ఈ యూనివర్సిటీకి రూ. 800 కోట్లకు పైగా నిధులు కేటాయించామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. తెలంగాణ సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర,చత్తీస్‌గఢ్ రాష్ట్రాల వారికి కూడా ఈ యూనివర్సిటీ సేవలందిస్తుంది.స్థానిక ప్రజల సంస్కృతి,సంప్రదాయాలకు అనుగుణంగా కొత్త కోర్సులు తీసుకురావాలని చెప్పారు.

# హర్యానాలో సీనియర్ ఐపిఎస్ అధికారి ఆత్మహత్య

## ఛండీగఢ్‌లో ఇంట్లో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం



**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** హరియాణా రాష్ట్రంలో అదనపు డిజి స్థాయి అధికారి వై. పూరన్ కుమార్ (53) సర్వీస్ రివాల్వర్‌తో కాల్చు కుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఛండీఘడ్‌లోని తన ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆయన భార్య అమ్నీత్ కుమార్ సీనియర్ ఐఎఎస్ అధికారి కావడం గమనార్హం. పూరన్ కుమార్ ఎందుకు ఈ ఘాతుకానికి పాల్పడిందనేది తెలియరావడం లేదు. ఈ ఘటన పై హరియాణా సర్కారు విచారణకు ఆదేశించింది.

# మహిళాకోర్టు ఉద్యోగి పై దాడి

## నిందితులపై కేసు నమోదు

**హైదరాబాద్,అక్టోబరు 7 ప్రభాతవార్త:** ఒకటవ అదనపు మహిళాకోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు విధి నిర్వహణలో భాగంగా 1199/2025 లో ప్రతివాది కి నోటీసులు అందజేయడానికి యాకుత్పురా ఇరబ్ నగర్ లోని ఫమీద బేగం ఇంటికి కోర్టు ఉద్యోగి జి కిరణ్ కుమార్ 6 అక్టోబర్ సోమవారం ఉదయం వెళ్ళాడు. అతను తలుపు తట్టగా లోపల నుండి ఓ మహిళ మాట్లాడింది, ఫమీద బేగంకు నోటీసు అందజేయాలని తెలుపగా నోటీసు తీసుకోవడానికి ఆమె నిరాకరించింది. దీంతో కోర్టు ఉద్యోగి కిరణ్ కుమార్ ఇంటి గోడకు నోటీసును అంటించడానికి ప్రయత్నించగా అకస్మాత్తుగా ఇంటిలో నుండి కుటుంబ సభ్యులు బయటికి వచ్చి కిరణ్ కుమార్ ను అసభ్య పదజాలంతో దూషించారు. అతని గుర్తింపు కార్డుని చూపించమని అడిగారు. అతను ఐడి కార్డ్ ఇవ్వగా తమ మొబైల్ ఫోన్ లో వాళ్ళ ఫోటో తీసుకున్నారు. అందులో నుండి ఒక వ్యక్తి తను పోలీస్ డిపార్ట్మెంట్ ఉద్యోగినని కిరణ్ కుమార్ మెడపై రెండుసార్లు చేతితో కొట్టి తీవ్రంగా బెదిరించాడు. కిరణ్ కుమార్ ఈ సంఘటనను వీడియో తీయడానికి ప్రయత్నించగా అతని చేతిలోని మొబైల్ ఫోన్ ను ఆ వ్యక్తి బలవంతంగా లాక్కున్నాడు. ఇంతలో చుట్టుపక్కల వాళ్ళు కూడా వచ్చి కిరణ్ కుమార్ పై దాడికి చేయడానికి ప్రయత్నించి తీవ్రంగా బెదిరించారు. తరువాత ఆ ప్రాంతంలోని ఓ పెద్దమనిషి వచ్చి కిరణ్ కుమార్ కు సెల్ ఫోన్ ను ఇచ్చాడు. రైన్ బజార్ పోలీస్ స్టేషన్ లో కిరణ్ కుమార్ తనపై దాడి చేసిన ఫమీద బేగం కుటుంబ సభ్యులు, పోలీస్ అని చెప్పిన వ్యక్తి, పొరుగువారు విధి నిర్వహణలో ఉన్న తనపై దాడి చేసి దూషించినందున చట్ట ప్రకారం వారి పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫమీద బేగం కుటుంబ సభ్యులపై సెక్షన్ 132, 115(2), 351(2), 3(5) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# టూరిస్టుబస్సుపై పడిన కొండచరియలు

## 15 మంది మృతి, మరికొందరికి తీవ్రగాయాలు

**సిమ్లా, అక్టోబరు 7:** హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. టూరిస్ట్ బస్సుపై కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 15 మంది దుర్మరణం పాలయ్యారు. పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సహాయక సిబ్బంది.. ఘటనా స్థలంలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. రాత్రి పూట కావడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఇక గాయపడిన వారిని అంబులెన్స్‌ల్లో దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈ ఘోర దుర్ఘటన చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న బల్లు వంతెన సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కొండపై నుంచి భారీ మొత్తంలో మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా జారిపడటంతో.. మారోటన్-కలౌల్ మార్గంలో వెళ్తున్న ప్రైవేట్ టూరిస్ట్ బస్సును పూర్తిగా కప్పేశాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 15 మంది మృతి చెందినట్లు బిలాస్‌పూర్ డిప్యూటీ కమిషనర్ రాహుల్ కుమార్ తెలిపారు. మరో ముగ్గురిని సురక్షితంగా బయటికి తీసినట్లు ఆయన వెల్లడించారు.ప్రమాద సమయంలో ఆ టూరిస్ట్ బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంఘటనా స్థలానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వైరల్ వీడియోలను బట్టి చూస్తే ప్రమాదంలో బస్సు బాగాశిథిలమై పోయిన భాగం కనిపిస్తోంది. చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి రెస్క్యూ సిబ్బంది జేసీబీ సహాయంతో మట్టి, రాళ్లను తొలగిస్తున్నారు. ప్రమాదం జరిగిన చోటుకు పోలీసులు, ఫైర్ సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు చేరుకుని.. శిథిలాలను తొలగించి వాటి కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

# కాంగ్రెస్ నేత ఓటరు కార్డులు పంపిణీ చేయడంపై కెటిఆర్ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుడు ఓటరు కార్డులు పంపిణీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఓటరు కార్డులను పంపిణీ చేయడంతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు గాను అతనిపై బీఎన్ఎస్ 170, 171, 174తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ అంశంపై కేటీఆర్ స్పందిస్తూ, ఆయన కేవలం కాంగ్రెస్ నాయకుడే కాకుండా, ఉప ఎన్నికల్లో టిక్కెట్‌ను కూడా ఆశిస్తున్నారని, అలాంటి వ్యక్తి పంపిణీ చేయడమేమిటని ప్రశ్నించారు.

గుర్తింపు కార్డులు, ఓటరు కార్డులు పంపిణీ చేయడానికి ఆయనకు అధికారం ఎవరిచ్చారని నిలదీశారు. కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి లేదా నవీన్ యాదవ్‌కు ఆ బాధ్యతలు అప్పగించిందా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఇటీవల ఓట్ చోరీ గురించి ఆరోపణలు చేస్తున్నారని, కానీ ఇది దాని కంటే పెద్ద నేరమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శిల్పాశెట్టిని 4 గంటలు విచారించిన ముంబై పోలీస్

**ముంబయి, అక్టోబరు 7:** ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేరకు మోసం కేసులో బాలీవుడ్ స్టార్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రా నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి శిల్పా శెట్టిని ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం విచారించింది. శిల్పా శెట్టి ఇంటికి వెళ్లిన అధికారులు దాదాపు నాలుగున్నర గంటలపాటూ ప్రశ్నించినట్లు తెలిసింది. బ్యాంకు లావాదేవీల గురించి ఆరా తీసినట్లు సమాచారం. విచారణ సందర్భంగా శిల్పా శెట్టి నుంచి కీలక విషయాలను రాబట్టినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. విచారణ సందర్భంగా ముంబై పోలీసు ఆర్థిక నేరాల విభాగం శిల్పా శెట్టి వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసినట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. విచారణ సందర్భంగా పలు పత్రాలను నటి అందజేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఇదే కేసులో గతనెల రాజ్ కుంద్రాను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. దాదాపు 5 గంటల పాటూ ఆయన్ని విచారించిన పోలీసులు ఆయన వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. శిల్పా శెట్టి దంపతులు రూ.60 కోట్ల మోసానికి పాల్పడినట్లు ముంబై వ్యాపారవేత్త దీపక్ కొఠారీ ఇటీవలే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

తన కంపెనీ 2015 నుంచి 2023 వరకు రుణం, పెట్టుబడి రూపంలో రూ.60.4 కోట్లను ఈ దంపతులకు ఇచ్చిందని తెలిపారు. ఈ సొమ్మును వీరు తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు.

# ఢిల్లీలో జోరుగా వర్షం 15 విమానాలు దారిమళ్లింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 7: ఢిల్లీలో భారీ వర్షం ప్రభావం విమాన సర్వీస్‌లపై పడింది. మంగళవారం సాయంత్రం నుంచి వాన జోరుగా పడడంతో 15 విమానాలను దారి మళ్లించారు విమానాశ్రయం అధికారులు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున ఢిల్లీకి సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు వీటిని మళ్లించినట్టు వారు చెప్పారు. ఎనిమిది ఫ్లైట్స్‌ను జైపూర్‌కు, ఐదింటిని లక్నోకు, మరో రెండింటిని ఛండీగఢ్‌కు మళ్లించినట్టు అధికారులు వెల్లడించారు. 'ఢిల్లీలో నెలకొన్న ప్రతికూల వాతావరణం ప్రభావం విమాన సర్వీస్‌లపై తీవ్రంగా పడింది. దాదాపు 15 విమానాలను దారి మళ్లించాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఎదురవ్వడకుండా మా సిబ్బంది నిరంతరం చూసుకుంటున్నారు' అనిఎక్స్ వేదికగా ఢిల్లీ విమానాశ్రయం అధికారులు పోస్ట్‌పెట్టారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో కుండపోతగా వర్షం పడింది.దాంతో, అప్రమత్తమైన విమానాశ్రయం అధికారులు విమానాలను దారి మళ్లించారు.

# ఎయిరిండియాకు తృటిలో తప్పిన ప్రమాదం

**కొలంబో, అక్టోబరు 7:** కొలంబో నుంచి 158 మంది ప్రయాణికులతో చెన్నైకి వస్తున్న ఎయిరిండియా విమానానికి పెను ప్రమాదం తృటిలో తప్పింది. విమానం గాల్లో ఉండగా ఒక పక్షి వచ్చి వేగంగా ఢీకొట్టింది. అయితే, పైలట్ చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని చెన్నై విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఫోటో: ఎయిరిండియా ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 737800 విమానం మంగళవారం మధ్యాహ్నం కొలంబోనుంచి చెన్నైకి బయలుదేరింది. విమానం చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఏటీసీ) పరిధిలోకి ప్రవేశించిన సమయంలో వేగంగా వచ్చి పక్షిఢీకొట్టబోయింది.అయితే పైలట్‌చాకచక్యంతో తృటిలోప్రమాదం తప్పింది.

# ఎన్‌కౌంటర్‌లో నేపాలి గ్యాంగ్‌స్టర్ ఖతం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** పలు ఘోరమైన నేరాలకు పాల్పడుతూ, పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఓ నేపాలీ గ్యాంగ్‌స్టర్ ఎట్టకేలకు హతమ య్యాడు. ఢిల్లీ, గురుగ్రామ్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భీమ్ మహబహదూర్ జోరా (30) అనే మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ప్రాణాలు కోల్పోయాడు. అతడి తలపై పోలీసులు లక్ష రూపాయల రివార్డు ప్రకటించారు. నెహ్రూ ప్లేస్ సమీపంలోని ఆస్థా కుంజ్ పార్క్‌లో జోరా తన అనుచరుడితో కలిసిఉన్నాడన్న పక్కా సమాచారం తో గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్, ఢిల్లీ పోలీసుల స్పెషల్ బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి.పోలీసులను గమనించిన జోరా,వారిపై విచక్షణారహితంగా కాల్పులుజరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఒక బుల్లెట్ గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర శర్మ బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌కు తగలడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించినా వినకుండకాల్పులు కొనసాగించాడు దీంతో పోలీసులు జరి పినఎదురుకాల్పుల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌చికిత్స పొందుతూ మరణించినట్లువైద్యులు ధ్రువీకరించారు.

# తెర




## స్టార్ హీరో సరసన సమంత?

నేషనల్ అవార్డ్ విన్నర్ వెట్రిమారన్ దర్శకత్వంలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు ఓ సినిమా చేయనున్నారని గత కొంత కాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. నేషనల్ అవార్డ్ విన్నర్ వెట్రిమారన్ దర్శకత్వంలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు ఓ సినిమా చేయనున్నారని గత కొంత కాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడా వార్తలను నిజం చేస్తూ మేకర్స్ సినిమాను అనౌన్స్ చేస్తూ టైటిల్ ను రివీల్ చేశారు. వెట్రిమారన్ శింబు కలయికలో వస్తున్న ఈ సినిమాకు ఆరసన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు దర్శకనిర్మాతలు. శింబు49గా ఆరసన్ శింబు కెరీర్లో 49వ చిత్రంగా వస్తోన్న ఈ మూవీని ప్రముఖ నిర్మాత కళైపులి థాను నిర్మిస్తుండగా, సౌత్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో శింబు సరసన హీరోయిన్‌గా సౌత్ స్టార్ హీరోయిన్ సమంతను తీసుకోవాలని మేకర్స్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగా మేకర్స్ సమంతతో చర్చలు ప్రారంభించారని టాక్ వినిపిస్తోంది. శింబు సరసన సమంత? అయితే ఆ డిస్కషన్స్ ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయని, ఒకవేళ అన్నీ కుదరి, సినిమా కార్యరూపం దాల్చితే శింబు, సమంత కలిసి చేయబోయే మొదటి సినిమా ఇదే అవుతుంది. ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మయోసైటిస్ వ్యాధి వల్ల కొంతకాలం పాటూ సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు తిరిగి సినిమాలను చేస్తున్నారు. వడ చెన్నై యూనివర్స్ లో భాగంగా ఆరసన్ అయితే గతంలో లాగా ఎక్కువ సినిమాలు చేయడం లేదు సమంత. సినిమాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్న సమంత మళ్లీ చాలా కాలం తర్వాత తమిళంలో సినిమా చేయబోతుందన్న వార్త విని ఆమె అభిమానులు సంతోషిస్తున్నారు. కాగా ఆరసన్ మూవీని వెట్రిమారన్ వడ చెన్నై యూనివర్స్ లో భాగంగా రూపొందించనున్నట్టు ఇప్పటికే వెల్లడించారు. ఈ యూనివర్స్‌లో మరిన్ని సినిమాలు రానున్నాయని సమాచారం. వెట్రిమారన్, శింబు ఇద్దరూ మంచి టాలెంటెడ్ పర్సన్స్ కావడంతో వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమాపై మంచి అంచనాలున్నాయి.

## 'చాంపియన్' డిసెంబరు 25న వరల్డ్ వైడ్ రిలీజ్

రోషన్, ప్రదీప్ అద్వైతం, స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, జీస్టూడియోస్ ఛాంపియన్ యంగ్ హీరో రోషన్ తన లేటెస్ట్ ఫిల్మ్ ఛాంపియన్‌తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఛాంపియన్ ఫస్ట్ లుక్, ఆసక్తికరమైన టీజర్ గ్లింప్స్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సైమల్టేనియస్ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. "చాంపియన్" డిసెంబర్ 25న, క్రిస్మస్ సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. పండుగ సీజన్, న్యూఇయర్ హాలిడేలలో వస్తున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ బిగ్ బూస్ట్ ఇవ్వనుంది. రిలీజ్ పోస్టర్‌లో రోషన్ లాంగ్ డార్క్ ఓవర్‌కోట్, బెల్టెడ్ వెయిస్ట్‌తో క్లాసీ లుక్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ నుంచి బయటకు అడుగుపెడుతూ హీరోయిక్ ఎంట్రీ ఇవ్వడం అదిరిపోయింది. ఈ సినిమాలో రోషన్ ఇప్పటివరకు చేయని విభిన్న పాత్రలో కనిపించబోతున్నాడు.



పాత్రకు సరిపోయేలా ఆయన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ఆర్.మధీ, మిక్కీజే మేయర్ మ్యూజిక్, ఆర్ట్ డైరెక్షన్‌కి తోటతరణి వంటి పెద్ద టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. షూటింగ్ పూర్తి కాగానే సినిమా టీమ్ మ్యాసీవ్ ప్రమోషన్లతో ప్రేక్షకుల్లో మరింత ఎక్సయిట్మెంట్ క్రియేట్ చేయడానికి రెడీ అవుతున్నారు.

తారాగణం: రోషన్, అనశ్వర రాజన్‌సాంకేతిక సిబ్బంది:ప్రొడక్షన్ బ్యానర్స్: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్: క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ :ప్రెజెంట్స్: జీ స్టూడియోస్: దర్శకత్వం: ప్రదీప్ అద్వైతం, డిఓపి : ఆర్ మదీ సంగీతం: మిక్కీ జె మేయర్ ఆర్ట్ డైరెక్టర్: తోటతరణిపిఆర్ఓ : వంశీశేఖర్.

## నా కెరీర్‌లో అక్టోబరు నెలను మరిచిపోలేను

**వరుణ్ సందేశ్**

దాదాపు పద్దెనిమిది ఏళ్ల క్రితం నేను నటించిన తొలి చిత్రం "హ్యాపీడేస్ 2007లో ఇదే నెలలో విడుదలై, ఘన విజయం సాధించి, నా కెరీర్ నే మలుపు తిప్పింది. అందుకే నాజీవితంలో అక్టోబర్‌మాసంగుర్తుండి పోయింది. ఇప్పుడు ఈచిత్రంకూడాఇదేనెలలో విడుదలవుతుండటం తో ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయి" అని హీరో వరుణ్ సందేశ్ అన్నారు. వరుణ్‌సందేశ్, మధులిక వారణాసి జంటగా జాగృతి మూవీమేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకుసిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని ప్రసాద్‌ల్యాబ్‌లోప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సమాజంలో జరుగుతున్న అంశాల ప్రేరణతో ఈ చిత్రాన్ని మలచడం జరిగింది. కమర్షియల్, ఎంటర్టైన్మెంట్, సందేశంవంటి అంశాలను మిళతం చేసి రూపొందించడం జరిగింది అని అన్నారు. నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ, ఈ చిత్రానికి సెన్సార్ యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఈ నెల 10న చిత్రాన్ని భారీగా విడుదల చేయబోతున్నాం. ఒక అమ్మాయికి అవమానం జరిగితే దాని పరిణామాలు ఎలా ఉంటాయి అన్న అంశాన్ని చూపించాం. అమ్మాయిలతో పాటు తల్లి తండ్రులు కూడా ఈ సినిమాను చూడాలి" అని అన్నారు. దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. మాట్లాడుతూ, ట్రైలర్, పాటలకు వచ్చిన స్పందన సినిమా పట్ల మా నమ్మకాన్ని పెంచింది. నిర్మాత కథను నమ్మి స్వేచ్ఛ ఇవ్వడం వల్లనే ఈ సినిమా తెరపైకి వచ్చింది" అని అన్నారు. ఈ వేడుకలో యువ హీరోలు అర్జున్, కార్తీక్ రాజు, విశ్వకార్తికేయ, ఇంకా సునామీ సుధాకర్, దువ్వాసి మోహన్, కెమెరామెన్ హాజరత్, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, సహ నిర్మాతలు నికిత జగదీష్, కుపేంద్ర పవర్, ఇతరయూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈచిత్రంలోని ఇతరముఖ్య పాత్రలలో దువ్వాసి మోహన్, సూర్య, రవివర్మ, మురళీధర్ గౌడ్, బలగం జగదీష్, ప్రభావతి, కల్పలత,నిత్యశ్రీ, శ్రీభవ్య తదితరులు తారాగణం. ఈచిత్రానికి కెమెరా; హాజరత్ షేక్ (వలి),సంగీతం: సుభాష్ ఆనంద్, ఎడిటింగ్: వర ప్రసాద్, బి.జి.ఎం.:గ్యాని, ఆర్ట్: వి.నాని, పండు, మాటలు:శ్రీనివాస్ తేజ,పాటలు: రామారావు, శ్రీనివాస్ తేజ,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : మిట్టపల్లి జగ్గయ్య, సహనిర్మాత: బి నికిత జగదీష్, కుపేంద్ర పవర్, నిర్మాత; బలగం జగదీష్, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం; ఆర్యన్ సుభాన్ .ఎస్.కె.



## 'రీ ర్యాంప్' 18న విడుదల

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం హెవీ ఎంటర్ టైనర్ "రీర్యాంప్" మూవీ నుంచి థర్డ్ సింగిల్ టిక్కల్ టిక్కల్.. రిలీజ్, ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న సినిమా.. సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "రీర్యాంప్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. "రీ ర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ ఖిటిక్కల్ టిక్కల్..ఖి విడుదల చేశారు. చేతన్ భరద్వాజ్ ఎనర్జిటిక్ ట్యూన్ తో కంపోజ్ చేసిన 'టిక్కల్ టిక్కల్.' పాటకు సురేంద్ర కృష్ణ లిరిక్స్ రాశారు. సాయి చరణ్ భాస్కరుని పాడారు. 'టిక్కల్ టిక్కల్ పాట ఎలా ఉందో చూస్తే. టిక్కల్ టిక్కల్, ధమాల్ ధమాల్ కలిసి వచ్చే కాలం ముందు నువ్వు సూపర్ రా.. టైమ్ కాస్త బ్యాడ్ అయితే కె ర్యాంప్ రా..ఫ్లవర్ లాంటి లవర్ ఉంటే లైఫ్ సూపర్ రా, ఫ్లవర్ కాస్త ఫైర్ అయితే కె ర్యాంప్ రా, ఒక్క పెగ్ కిక్కు ఇస్తే నువ్వు సూపర్ రా, ఫుల్ కొట్టినా పిచ్చి పడితే కె ర్యాంప్ రా. అంటూ లవర్, లైఫ్ మధ్య హీరో ఎలా నలిగిపోయాడో చూపిస్తూ ఆకట్టుకునేలా సాగుతుంది పాట. నటీనటులు కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు.



## 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక



ప్రముఖ నిర్మాత బన్నీవాస్ స్థాపించిన బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ పతాకాలపై అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి' . సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఈ వినోదభరిత చిత్రానికి నూతన దర్శకుడు విజయేందర్‌ఎస్‌దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎమ్, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వెండితెరపై నవ్వుల టపాసులు పేల్చడానికి, దీపావళి కానుకగా అక్టోబర్ 16న 'మిత్ర మండలి' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, మూడు పాటలు విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. ఇప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తూ ట్రైలర్ వచ్చింది.

హైదరాబాద్‌లోని ఏఏఏ సినిమాస్‌లో 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందం ఈ వేడుకలో పాల్గొని, ట్రైలర్ ఆవిష్కరణ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'మిత్ర మండలి' ట్రైలర్ నవ్వులతో నిండిన ప్రయాణాన్ని సూచిస్తుంది. విచిత్రమైన పాత్రలు, కడుపుబ్బా నవ్వించే హాస్యంతో తక్షణమే ఈ ట్రైలర్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రధాన పాత్రధారులు ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎమ్, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా వింతైన పరిస్థితుల్లో చిక్కుకున్న విచిత్రమైన వ్యక్తులుగా కనిపిస్తున్నారు. వారి మాటలు, చేష్టలు నవ్వుల జల్లు కురిపిస్తున్నాయి.అతిశయోక్తి పరిస్థితులు మొదలు, మీమ్స్‌కు తగిన క్షణాల నుండి తెలివైన మీమ్ రిఫరెన్స్‌ల వరకు, ట్రైలర్ గందరగోళం, హాస్యం మేళవింపుతో ఆద్యంతం వినోదభరితంగా సాగింది. ప్రియదర్శి మరోసారి ప్రేక్షకుల మెచ్చే పాత్రలో కనిపించగా, విష్ణు ఓఐ, ప్రసాద్ బెహరా తమదైన హాస్యంతో ఆకట్టుకున్నారు. ఒక విచిత్రమైన పోలీసు పాత్రలో వెన్నెల కిషోర్, ముఖ్యమైన పాత్ర సత్య, సరదాఅతిథిపాత్రలో అనుదీప్ కె.వి.కనిపిస్తున్నారు. ఈ తమదైన ప్రత్యేక శైలి హాస్యంతో వీరు వినోదాన్ని రెట్టింపు చేశారు.'మిత్రమండలి'చిత్రం హాస్యం,యువత అల్లరి,రహస్యాన్ని సమానస్థాయిలో మిళితం చేసినట్లు కనిపిస్తుంది.అద్భుతమైనవిజువల్స్,ఆకర్షణీయమైన సంభాషణలు,అంతటా సరికొత్త వినోదాన్నిపంచుతూ,ఒకపరిపూర్ణ దీపావళిఎంటర్‌టైనర్‌గా 'మిత్ర మండలి'రూపుదిద్దు కుంటున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తుంది. 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో చిత్ర కథానాయకుడు ప్రియదర్శి మాట్లాడుతూ, "థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులు సంతోషంగా నవ్వుకొని బయటకు వెళ్ళాలనే ఉద్దేశంతో 'మిత్ర మండలి' సినిమా చేశాము. జాతిరత్నాలకు రెట్టింపు నవ్వులు పంచి, ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇవ్వబోతున్నాము. నలుగురు స్నేహితులు కూర్చొని, సరదాగా మాట్లాడుకుంటే ఎలాంటి ఆనందం కలుగుతుందో. అలాంటి ఆనందాన్ని ఈ సినిమా కలిగిస్తుంది' .

## జోరు పెంచిన 'మాస్‌జాతర'



మాస్ మహారాజా రవితేజ అభిమానులతోపాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం'మాస్‌జాతర'. రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్య దేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హాస్యం, భావోద్వేగాలు మాస్ అంశాలతో నిండిన వినోదభరితమైన కుటుంబ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న "మాస్ జాతర" సినిమా, భారీ అంచనాల నడుమ అక్టోబర్ 31న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలకు విశేష స్పందన లభించింది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఈ క్రమంలోనే తాజాగా సుమతో కలిసి ఒక ఉల్లాసమైన, వినోదాత్మక సంభాషణలో చిత్ర బృందం పాల్గొంది. మాస్ జాతర సినిమా ఎంత ప్రత్యేకమైనదో తెలిపేలావీరి సంభాషణ సాగింది. రవితేజ ఈ సినిమాలో తాను పోషించిన ఆర్‌పిఎఫ్(రైల్వే పోలీస్ ఫోర్స్) అధికారి పాత్ర గురించి మాట్లాడుతూ, ఇది తన సినీ ప్రయాణంలో సరికొత్త, ప్రత్యేకమైన పాత్ర అని అభివర్ణించారు. అలాగే చిత్ర దర్శకుడు భాను భోగవరపు, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియోపై ప్రశంసలు కురిపించారు. భానుప్రతిభావంతుడని, చిత్రీకరణ సమయంలో కూడా సన్నివేశాన్ని ఇంకా మెరుగ్గా మలచడానికి ప్రయత్నిస్తుంటాడని, చాలా వేగంగా మార్పులు చేయగలడని కొనియాడారు భీమ్స్ ఎంతో కృషి చేసి, ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించాడని అన్నారు. ఇక మాస్ జాతర సినిమా గురించి మాట్లాడుతూ, వినోదం, మాస్ అంశాలతో పాటు హృదయపూర్వక కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుందని తెలిపారు. రవితేజతో కలిసి నటించడం చాలా ఆనందకరమైన అనుభవమని శ్రీలీల అన్నారు. రవితేజతో కలిసి పనిచేయడం చాలా సులభంగా ఉంటుందని, అత్యంత ఆహ్లాదకరమైన సహనటులలో ఆయన ఒకరని శ్రీలీల తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'మాస్ జాతర'లో తాను సైన్స్ టీచర్‌గా, శ్రీకాకుళం యాసలో మాట్లాడే ఉల్లాసభరితమైన పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తానని ఆమె వెల్లడించారు. తన మునుపటి పాత్రలకు పూర్తి భిన్నంగా ఇది ఉంటుంది. స్క్రిప్ట్ చదివినప్పుడే తాను నవ్వుకున్నానని, ఇకసెట్‌లో దానిని ప్రదర్శించే సమయంలో ఆ నవ్వులు రెట్టింపు అయ్యాయని శ్రీలీల పేర్కొన్నారు.

## 'అరసన్' టైటిల్ పోస్టర్ రిలీజ్

హీరో సిలంబరసన్ టిఆర్ వెట్రిమారన్, లెజెండరీ నిర్మాత కలైపులి ఎస్. థాను క్రేజీ కాంబినేషన్ లో రూపొందిస్తున్న చిత్రంకు 'అరసన్' అనే టైటిల్ అనౌన్స్ చేశారు. ఈ టైటిల్ పోస్టర్ రిలీజ్ తో అభిమానుల్లో సందడి నెలకొంది.

ఈ భారీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన పోస్టర్‌లో సిలంబరసన్ టిఆర్ పవర్ ఫుల్ గా కనిపించారు. దర్శకుడు వెట్రిమారన్, నిర్మాత కలైపులి ఎస్. థాను లాంటి క్రేజీ కాంబినేషన్ లో రావడంతో సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. త్వరలోనే చిత్రంలోని ఇతర నటీనటులు, టెక్నికల్ టీం వివరాలు మేకర్స్ త్వరలో తెలిజేస్తారు.

పాన్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకున్న సిలంబరసన్ టిఆర్, ఇప్పుడు 'అరసన్'గా వెండితెరపై అలరించడాన్నికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా ఆయన కెరీర్ లో మరో మైల్ స్టోన్ మూవీగా నిలవనుంది.



## 'తెలుసు కదా' హానెస్ట్ ఎమోషన్స్ ఉన్న సినిమా




మిరాయ్ లాంటి పాన్‌ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తెలుసు కదా అక్టోబర్ 17న గ్రాండ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ నీరజ కోనవిలేకరుల సమావేశంలో సినిమావిశేషాలు పంచుకున్నారు.

**తెలుసు కదా ఎలా ఉండబోతుంది?**

ఇది ఒక లవ్ స్టోరీ. ఇద్దరు మధ్య ఉండే ప్రేమ కథ. ఒక ప్రేమ కథ తో పాటు ఒక కాంప్లెక్స్‌సిటీ కూడా వుంది. ఇది క్యారెక్టర్ డ్రివెన్ స్టోరీ. ఇందులో మూడు క్యారెక్టర్స్ కూడా చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ప్రతి క్యారెక్టర్ హానెస్ట్ గా ఉంటుంది. ప్రతి క్యారెక్టర్ ఎమోషనల్ గా కనెక్ట్ అవుతుంది..

**మీరు ఎలా ఈ సినిమాని డీల్ చేశారు?**

ఒక కథ అమ్మాయి రాసిందా అబ్బాయి రాసిందా అనేదానికంటే బాగా రాశారు అన్నదే ఇంపార్టెంట్. నా దృష్టి కూడా కథని హానెస్ట్ గా చెప్పడం పైనే ఉంది. ఈ కథ ఎలాంటి బయోస్ లేకుండా రాసింది. ఈ సినిమాని అబ్బాయి తీసారా అమ్మాయి తీసారా అన్నదానికంటే ఒక గుడ్ ఫిలిం మేకర్ తీసిన సినిమా అని పేరు తెచ్చుకోవడం నాకు ఇష్టం.

**శ్రీనిధి, రాశి గురించి?**

శ్రీనిధి చేసిన రాగ చాలా కాంప్లెక్స్ క్యారెక్టర్. హిట్ 3 కి ముందే ఈ క్యారెక్టర్ చెప్పాను. తను కేజీఎఫ్, హిట్ 3 లాంటి సినిమాలు చేయడం మాకు చాలా హెల్ప్ అయ్యింది. అంజలి క్యారెక్టర్ లో రాశి చాలా అద్భుతంగా నటిచింది. తనది చాలా యూనిక్ క్యారెక్టర్.

**తమన్ మ్యూజిక్ గురించి?**

తమన్ ఫ్యామిలీ ఫ్రెండ్. సినిమాకి తన మ్యూజిక్ బ్యాక్ బోన్. పాటలన్నీ మంచి హిట్ అయ్యింది. రాబోతున్న పాటలు కూడా అద్భుతంగా వుంటాయి. గ్రేట్ ఆల్బమ్ ఇచ్చారు. స్కోర్ బ్యుటీఫుల్ గా వుంటుంది. ఆయన సపోర్ట్ ని మర్చిపోలేను.

**పీపుల్ మీడియా ఫాక్టరీ గురించి?**

విశ్వ ప్రసాద్ లేకపోతే ఈ సినిమా లేదు. కృతి ప్రసాద్ ఈ సినిమాతో చాలా క్లోజ్ అయ్యారు. వారి సపోర్ట్ ని మర్చిపోలేను. ఎక్కడ రాజీపడకుండా సినిమాని నిర్మించారు.

**మీ కొత్త ప్రాజెక్ట్స్ గురించి ?**

ఒక హార్డ్ హిట్టింగ్ లవ్ స్టోరీ చేయబోతున్నా. త్వరలోనే ఎనౌన్స్ చేయబోతున్నాం.

ఆల్ ది బెస్ట్

# పిజి చేసి అంబులెన్స్ డ్రైవర్‌గా..




పిజి చేసి ఉద్యోగం చేసుకోవచ్చు. అయినా జీతం తక్కువ, అమ్మాయిలు అరుదుగా కనిపించే కొలువును ఎంచుకుంది. 'అదే చేస్తా'నంటూ పట్టుబట్టి మరీ చేరింది.. విసువస మేరీ. అందరి ప్రశంసలూ అందుకుంటోంది. చిన్నప్పట్నుంచీ డ్రైవింగ్ అంటే పిచ్చి. దానికి తగ్గట్టే.. 'అమ్మాయిలు ఏది చేయాలనుకున్నా చేయాలి. అప్పుడే ధైర్యంగా జీవించడం అలవాటవు తుంది' అన్న నాన్న ప్రోత్సాహం ఎలాగూ ఉంది. ఇంకేం.. బైకు, కారు వాహనాలు నడపడం నేర్చుకుంది. తనది తమిళనాడులోని మేళపుతుక్కూడి. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పీజీ పూర్తిచేసింది. తన అంకుల్‌కి సాయపడటానికి ట్రక్ నేర్చుకోవడమే కాదు, హెవీ వెహికల్స్ లైసెన్స్ సంపాదించుకుంది. ఒసారి ఎక్కడికో వెళ్లొస్తున్న ఆమెని ఓ ప్రకటన ఆకర్షించింది. అది.... అంబులెన్సులు నడపడానికి డ్రైవర్లు కావాలి' అన్న అడ్వర్టైజ్మెంట్ వెంటనే చేరిపోవడానికి సిద్ధమైంది. దరఖాస్తు వెళితే అంతా ఆశ్చర్యంగా చూశారు. 108 వాహనానికే కాదు, నర్‌ల కోసమూ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. దీంతో 'నర్సు పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చావా' అనడిగారు. కాదు, అంబులెన్స్ డ్రైవర్‌గా చేరడానికి డ్రైవర్ వచ్చానగానే కొందరు నవ్వేశారు. నేను మాత్రం పట్టుదలగా నిల్చున్నా. అది చూసి కొందరు అధికారులు ప్రోత్సహించారు. అయితే రాతపరీక్షలో అర్హత సాధించాక ఒసారి అంబులెన్స్ నడపమన్నారు. అప్పుడు కాస్త భయమేసింది. ఎంతైనా సాధారణ ఉద్యోగం కాదు కదా.. ప్రాణాలు నలబెట్టేది మరి. కానీ నచ్చిన పని కావడంతో ధైర్యంగా పూర్తిచేశా అనే మేరీ చివరికి కొలువును సాధించేసింది. 'చిన్నమ్మాయివి. పైగా ప్రభుత్వ అంబులెన్స్ అంటే ఎక్కడ ప్రమాదాలు జరిగినా వెళ్లాలి, ఆ రక్తం, గాయాల తీవ్రత చూసి భయమేయదా?' 24 ఏళ్ల మేరీకి చాలామంది నుంచి ఈ ప్రశ్న ఎదురైంది. అయితే మేరీ తండ్రిది చికెన్ వ్యాపారం. చిన్నప్పట్నుంచీ నాన్నకు సాయం చేసేటప్పుడు రక్తాన్ని చాలాసార్లే చూసింది. అందుకే అది తనను భయపెట్టదంటుంది. నిజానికి వాళ్ల నాన్న ఎప్పుడూ 'ఇంకెప్పుడైనా భయపడొచ్చేమో కానీ... ఎవరైనా ప్రాణంకోసం పోరాడుతున్నప్పుడు మాత్రం ధైర్యంగా వాళ్లకి సాయపడ టానికే చూడు' అని చెప్పేవారట. అదే తనను అంబులెన్స్ డ్రైవర్ అయ్యేలా చేసింది అని చెబుతుంది మేరీ. పైగా ఇది ఉద్యోగం కాదు... మానవాళికి చేసే సేవ. కాబట్టే ఇంట్లోవాళ్లూ నా నిర్ణయాన్ని ప్రోత్సహిస్తున్నారని గర్వంగా చెబుతోంది. ఆమెను ఇప్పుడెంతోమంది అభినందిస్తున్నారు. నిజంగా ఆ అమ్మాయి కదూ! నిర్ణయాన్ని మెచ్చుకోవాల్సిందేకదూ! □

# బుజ్జి తల్లికి జాతీయ పురస్కారం



ఉత్తమ నటీనటులుగా అవార్డులు అందుకొని మురిసిన వేడుక ఇది. ఈ వేదికపై ఓ ఆరేళ్ల చిన్నారి అందరి దృష్టిని ఆకర్షించింది. 'ఉత్తమ బాల నటి'గా అవార్డు అందుకొని 'టాక్ ఆఫ్ ది టౌన్'గా నిలిచింది. ఆ అమ్మాయి మరెవరో కాదు.. మరాఠీ బాలనటి త్రిష తోసర్. ఇంత చిన్న వయసులోనే తన అద్భుతమైన నటనతో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న త్రిష.. జాతీయ చలనచిత్ర పురస్కారాల చరిత్రలోనే ఈ అవార్డు అందుకున్న అతి పిన్న వయస్కు రాలిగా చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ బాల నటి గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం..

తాజాగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం వేడుకగా జరిగింది. ఈ వేదికపై బాలీవుడ్ నటీనటులు రాణి ముఖర్జీ, షారుఖ్ ఖాన్ అవార్డులు అందుకుంటూ సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఇంతలోనే త్రిష తోసర్ అనే పేరు వినిపించింది. ఎవరీమె అని అందరూ ఆసక్తిగా చూస్తుండగానే ఆరేళ్ల ఈ అమ్మాయి స్టేజి పైకి వెళ్లి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా 'ఉత్తమ బాల నటి'గా అవార్డు అందుకుంది. 'నాల్2' సినిమాలో తన నటనకు గాను ఈ అత్యుత్తమ పురస్కారం త్రిషను వరించింది. దీంతో ఈ చిన్నారి పేరు ప్రస్తుతం దేశమంతా మార్మోగుతోంది.



**చీరకట్టుతో కట్టిపడేసి..!** సాధారణంగా జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం వంటి వేడుకలకు సంప్రదాయబద్ధమైన దుస్తుల్లోనే ఎంచుకుంటుంటారు చాలామంది తారలు. అందు లోనూ ప్రాధాన్యమిస్తారు. త్రిష కూడా ఇదే చేసింది. ఇంత చిన్న వయసులో షారీ అవార్డు అందుకోవాలనుకున్న ఆమె.. గోల్డ్ కలర్ ప్రిస్టిచ్డ్ శారీని ధరించింది. స్టైలిష్ హెయిర్స్టైల్తో, క్యూట్ స్మైల్‌తో ముద్దొచ్చేలా ముస్తాబైన త్రిష. రాష్ట్రపతి చేతుల మీదు అవార్డు అందుకొని ఎంతో మురిసిపోయింది. ఆపై అక్కడి కొచ్చిన నటీనటులందరితో కలి ఫొటోలకు పోజులిస్తూ సందడి చేసింది. వీరంతా ఈ చిన్నారి ప్రతిభను, సక్సెస్‌ను కొనిందా ఇలా వీళ్లతో దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి.

**'చీవీ' పాత్రలో..!** నాలుగేళ్ల వయసులోనే సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన త్రిష. పెట్ పురాణంఖి, 'మాన్వత్ మ వంటి సీరియల్స్ గుర్తింపు తెచ్చుకుంది. ఆపై పున్హ శివాజీ రాజే భోసలే' అనే సినిమాలో కనిపించిన ఈ బాల నటి.. రెండేళ్ల క్రితం విడుదలైన 'నాల్' చిత్రంతో సక్సెస్‌ను అందుకుంది. ఇందులో 'చిమీ' అనే గ్రామీణ నేపథ్యంలో పుట్టిపెరిగిన అమ్మాయి పాత్రలో నటించింది త్రిష. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యం, తోబుట్టువులతో ఉండే సంబంధ బాంధవ్యాలె ఇతివృత్తంగా రూపొందించిన ఈ సినిమాలో తన అమాయ కత్వం, పరిణతితో కూడిన నట అందరినీ కట్టిపడేసింది. ఇలా తన అద్భుతమైన నటనతో జాతీయ పురస్కారం అందుకున్న చిన్నారి.. ఇందులో భాగంగా 'గోల్డెన్ లోటస్ అవార్డు', సర్టిఫికెట్, నగదు బహుమతిని అందుకుంది.

**నాలుగేళ్లకే ఎంట్రీ!** నటనపై నాకున్న ఆసక్తితో ఇటువైపుగా అడుగులేశా. మా అమ్మానాన్నలూ ఈ వి నన్ను ప్రోత్సహించారు. చిన్న వయసులోనే జాతీయ పురస్కారం అందుకోవడం అనిపిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రపతి ప్రశంసించడం మర్చిపోలేను.. 70 ఏళ్ల జాతీయ పురస్కారాల చరిత్రలో ఈ అవార్డు అందుకున్న అతి పిన్న బాల నటిని నేనే అని నాతో చెప్పింది. ఇది విన్నాక చెప్పలేనంత సంతోషం కలిగింది. భవిష్యత్తులోనూ ఆ కొనసాగిస్తూనే, ఇటు సినిమాల్లో రాణిస్తా.. అంటూ తన ముద్దుముద్దు మాటలతో వారందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది త్రిష.

# పొగడ్తలోనూ స్వాంతన !

'ఫస్ట్‌ర్యాంకుకు రెండు మార్కులు తగ్గితే కోప్పడతావు. ఇన్ని మార్కులు తెచ్చుకున్నాననని ప్రశంసించవు ప్రతి సారీ వంద శాతం వస్తేనే.. అంటారు కొంత మంది తల్లులు. పిల్లలను పొగిడితే చెప్పినమాట వినరు అనుకోకుండా సందర్భంబట్టి కాస్తంత పొగిడి



చూడండి అంటున్నారు నిపుణులు. అది వారికి ప్రోత్సహించి లక్ష్యసాధనవైపు నడిపించేలా ఉండాలట. అలాగే పొగడ్తలకూ ఒక లెక్క ఉందట.

పిల్లలు సంతోషిస్తారని లేదా పొగడ్త ఇవ్వకపోతే బాధపడతారని కాకుండా నిజాయితీగా ప్రశంసించాలి. అది కూడా నిర్దష్టంగా ఉండాలి. తను చేసిన పని వల్ల లేదా చదువులో ముందుండటంతో కలిగే ప్రయోజనాలను వివరించి పొగడాలి. భవిష్యత్తులో ఈ మార్గాన్నే అనుసరించాలనే సూచన పిల్లల మెదడుకు చేరాలి.

- ఇతరులపై తను చూపించే ప్రేమ, పక్కవారికి సాయం చేసే గుణం వంటివి ప్రదర్శించినప్పుడు మీ పొగత్తన తప్పనిసరి. మున్ముందు కూడా ఆ తత్వాన్ని అలవరుచుకోవడం ఎంత మంచి విషయమో చెప్పి మరీ ప్రశంసించాలి.
- పిల్లలు కష్టపడి ప్రయత్నిస్తున్నప్పుడు ప్రశంస ప్రోత్సాహపూర్వకమైనదిగా ఉండాలి. ప్రశంసాపూర్వకమైన చిన్న సంజ్ఞ కూడా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.
- మంచి పని చేసినప్పుడే కాదు. వాళ్లల్లో ప్రతికూలమైన ప్రవర్తన కనిపించినప్పుడు కూడా సానుకూల శ్రద్ధ కనబరుస్తూ ప్రశంసలు కలపాలి. ఎలాగంటే, గతంలో నువ్వెంతో మంచిగా ఉన్నావు. ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తున్నావు అని విమర్శనాత్మకంగా లేదా గట్టిగా అరవకుండా, అదే పదాలను మృదువుగా చెప్పాలి. పిల్లలు ప్రతికూల అభిప్రాయాలకంటే, అందులోని ప్రశంసకే స్పందిస్తారు.
- అతిగా ప్రశంసించడం నివారించుకోవాలి. అతిశయోక్తి చేయకూడదు. ఎందుకంటే ఇది నిజమైన పొగడ్త ప్రాముఖ్యతను తగ్గిస్తుంది.
- మనకు నచ్చింది చేశారని కాకుండా, పిల్లల తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలు వారి లోఆ్యన్ని సాధించగలరనే నమ్మకం కలిగినప్పుడు ప్రశంసించాలి. అది వాళ్లలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగే నైపుణ్యాలను పెంచుతుంది. □

# రూమ్‌మేట్‌తో గొడవలు రాకుండా ..

వృత్తి ఉద్యోగాలు, పైచదువుల రీత్యా పట్టణాలు, నగరాలకు వచ్చిన అమ్మాయిలు హాస్టళ్లలో లేదా ప్రత్యేకంగా గదులను అద్దెకు తీసుకుంటే మామూలే! అయితే ఇలా గదిని పంచుకున్న రూమ్‌మేట్‌తో ఎంత స్నేహపూర్వకంగా ఉన్నా.. అప్పుడప్పుడూ కొన్ని విషయాల్లో భేదాభిప్రాయాలు, చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అందుకే ఇద్దరి మధ్య దూరం పెరుగుతుంది. ఇది వ్యక్తిగతంగా కాకుండా, మానసిక ఆరోగ్యం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. మరి, అలా జరగకుండా రూమ్‌మేట్‌తో కలిసినప్పుడు కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం ..



**ప్రైవసీని హరించద్దు ! ..** స్నేహితురాలితో కలిసున్నా, కుటుంబ సభ్యుల మధ్య ఉన్నా.. ప్రతి ఒక్కరికీ ప్రైవసీ ముఖ్యం. ఈ కోసం తమకంటూ కొంత ప్రత్యేక సమయం కేటాయించు కుంటారు. ఇలాంటప్పుడు ఎదుటి వారికి భంగం కలిగించకుండా మంచిదంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. మీ రూమ్మేట్ ఫ్రెండ్/ కొలీగ్ మీ గదికి వచ్చారనుకోండి.. అనవసరంగా వాళ్ల మాటల్లో తలదూర్చడం, వాళ్ల చర్చకు అంతరాయాన్ని కలిగించడం సబబు కాదు. మీ రేమ్‌మేట్ మీపై ప్రతికూల భావన ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి వాళ్లను స్వేచ్ఛగా వదిలేసి మీ పని మీరు చేసుకోండి. అలాగే మీకు వీలైతే వచ్చిన భోజనానికి ఓ కప్పు కాఫీ/టీ అందించినా తప్పు లేదు. ఈసారి మీరు ఇలా చేస్తే.. మీకు సంబంధించిన వాళ్లెవరైనా మీ గదికి వస్తే మీ రూమ్‌మేట్ కూడా మీకు సహాయపడుతుంది. తద్వారా ఇద్దరి మధ్య చెలిమి పెరుగుతుంది.



**కలిసి పంచుకోవాలి !** చాలామంది రూమ్ మేట్స్‌కి పేచీ వచ్చేది. ఇంటి పనుల దగ్గరే! ప్రత్యేకించి హాస్టల్ కాకుండా, విడిగా గది/ఫ్లాట్ అద్దెకు తీసుకునేవారి విషయంలో ఇది బాగా వర్తిస్తుంది. సమయం లేక వీలు పడకో.. ఒక్కోసారి ఒకరి పైనే పనుల భారం పడచ్చు.. దానివల్ల 'అన్నీ నేనే చేయాలా?' అన్న ఆలోచన అవతలి వారి మనసులో మొదలవుతుంది. ఇద్దరి మధ్య దూరం పెరగడానికి ఈ ఒక్క ఫీలింగ్ చాలు! అందుకే అన్ని పనులన్నీసమానంగా పంచుకోవాలి. ఇలా మిత్రులు ఇద్దరూ పనుల్ని సమన్వయం చేసుకోగలిగితే.. ఏ గొడవా ఉండదు.

**ఖర్చు.. సరిమానంగా!** ఆర్థిక విషయాల్లో కూడా కొంతమంది రూమ్‌మెంట్స్ గొడవలు పడుతుంటారు. నెలవారీ ఖర్చుల్లో హెచ్చుతగ్గులున్నాయని ఎడమొహం పెడమొహంగా ఉంటుంటారు. దీనివల్ల ప్రశాంతత కొరవడు తుంది.. ఇద్దరి మధ్య అను బంధమూ దెబ్బతింటుంది. అలా జరగకూడదంటే.. ఇద్దరికీ కలిపి నెలకయ్యే ఉమ్మడి ఖర్చును సగంసగం పంచుకుంటే సరి! వ్యక్తిగత అవసరాల కోసం. ఎవరికి వారే ఖర్చు పెట్టుకుంటారు కాబట్టి ఇబ్బంది ఉండదు. ఇబ్బంది పెట్టద్దు!.... ప్రతి ఒక్కరి అలవాట్లు, అభిరుచులు మీకు ఉంటాయి. ఈ విషయంలోనూ రూమ్‌మేట్స్ ఒకరినొకరు గౌరవించు కోకపోతే తిప్పలు తప్పవంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. మీకు కాస్త ఆలస్యంగా నిద్ర పోయే అలవాటుందనుకోండి.. అదే మీ రూమ్మేట్ ఉదయాన్నే ఆఫీస్కెళ్లాలని త్వరగా పడుకుంటుందనుకోండి. మీరు టీవీ చూస్తూ తన నిద్రకు భంగం కలిగించడం కరక్ట్ కాదు. ఈ ఒక్క విషయమనే కాదు.. బయటి నుంచి ఆర్డర్ చేసే ఫుడ్ విషయంలో కావచ్చు.. ఫోన్లు వాడే విషయంలో కావచ్చు.. ఎవరి సౌకర్యానికి వాళ్లను వదిలేయడం మంచిది. కాబట్టి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు తలెత్తకుండాజాగ్రత్తపడచ్చు.

ఒకవేళ గొడవైతే..! ఎంత స్నేహపూర్వకంగా ఉన్నా, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఎక్కడో ఒక చోట, ఏదో ఒక విషయంలో రూమ్‌తో మనస్పర్థలు రావచ్చు. అలాంటి సమయాల్లో పంతలకు పోకుడా సమస్యను సామరస్యంగా పరిష్కరించు కోవడం మంచిది. ఈ తప్పు ఎవరిదైనా ఎదుటివారికి క్షమాపణ చెప్పడం, అసలు మీరు ఆ సమయంలో ఎందుకలా ప్రవర్తించాల్సి ఉంటుంది వచ్చిందో విడమరిచి చెప్పడంలో తప్పు లేదు. ఇలా రియలైజ్ అవడం వల్ల ఇద్దరి మధ్య సద్దుమణగడమే కాదు.. అను బంధమూ దృఢమవు తుంది. □

# అందుకే 'గుడ్డు' కావాలట..!

ఇతర అల్పాహారాల్లో లభించని పోషకాలు కోడి గుడ్డులో ఉంటాయి. శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు, విటమిన్లు, ఖనిజాలు..ఇవన్నీ ఇందులో పుష్కలంగా లభిస్తాయి. దీనివల్ల గలిగే ప్రయోజనాలు గురించి తెలుసుకుందాం..



- పిల్లలకు అందించే ఆహారంలో కోడిగుడ్డు తప్పనిసరిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో ఉండే విటమిన్ ఎ, ల్యూటిన్, జియాకానసంథిన్.. లాంటి యాంటీఆక్సిడెంట్లు కంటి సంబంధిత సమస్యలు రాకుండా కాపాడడంతో పాటు రేచీకటి నుంచి విముక్తి కలిగిస్తాయి.
- జీవక్రియలు, సక్రమంగా సాగడంతోపాటు ఆరోగ్యంగా ఉండడానికి కోడిగుడ్డులోని ప్రొటీన్లు తోడ్పడతాయి.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ ప్రొటీన్లు, ఖనిజాలు ఉండేకోడిగుడ్డు.. ఎముకలు, కండరాలు.. దృఢంగా తయారు కావడానికి తోడ్పడుతుంది.ఎత్తు పెరిగేందుకు సహాయపడుతుంది.
- శరీరం, గుండె ఆరోగ్యానికి అవసరమైన ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు గుడ్డులో అధిక మొత్తంలో ఉంటాయి.
- ఉదయం పూట ఇతర అల్పాహారానికి బదులు గుడ్డు తీసుకునే వారు బరువు తగ్గుతారని ఓ అధ్యయనంలో వెల్లడైంది.
- శరీరానికి ఎండ తగలకపోవటం, సరైన పోషకాహారం తీసుకోకపోవటం వల్ల ప్రస్తుతం చాలామంది విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. దీంతో అనేక సమస్యలు పొంచి ఉంటున్నాయి. అందువల్ల విటమిన్ డి ఎక్కువగా ఉండే గుడ్డును ఆహారంలో చేర్చుకోవటం మంచిది
- ప్రొటీన్లతో నిండిన గుడ్డులో మనకు అవసరమైన అన్నిరకాల అమైనో ఆమ్లాలు ఉంటాయి. శారీరక శ్రమ అధికంగా చేసినప్పుడు తిరిగి శక్తిని పుంజుకోవటానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. □

# వృద్ధాప్య ఛాయలు రాకుండా..

చాలా మందికి 30 దాటగానే చర్మం ముడతలు పడడం, గీతలు ఏర్పడడం.. వంటి వృద్ధాప్య ఛాయలు కనిపిస్తుంటాయి. ఇక వీటిని కవర్ చేసుకోవడనికి మేకప్‌ను ఆశ్రయించే వారే ఎక్కువ. ఫలితంగా సహజ సౌందర్యం దెబ్బతింటుంది. కానీ తైవాన్ మహిళలకు వయసును దాచుకునే పనే లేదు. మేకప్ అవసరం అంతకన్నా లేదు. ఎందుకంటే అక్కడ అరవై ఏళ్ల అమ్మమ్మలు కూడా అందమైన అమ్మాయిల్లా కనిపిస్తుంటారు. ఈ వయసు లోనూ వారి చర్మం అంత కోమలంగా, ప్రకాశవంతంగా ఉంటుంది మరి! ఇంతకీ, వయసు పెరుగుతున్నా వన్నె తరగని అందంతో ప్రపంచాన్ని ఆకట్టుకుంటోన్న ఈ ముద్దుగుమ్మల సౌందర్య రహస్యాలేంటో తెలుసుకుందాం ..



**సహజసిద్ధమైన పదార్థాలతో...** అత్యవసర నూనెలు, షియా, బటర్, వెదురు, హెర్బల్ టీలు.. వంటి పూర్తిగా సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన సౌందర్య ఉత్పత్తుల్ని వాడడం. ఇంట్లో దొరకే పదార్థాలతోనే తమ అందాన్ని సంరక్షించుకోవడం.. ఈ చిట్కాలే తైవాన్ మహిళల్ని నవయవ్వనంగా ఉంచుతున్నాయట.

**గువా షాతో.. ఇన్‌స్టంట్ అందం....** గువా షా.. క్వార్జ్ లేదా జేడ్ రాయితో తయారుచేసిన ఈ సహజసిద్ధమైన సాధనాన్ని ప్రస్తుతం ప్రపంచమంతా వినియోగిస్తోంది. అయితే నిజానికి ఇది పుట్టింది చైనాలోనే. ప్రాచీన కాలం నుంచే అక్కడ మహిళలు దీన్ని ఉపయోగిస్తున్నారు. తైవాన్ మహిళల సౌందర్య రహస్యమూ ఇదే! కోమలంగా, సున్నితంగా ఉండే ఈ రాయితో ముఖం, మెడపై మర్దన చేసుకోవడం వల్ల.. ఆయా భాగాల్లో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. తద్వారా చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. అలాగే గువా షాతో మర్దన చేసుకోవడం వల్ల మనం ఉపయోగించే సౌందర్య ఉత్పత్తుల్ని చర్మం సులభంగా గ్రహించగలుగు తుందట! తద్వారా ఇన్‌స్టంట్ అందాన్ని సొంతం చేసుకోవచ్చం టున్నారు తైవాన్ ముద్దుగుమ్మలు.



**ఆహారం, వ్యాయామం!** ప్రొటీన్‌లో ఉండే అమైనో ఆమ్లాలు చర్మంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. తద్వారా చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ ప్రయోజనాల్ని పొందడానికే తైవాన్ మహిళలు ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని తమ మెనూలో చేర్చుకుంటారు. ముఖ్యంగా పుట్టగొడుగులు, బ్లాక్‌రైస్, సముద్రపు నాచు, నల్ల నువ్వులు, మచా టీ, గోజీ బెర్రీస్, ఎరుపు రంగు డేట్స్. వంటివి వారి రోజువారీ ఆహారంలో తప్పకుండా ఉంటాయట! అంతే కాదు, నరకమం తప్పకుండా వ్యాయామాలు చేయడం కూడా తమ సౌందర్య రహస్యంలో భాగమే అంటున్నారు తైవాన్ భామలు.


**జుట్టుకు పోషణ :** వివిధ రకాల జుట్టు సమస్యల్ని తగ్గించుకోవడానికి హెయిర్ స్ప్రేలు, షాంపూలు వాడడం మనలో చాలామందికి అలవాటు! కానీ ఎలాంటి జుట్టు సమస్యనైనా సహజసిద్ధమైన పదార్థాలతోనే తగ్గించుకుంటామంటున్నారు తైవాన్ మహిళలు. అల్లంతో ప్రత్యేక పద్ధతుల్లో తయారుచేసిన షాంపూ, పెర్ల్ పౌడర్–రోజ్ వాటర్ కలిపి తయారుచేసిన హెయిర్ మాస్క్. □

# శివ రక్ష రుద్రాక్ష

ఆధ్యాత్మికం

దేవీ భాగవతం, రుద్రాక్షోపనిషత్తు, రుద్ర జాబాలి ఉపనిషత్తు, లింగ, శివ, పద్మ, స్కాంద పురాణాల్లో రుద్రాక్ష గురించి విస్తారమైన వివరణ ఉంది. ఆ కథనాల ప్రకారం త్రిపురాసురుణ్ణి సంహరించడానికి అవసరమైన శక్తి కోసం శివుడు కళ్లు తెరిచి తపస్సు చేశాడు. దీక్ష పూర్తయ్యాక ఒక్క క్షణం కళ్లు మూయగానే ఆ నయనాల్లోంచి కన్నీటి చుక్కలు జారిపడి మొక్కలు మొలిచాయి. అవే రుద్రాక్ష మొక్కలు. రుద్రుని కన్నీటి నుంచి ఉద్భవించినందువల్ల రుద్ర, అక్ష రుద్రాక్ష అనే పేరొచ్చింది. ఇవి శివుడికి ప్రీతికరమైనవి. పరమశివుణ్ణి ఆరాధించేవారు రుద్రాక్షను ధరిస్తారు. వీటిని, స్పృశించిన సత్ఫలితాలు కలుగుతాయని విశ్వసిస్తారు. తమ కోరికలు సాకారం కావాలని ఆశించేవారు, అనారోగ్యంతో బాధపడేవారు, మోక్షం పొందాలనుకునేవారు ఇలా వివిధ ప్రయోజనాల కోసం రుద్రాక్షను ధరిస్తారు. 'బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస.. ఇలా ఏ ఆశ్రమం లోనైనా, స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా ఎవరైనా రుద్రాక్షను ధరించవచ్చు. ఓంకా రాన్ని పఠిస్తూ ధరించడం ఉత్తమం అని శివపురాణం పేర్కొంది. రుద్రాక్షను సాక్షాత్తు శివుడి స్వరూపంగా భావిస్తు న్నారు. ఇదొక అపురూప గింజ ఇది ఉద్వేగా లను నియంత్రించి అంతర్గత శాంతి, ఆనం దాలకు ఆలవాలమవుతుంది. తద్వారా ఆధ్యాత్మిక చింతన పెంపొందు తుంది. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాలు చేకూరు తాయి. అదృష్టాన్ని పండించి.. ఆరో గ్యం, ఐశ్వర్యం, సంతోషం, శ్రేయస్సులను అందిస్తుందని చెబుతారు. నుదుట విభూతి రేఖలు, కంఠంలో రుద్రాక్షలు, మనసులో శివనామ జపం ఈ మూడింటికీ అనుబంధం ఉంది. ఇవి శివుడికి ప్రీతికరమైనవి. అందుకే ఈ మూడు లక్షణాలూ ఉన్న వ్యక్తిని దర్శించుకుంటే త్రివేణి సంగమంలో స్నానం చేసినంత పుణ్యఫలం కలుగు తుంది అన్నది పౌరాణి చెబుతున్న మాట. రుద్రాక్షలు ధరించడానికి జాతి, లింగ, వయో భేదాలు లేవు. మానసిక, శారీ స్థితితో సంబంధం లేదు. పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరైనా ధరించవచ్చు. రుద్రాక్షలు మనదేశంలో కేరళ రాష్ట్రంలో, నేపాల్, ఇండోనేషియా దేశాలు, జావాద్వీపంలోనూ లభిస్తాయి. నేపాల్లో దొరికే రుద్రాక్షలను అత్యుత్తమ శ్రేణివిగా పరిగణిస్తారు. రుద్రాక్ష అనగానే ముఖాల గురించిన ఆలోచన మొదలవుతుంది. కాయ ల్లోంచి తీసిన గింజలకు అనుకూలంగా ఉం గీతలనే ముఖాలు అంటారు. ఎన్ని గీతలు కలిగుంటే అన్ని ముఖాల రుద్రాక్ష అంటారు. ఈ ముఖాలు సహజంగానే ఏర్పడతాయి. ఇవి ఒకటి నుంచి పద్నాలుగు వరకూ ఉంటాయి. వీటిలో దాదాపు మూడొం తులు ఐదు ముఖాల పంచముఖి రుద్రాక్షలే ఉంటాయి. రుద్రాక్ష ముఖాల సంఖ్యను బట్టి కనిపిస్తాయని పురాణేతి హాసాలు ఉన్నాయి. వీటిలో ఒకే ముఖం ఉంటే ఏకముఖి రుద్రాక్ష దొరకడం ఇంచుమించు అసాధ్యం. ఇండో నేషియా లో అరుదుగా లభించే ఏకముఖి అర్ధచంద్రాకారం లో ఉంటుంది. దీన్ని 'చంద్రాక్ష, చంద్రముఖి' అని కూడా అంటారు. ద్విముఖి రుద్రాక్షలు గుండ్రంగా, బద్దలా ఉంటాయి. ఇవి కూ అరుదైనవే. ఇష్ మోర్ల రుద్రాక్షలు మిరియపు గింజ పరిమాణం నుంచి, పెద్ద ఉసిరికాయ పరిమాణం వరకూ లభిస్తు న్నాయి. హిందువులు, బౌద్ధులు వీటిని పరమ పవిత్రంగా భావిస్తూ మెడలో మాలలుగా, చేతులకు కంకణాలుగా ధరిస్తారు. శివుణ్ణి ఆరాధించే వారే కాకుండా విష్ణు భక్తులుకూడా రుద్రాక్షలు ధరిస్తాం. □

# కారం బిస్కెట్లు



**కావలసినవి :** బియ్యప్పిండి: కప్పు, మైదాపిండి: కప్పు, ఉప్పు: కొద్దిగా, అల్లంతురుము: చెంచా, కరివేపాకు రెబ్బలు : రెండు: కొత్తిమీర తరుగు: రెండు పెద్ద చెంచాలు, పిచ్చిమర్చి: రెండు, పెరుగు: రెండు పెద్ద చెంచాలు , నూనె: వేయించేందుకు సరిపడా.

**తయారు చేసే విధానం :** బియ్య ప్పిండి, మైదాపిండి, ఉప్పు, ఉల్లం తురుము, పచ్చిమర్చి తరుగు, కొత్తిమీరు, కరివేపాకు ఓ గిన్నెలోకి తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఇందులో పెరుగూ కలిపాక నీళ్లు పోస్తూ పూరీపిండిలా చేసుకోవాలి. స్టైమీద బాణలి పెట్టి, వేయించేందుకు సరిపడా నూనె వేయాలి. బియ్యప్పిండిని చిన్నచిన్న చపాతీల్లో వత్తి బిస్కెట్లలా కోసుకుని కాగుతోన్న నూనెలో వేసి ఎర్రగా వేయించి తీసుకోవాలి. ఇవి రెండుమూడు రోజుల వరకూ నిల్వ ఉంటాయి. □

### ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్

## వాటర్ పోలోలో భారత్ వరుస ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, వాటర్ పోలోలో భారత పురుషులు వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడిపోయారు. వాటర్ పోలో, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ మూడవ రోజు వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కజకిస్తాన్ చేతిలో భారత పురుషుల వాటర్ పోలో జట్టు 6-20 తేడాతో ఓడిపోయింది. కజకిస్తాన్‌కు చెందిన కరీనా మాగ్రుపోవా, పురుషుల సోలో ఫ్రీలో వరుసగా అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. పురుషుల గ్రూప్ బి లో కజకిస్తాన్ 20-6 తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. బాల్తాబ్‌కులీ ఆదిల్, నెడోకొంట్సేవ్ 4 గోల్స్ సాధించగా, తోసోయ్ ఎడ్వర్డ్ మూడుసార్లు గోల్స్ చేయగా, లామాయేవ్ మాగ్జిమ్, షకెనోవ్



మురాత్, అకింబే అల్దియార్ తలా రెండు గోల్స్ సాధించారు. అలాగే అఖ్మెటోవ్ రుస్లాన్, మాడిమార్ అల్మాట్, బొబ్రోవ్స్కి మిస్టిస్లావ్ తలా 1 గోల్ చేశారు. భారత్ తరపున భాగేష్ కుథే 3 గోల్స్ చేయగా, ఉదయ్ ఉత్తేజ్, ప్రవీణ్ గోపీనాథన్ తలా ఒక గోల్ చేశారు. కాగా మహిళల గ్రూప్ ఎ లో జపాన్ 26-13 తేడాతో సింగపూర్‌ను ఓడించింది. కోబయాషి మహో 6 గోల్స్‌తో ఆధిక్యంలో ఉండగా, సోబాజిమా సాకురా (4), కెప్టెన్ ఫుకుడా షోకా, లోరే నినా, సాండా యుమెకా మరియు శిరోనోషిత కహో (3 చొప్పున) ఉన్నారు. షిబాట కనడే 2 గోల్స్ చేయగా, బాండో రికో, ఎగుచి సెయిరా తలా 1 గోల్స్ చేశారు. సింగపూర్ తరఫున యాప్ జింగ్జువాన్ 4, లిమ్ వాన్ జున్, లీ జువాన్ హై తలా 3 గోల్స్ సాధించగా, టియో జి సువాన్, కో టింగ్, యో యింగ్ తలా 1 గోల్స్ చేశారు.

### ఆస్ట్రేలియాతో రెండో టెస్టు తొలి రోజు

## భారత్ 9 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ అండర్19 జట్టు తొలిసారి బ్యాటింగ్‌లో తడబాటుకు లోనైంది. మెక్‌కే వేదికగా మొదలైన రెండో టస్ట్ తొలి రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి భారత్ 7 వికెట్లు నష్టానికి 144 పరుగులు చేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 20, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆశించిన రీతిలో ఆడలేక తేలిపోయాడు. ఈ మ్యాచ్ ఓపెనరల్‌గా ప్రమోష్ పొందిన విహాన్ మల్హోత్రా (11) నిరాశపరిచాడు. మరో ఓపెనర్, కెప్టెన్ ఆయుశ్ మాత్రే (4) వైఫల్యాల పరంపర కొనసాగించాడు. వేదాంత్ త్రివేది (25) నిలదొక్కుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. రాహుల్ కుమార్ (9), వికెట్ కీపర్ హర్వంశ్ పంగాలియా (1) సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. ఖిలన్ పటేల్ (26)





కాసేపు పోరాడినప్పటికీ ఆట ముగిసే సమయానికి కొద్ది ముందు ఔటయ్యాడు. హెనిల్ పటేల్ (22 నాటౌట్), దీపేశ్ దేవేంద్రన్ (6 నాటౌట్) సహకారంతో భారత్‌కు గౌరవ ప్రదమైన స్కోరు అందించేందుకు ప్రయత్నిస్తూ క్రీజులో ఉన్నారు. ఇకఆస్ట్రేలియా బౌలర్లలోకేజీ బార్టన్, విల్ బైరోమ్ టీమిండియా టాపార్డర్‌ను ఇబ్బంది పెట్టారు. కేజీ, బైరోమ్ తలో 2 వికెట్లు పడగొట్టగా, ఛార్లెస్‌లచ్‌మండ్, జూలియన్‌కు తలో వికెట్‌దక్కింది. అంతకు ముందు భారత్ బౌలర్లు చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది. హెనిల్ పటేల్(9-3-21-3), ఖిలన్ పటేల్ (12-5-23-3), ఉధవ్ మోహన్ (6-0-23-2), దీపేశ్ దేవేంద్రన్ ( 7.3-2-22-1 కలిసికట్టుగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ఆసిస్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ లీ యంగ్ (66) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు.



### జూడో వరల్డ్ ఛాంపియన్‌షిప్:

## లింతోయ్ విక్టరీతో భారత్‌కు తొలి పతకం

**న్యూఢిల్లీ:** జూనియర్ జూడో ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో లింతోయ్ చనంబం భారతదేశానికి తొలి పతకం అందించింది. పెరూలోని లిమాలో మంగళవారం జరిగిన జూడో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున తొలి పతకాన్ని గెలుచుకున్న లింతోయ్ చనంబమ్ చరిత్ర సృష్టించింది. మహిళల 63 కిలోల విభాగంలో 19 ఏళ్ల చనంబమ్ కాంస్య పతక పోరులో నెదర్లాండ్స్‌కు చెందిన జోనీ గీలెన్‌పై విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు, చనంబమ్ తన చివరి గ్రూప్ డి మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన సో మోరిచికా చేతిలో ఓడిపోయింది. మోరిచికా మహిళల 63 కిలోల ఫైనల్‌కు చేరుకున్న తర్వాత మణిపూర్‌కు చెందిన జూడోకా రెపిచేజ్ మార్గం ద్వారా పతక పోరులోకి ప్రవేశించింది. రెపిచేజ్ రౌండ్‌లో, చనంబమ్ మొదట స్లోవేకియాకు చెందిన ఇలారియా సుర్కాన్‌ను ఓడించి, గీలెన్‌తో కాంస్య పతక పోటీకి సిద్ధమైంది. ఇది చానంబంకు లభించిన రెండవ వయసు గ్రూప్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం. క్యాడెట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తొలి భారతీయ జూడోకాగా కూడా ఆమె గుర్తింపు పొందింది. ఆమె మూడు సంవత్సరాల క్రితం 2022లో ఆ ఘనతను సాధించింది. కాగా గత సంవత్సరం కాలంగా, చనంబం గాయాలతో ఇబ్బంది పడింది. తిదిలి గాయంతో ఆమె చాలా కాలం పాటు ఆటకు దూరంగా ఉండి, ఈ సంవత్సరం ప్రారంభంలోనే పోటీ జూడోకు తిరిగి వచ్చింది.

### ఆస్ట్రేలియా పర్యటనలో..

# భారత్ హిట్ ఇన్నింగ్స్

### టాప్5లో 2 సార్లు రోహిత్



**న్యూఢిల్లీ:** భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ ఈ నెల 19 నుండి ఆస్ట్రేలియా గడ్డపై జరుగుతుంది. ఆస్ట్రేలియాతో తలపడే టీమిండియాలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి చోటు కల్పించారు. అయితే ఇవ్వటి



వరకూ ఆస్ట్రేలియాపై జరిగిన వన్డేల్లో అత్యధిక ఇన్నింగ్స్‌లు ఆడిన పలువురు బ్యాట్స్‌మెన్‌లు ఉన్నారు. టాప్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ శర్మ పేరు రెండు సార్లు రికార్డయింది. జనవరి 2016లో పెర్త్‌లో ఆస్ట్రేలియాపై రోహిత్ 171 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని వన్డే కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా ఉంది. ఆ సమయంలో పిచ్ వేగంగా మరియు బౌన్సీగా ఉండేది. పరుగులు చేయడం కష్టతరం చేసింది. అయితే, భారత ఇన్నింగ్స్‌ను స్థిరంగా ఉంచడానికి రోహిత్ అద్భుతమైన ఓర్పు మరియు సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. తర్వాత సౌరవ్ గంగూలీ 2000లో అడిలైడ్‌లో పాకిస్థాన్‌పై 141 పరుగుల చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ కార్లన్



యునైటెడ్ సిరీస్‌లో భాగం. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గంగూలీ కెప్టెన్‌గా ఆడి జట్టును నడిపించాడు. అతని ఇన్నింగ్స్ అద్భుతమైన పోరాట స్ఫూర్తిని ప్రదర్శించింది. ఇక జనవరి 2004లో యువరాజ్ సింగ్ ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో 139 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ ఒత్తిడిలో కూడా ఆడగల అతని సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 5వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన యువరాజ్, భారత్ 80 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పుడు జట్టును స్థిరపరిచి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను స్వీకరించాడు. జనవరి 2015లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 138 పరుగులు చేసిన రోహిత్ రెండో సారి ఈ లిస్ట్‌లో స్థానం సంపాదించాడు. ప్రారంభ వికెట్లు కోల్పోయిన తర్వాత, రోహిత్ ఓపికగా ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అతను సింగిల్స్‌తో పరుగులు సాధించాడు. తన విలక్షణమైన శైలిలో ఫోర్లు, సిక్సర్లు కొట్టాడు.

2015 ప్రపంచ కప్‌లో మెల్‌బోర్న్‌లో దక్షిణాఫ్రికాపై శిఖర్ ధావన్ 137 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి. ఇన్నింగ్స్ ప్రారంభించిన ధావన్ దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నాడు.

## జ్వెరెవ్ సంచన ఓటమి

### అగ్రస్థానానికి రిండర్‌క్నెచ్

**న్యూఢిల్లీ:** షాంఘై మాస్టర్స్ 2025లో అలెగ్జాండర్ జ్వెరెవ్ సంచలన ఓటమి చెందాడు. ఫ్రాన్స్‌కు చెందిన రిండర్‌క్నెచ్ చేతిలో ఘోర పరాజయం పాలయ్యాడు. షాంఘై మాస్టర్స్ టోర్నమెంట్‌లో ప్రపంచ మూడో నంబర్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెచ్ 4-6, 6-3, 6-2 తేడాతో ఓడించి, టోర్నమెంట్‌లో అగ్రస్థానంలో చేరుకున్నాడు. క్లిష్ట పరిస్థితుల్లో, 54వ ర్యాంక్‌లో ఉన్న ఫ్రెంచ్ ఆటగాడు ఒక సెట్ నుండి తిరిగి వచ్చి, మరింతగా ఉక్కిరిబిక్కిరి అయిన జ్వెరెవ్‌ను గందరగోళానికి గురయ్యేలా చేశాడు. షాంఘైలో తన చివరి మ్యాచ్ ముగిసే సమయానికి జ్వెరెవ్ బొటనవేలికి గాయమైంది. కానీ అతను ఈ టోర్నీ మూడవ గేమ్‌లో ఫోర్‌హ్యాండ్‌తో రిండర్‌క్నెచ్‌ను బ్రేక్ చేయడంలో ఇబ్బందులు పడలేదు. రెండవ సెట్ ప్రారంభంలోనే అతను దాదాపు ముందుకు వెళ్ళాడు. అయితే రిండర్‌క్నెచ్ పుంజుకుని సరైన సమయంలో, తెలివిగా దాడి చేయడంతో జ్వెరెవ్ ఒకింత ఇబ్బందికి గురయ్యాడు.



నాల్గవ గేమ్‌లో ఒత్తిడిని పెంచి చివరికి బ్రేక్ చేశాడు. అదే జోరును కొనసాగిస్తూ, మూడవ సెట్‌లో 30 ఏళ్ల అతను మూడవ గేమ్‌లో బ్రేక్ చేశాడు. ఏడో గేమ్‌లో డబుల్ ఫాల్ట్ రిండర్‌క్నెచ్‌ను మళ్ళీ బ్రేక్ చేయడానికి దారితీసేలా ప్రయత్నించాడు. కానీ రిండర్‌క్నెచ్ జ్వెవ్‌ను ఓడించడంతో ప్రపంచ నెంబర్ 3 టోర్నమెంట్ నుండి నిష్క్రమించక తప్పలేదు.

## రూ.2700 పెరిగిన బంగారం!

**ముంబయి, అక్టోబరు 7:** బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లేదు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. మంగళవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం



రూ.1, 23, 850కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1, 15, 500ను తాకింది. మరోవైపు కిలో వెండి ధర రూ.1, 54, 350కు చేరింది.పండగల సీజన్ కావడం, అంతర్జాతీయంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. వెండి కిలో రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని ఇటీవల మార్కెట్ పండితులు అంచనా వేసిన సంగతి తెలిసిందే.

## కనీస పింఛన్ రూ.2500..

### ఇపిఎఫ్ఒ ట్రస్టీ సమావేశంలో వెలువడనున్న నిర్ణయం

**ముంబయి, అక్టోబరు 7:** ప్రైవేట్ రంగంలోని ఉద్యోగులకు అదిరే శుభవార్త. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)కు చెందిన అత్యున్నత నిర్ణయాధికార కమిటీ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈనెల 10, 11 తేదీల్లో బెంగళూరులో సమావేశం కానుంది. ఈ సమావేశంలో కనీస పెన్షన్ పెంపుపై ప్రధానంగా చర్చ ఉండనుందని తెలుస్తోంది. కనీస పెన్షన్ రూ. 1000 నుంచి



రూ. 2500లకు పెంచే ప్రతిపాదనలపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అదే జరిగితే లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ పరిధిలో కనీస పెన్షన్ ప్రస్తుతం నెలకు రూ. 1000గా ఉంది. దీనిని 2014లో నిర్ణయించారు. అప్పటి నుంచి అదే పెన్షన్ కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ఉద్యోగుల సంఘాలు కనీస పెన్షన్ రూ. 1000 అనేది చాలా తక్కువగా ఉందని, ప్రస్తుత ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస పెన్షన్ రూ. 7500లకు పెంచాలని పలు ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్ల అసోసియేషన్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు కనీస పెన్షన్‌ను 7.5 రెట్లు పెంచేందుకు సుముఖంగా లేరు. అయితే, రూ.1000 నుంచి రూ.2500లకు పెంచేందుకు ఆమోదం తెలపవచ్చని తెలుస్తోంది. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) పరిధిలో పెన్షన్ లెక్కించేందుకు ఒక స్థిరమైన ఫార్ములా ఉంది. పెన్షన్ శాలరీ అంటే బేసిక్ శాలరీ ప్లస్ గత 60 నెలల డీఏ (గరిష్ఠంగా రూ. 15000)గా లెక్కలోకి తీసుకుంటారు. పెన్షనేబుల్ శాలరీ గరిష్ఠ పరిమితి రూ. 15000గా ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తి 35 సంవత్సరాలు సర్వీసులో ఉంటే అతనికి నెలకు రూ. 7500 వరకు పెన్షన్ లభిస్తుంది. 58 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగాల్సి ఉంటుంది. ముందే ఉద్యోగం వదిలేస్తే విత్‌డ్రాయల్ బెనిఫిట్స్‌తో పాటు తగ్గించిన పెన్షన్ లభిస్తుంది. అంటే చేతికి అందే పెన్షన్ భారీగా తగ్గిపోతుంది. పూర్తి సర్వీసులో ఉన్న వారికి గరిష్ఠ పెన్షన్ లభిస్తుంది.

## టాటా ఇన్వెస్ట్‌మెంట్ షేర్లలో భారీ పతనం!

**ముంబయి, అక్టోబరు 7:** టాటా గ్రూప్ నుంచి దాదాపు రెండేళ్ల తర్వాత మరో పెద్ద ఐపీఓ వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టాటా క్యాపిటల్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. అయితే ఈ ఐపీఓ బజ్‌తో ఇటీవల భారీగా పెరిగిన టాటా గ్రూప్‌కే చెందిన టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ షేర్ ధర మంగళవారం భారీగా పతనమై ఇన్వెస్టర్లకు తీరని నష్టాల్ని మిగిల్చింది. ఇంట్రాడేలో దాదాపు 7 శాతం వరకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక శాతానికిపైగా లాభంతోనే ప్రారంభమైంది. ఇంట్రాడేలో 2 శాతం వరకు పెరిగింది. అక్కడి నుంచి వరుసగా పతనమవుతూనే వచ్చింది. ఇంట్రాడేలో 8 శాతానికిపైగా పతనంతో రూ. 9,123 వద్ద కనిష్టాన్ని తాకింది. ఇక్కడ చూస్తే షేర్ ధర కిందటి క్లోజింగ్ నుంచి ఏకంగా రూ. 800కుపైగా పడిపోయింది. ఇంట్రాడే గరిష్టం నుంచి



చూస్తే రూ. 1000కిపైగా పడిపోవడం గమనార్హం. టాటా ఇన్వెస్ట్‌మెంట్ స్టాక్ ఇటీవల భారీగా పుంజుకుంది. కొన్ని నెలలుగా50 శాతానికిపైగా స్థిరంగా రిటర్న్లు ఇస్తూ వచ్చింది. ఐదేళ్లలో చూస్తే ఏకంగా 900 శాతానికిపైగా రాబడి అందించింది. స్టాక్ స్ప్లిట్, ఐపీఓ వంటివి ఉన్నాయి. ఇన్వెస్టర్లను ఊరించేలా టాటా క్యాపిటల్ ఐపీఓపై ప్రకటన వచ్చింది. మరోవైపు టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ తొలిసారిగా స్టాక్ స్ప్లిట్ కూడా ప్రకటించింది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 11,847 కాగా కనిష్ట ధర రూ. 5,145 గా ఉంది. కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 47.61 వేల కోట్లుగా ఉంది. సెప్టెంబర్ నెలలో ఈ స్టాక్ ఏకంగా 50 శాతానికిపైగా పుంజుకుంది.



### రెండోరోజూ లాభాల్లోనే

## స్టాక్ మార్కెట్లు

**ముంబయి, అక్టోబరు 7:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం రెండో రోజు కూడా పాజిటివ్ ధోరణిలో కొనసాగాయి. ఈ క్రమంలో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 462.15 పాయింట్లు ఎగసి 82,252.27 స్థాయికి చేరుకుంది. అదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 124.55 పాయింట్లు పెరిగి 25,197.70 వద్ద నిలిచింది. ఈ నిఫ్టి రికార్డ్ స్థాయికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున లాభపడ్డారు. సెన్సెక్స్‌లో టాప్ గెయినర్స్, లూజర్స్ ఈ క్రమంలో సెన్సెక్స్‌లోని కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ వంటి షేర్లు 1.9 శాతం వరకు లాభాలను అందుకోగా, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. వీటి పనితీరు మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలను చూపించింది. ఈ క్రమంలో మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్100, స్మాల్‌క్యాప్100 సూచీలు వరుసగా 0.42 శాతం, 0.34 శాతం లాభాలతో ట్రేడయ్యాయి. సెక్టోరల్ సూచీల్లో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్, నిఫ్టీ రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.8 శాతం వరకు పెరిగి అగ్రగామిగా నిలిచాయి. కానీ నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.3 శాతం వరకు తగ్గాయి. వొడాఫోన్ ఐడియా షేర్లు మంగళవారం అద్భుత జోష్‌తో దూసుకెళ్లాయి. బీఎస్ఈలో కంపెనీ షేరు 8 శాతం పెరిగి రూ. 9.2 వద్ద ఎనిమిది నెలల గరిష్ట స్థాయిని తాకింది. సెప్టెంబర్ నుంచి ఈ షేరు ధర ఏకంగా 42 శాతం పెరిగింది. బిఎస్ఇలో మిడ్‌ఖ్యాప్‌సూచీ 0.45శాతం లబ్ధిపొందితే స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.15శాతం క్షీణించింది.

## డిబిటితో రూ.4.31 లక్షల కోట్లు ఆదా

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**ముంబై, అక్టోబర్ 7:** వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్ధిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని కేంద్రం చెపుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా



సీతారామన్ ఈ వివరాలు స్వయంగా వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్రమంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్‌టైమ్ ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు. దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, యుపిఐ డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను కాపాడుతూ, ప్రతి పౌరుడిని ఉద్ధరించేలా, టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటి వరకూ భారత్‌లో ఉన్న బ్యాంకులు లేదా కంపెనీలు అమెరికా డాలర్లు, యూరోలు, యెన్ వంటి విదేశీ కరెన్సీల్లో లావాదేవీలు చేయాలంటే, అవి ఇప్పటివరకు హాంకాంగ్, టోక్యో లేదా లండన్ బ్యాంకుల ద్వారా సెటిల్ చేసేవి. ఈ ప్రక్రియకు 36 నుండి 54 గంటల సమయం పట్టేది. కానీ ఇప్పుడు,గిఫ్ట్ సిస్టమ్ ద్వారా భారత్‌లోనే ఈ లావాదేవీలను రియల్ టైమ్‌లో (తక్షణమే) పూర్తి చేయొచ్చు. గిఫ్ట్ ట్రాన్సాక్షన్స్ ద్వారా భారత్ ఇప్పుడు హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన నిలిచింది. విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్స్‌లో సమయం, ఖర్చు రెండూ తగ్గుతాయి. బ్యాంకులు, కంపెనీలు, ఇన్వెస్టర్లకు తక్కువ సమయంలో సులభమైన లావాదేవీలు జరిగే వీలు. భారత్ అంతర్జాతీయ ఫైనాన్షియల్ హబ్‌గా ఎదగడంలో ఇది కీలకం.




### నేటి నుంచి యుపిఐ చెల్లింపుల్లో

## బయోమెట్రిక్ ఫీచర్

### ముఖ గుర్తింపు లేదా వేలిముద్రలతోనే చెల్లింపులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** డిజిటల్ చెల్లింపుల రంగంలో మరో అద్భుతమైన మార్పురాబోతోంది. రేపటి నుంచిబుధవారంనుంచి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) వినియోగదారులు పిన్ లేదా పాస్‌వర్డ్ నొక్కకుండానే చెల్లింపులు చేసుకోవచ్చు. మీ ముఖం లేదా వేలిముద్ర ద్వారా చేసుకునే ఛాన్సుంది. బయోమెట్రిక్ ఆధారిత గుర్తింపు విధానంతో యూపీఐ చెల్లింపులు ఇకపై మరింత సులభం కానున్నాయి. ఇప్పటివరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడానికి మనం నాలుగు లేదా ఆరు అంకెల పిన్‌ను ఎంటర్ చేయాల్సి వస్తుంది. కానీ ఇకపై ఆ పిన్ అవసరం లేదు. భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ ఆధారంగా నమోదైన మీ బయోమెట్రిక్ డేటా (ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర) ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ సాంకేతికత మీ గుర్తింపును త్వరగా ధృవీకరించి, సురక్షితంగా లావాదేవీలను పూర్తి చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల డిజిటల్ చెల్లింపులకోసం పిన్‌తో పాటు ఇతర గుర్తింపు పద్ధతులను అనుమతించింది. దీనిలో భాగంగా బయోమెట్రిక్ ఆధారిత ధృవీకరణ విధానం అమల్లోకి వస్తోంది. ఈ కొత్త ఫీచర్ యూపీఐ చెల్లింపులను మరింత వేగవంతం చేయడమే కాకుండా, వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. పిన్‌ను గుర్తుంచుకోవడం లేదా టైప్ చేయడం వంటి ఇబ్బందులు ఇక ఉండవు. మీరు యూపీఐ యాప్ ద్వారా చెల్లింపు చేయాలనుకున్నప్పుడు, పిన్ ఎంటర్ చేయడానికి బదులు మీ స్మార్ట్‌ఫోన్ కెమెరా ద్వారా ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర స్కానర్ ద్వారా ధృవీకరణ చేయాలి. ఈ డేటా ఆధార్ డేటాబేస్‌తో సరిపోల్చబడి, క్షణాల్లోనే మీ లావాదేవీ పూర్తవుతుంది. ఈ ప్రక్రియ వేగవంతం కావడమే కాదు, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ డేటా కారణంగా సురక్షితంగా ఉంటుంది. ఈబయోమెట్రిక్ ఫీచర్ ప్రతిఒక్కరికీ ఉపయోగపడుతుంది. ప్రధానంగా టెక్నాలజీ పెద్దగా పరిచయంలేనివారు, పిన్‌ను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడేవారికి ఇది సౌలభ్యంగా ఉంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.